"విశాలాంధ్ర"
చందా వివరాలు
దినపత్రిక 12 పైసలు, ఆదివారం సంచిక 15 పైసలు

	ఏజంటుద్వారా		పోస్టుద్వారా
సంవత్సరానికి	రు. 44-00	....	రు. 58-00
6 నెలలకు	22-00	....	29-00
3 నెలలకు	11-25	....	14-50
నెలకు	3-75	....	5-00

VISALAANDHRA Phone 5301 ఉదయం ★★ Regd No. H. 201

విశాలాంధ్ర

703052

సంపుటి 19 సంచిక 138] విజయవాడ 6-8-1969 బుధవారం [6 పేజీలు 12 పై.

గుణము పొదుపు
అక్షలాదుల్లు నుపయోగించు
సాధారణము పాకెట్లు శిప్పు ఉమ్ము
సంజక్ గూడు పండ్లపొడి
1,01,000 బహుమతిని ఇచ్చుటకు సిద్ధముగానుండినవి: పండ్లసంకటములను అణచును
నమ్మకమైన ఆయుర్వేద ఔషధములు
ఆల్‌మంత్రిక్ నరముల బలవృద్ధి టానిక్
ఉజాలా ఆరోగ్యమును వృద్ధిపరచును
బ్రుంగామలక తైలము
సోల్ ఏజంట్లు: యునైటెడ్ కెమికల్స్ మదరాసు-1, హైదరాబాద్, విజయవాడ, బొంబాయి-19
మా స్టాకిస్టులుగా నుండుటకు మీ కిష్టమేనా?

నక్సలైట్లపై జరుపుతున్న పాశవిక నిర్బంధకాండకు స్వస్తి చెప్పాలి

పోలీసు చర్యలపై న్యాయవిచారణ జరిపించాలని ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ రాజశేఖర్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 5

నక్సలైట్లపై పోలీసులు జరుపుతున్న పాశవిక నిర్బంధ కాండకు ప్రభుత్వం వెంటనే స్వస్తి చెప్పాలని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖరరెడ్డి నేడొక ప్రకటనచేస్తూ డిమాండ్ చేశారు.

శ్రీ రాజశేఖరరెడ్డి ప్రకటన పూర్తిపాఠం ఇలా వున్నది:

శ్రీకాకుళంజిల్లాలో తాజాగా అరెస్టులు జరిగినట్లు వార్తలు లేకపోయినప్పుడు, పోలీసులు ఆ ప్రాంతంలో జరిపిన దాడులలో ఇంతమంది నక్సలైట్లు చనిపోయినట్లు ప్రభుత్వం చెపుతున్న కథను ఎవరూ నమ్మరు.

పోలీసులు గిరిజనులను, గ్రామాలలోని ప్రజలను అరెస్టుచేసి అడవులలోకి తీసుకుని వెళ్ళి కాల్చి చంపుతున్నారని నిరంతరం వినపడుతున్న వదంతులను నమ్మకుండ వుండటం కష్టం.

తెలంగాణాలో అనహ్యానికి గురైన పంజప్ప కాలంలోను, 1948-50సంవత్సరాల మధ్య ఉమ్మడి మద్రాసు రాష్ట్రంవున్నప్పుడు ఆంధ్ర ప్రాంతంలోను ఉపయోగించిన ఎత్తుగడలనే ఉపయోగించారు.

నాగరికత తెలిసిన ఏ ప్రభుత్వం కస్టడీలో వున్న ప్రజలను కాల్చివేయదు. మావో-సే టుంగ్ భావాలకు భారత కమ్యూనిస్టుపార్టీ వ్యతిరేకత తెలియచేస్తున్న విషయం అందరికి తెలుసు. నక్సలైట్లఎత్తుగడలు దేశంలోనిప్రజాతంత్ర ఉద్యమానికి ఉపయోగంలేని దుస్సాహస విధానాలని మేము ఖండించాం.

ప్రజా బాధ్యత తెలిసిన ఎవరూ పోలీసులు జరిపిన హత్యాకాండను సహించరు ఈ ప్రాంతంలో పోలీసుల ప్రవర్తనపై న్యాయ విచారణను జరిపించాలని మేము డిమాండు చేస్తున్నాం.

తమ గ్రామాలలోవున్న నక్సలైట్ల జాబితాను తయారుచేయవలసిందిగా ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసినట్లు తెలుస్తున్నది. అవినీతి పరులైన ఈ గ్రామ అధికారులతమకు వ్యతిరేకంగా వున్నవా పేర్లన్నింటినీ యిస్తారని తెలుసు.

ప్రభుత్వం వెంటనే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకుని, పాశవిక దమనకాండకు స్వస్తి చెప్పాలి, బలవంతంగా బేదఖల్ చేయటాన్ని, కంట్రాక్టర్లు జరుపుతున్న దోపిడి మొదలగు సమస్యలను పరిష్కరించాలి.

హైద్రాబాద్‌లో శ్రీ గిరికి స్వాగత సన్నాహాలు

హైదరాబాదు, ఆగస్టు 5

వామపక్ష ప్రజాతంత్ర పార్టీలు, వ్యక్తులు, కాంగ్రెసులోనిఒకవర్గం బలపరచగా రాష్ట్రపతి పదవికి పోటీచేస్తున్న అభ్యర్థి శ్రీ వి.వి.గిరి రేపు హైదరాబాదు వస్తున్నసందర్భంగా, బేగంపేట విమానాశ్రయంలో బ్రహ్మాండమైన స్వాగతమివ్వడానికి జంటనగరాలలోని ప్రజానీకం సిద్ధులౌతున్నారు.

శ్రీ గిరి రేపు బెంగుళూరు నుండి మధ్యాహ్నం 3.55 గంటలకు విమానంలోవస్తారు.

శ్రీ గిరికి స్వాగత మిచ్చేందుకు, వారి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్నిజరిపేందుకు ఏర్పాటైన అఖిలపక్ష కమిటీ, పెద్దసంఖ్యలో ప్రజలు విమానాశ్రయం వద్దకు వచ్చి, వారికి ఘనంగా స్వాగతం ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేసింది.

జంటనగరాల్లోని బ్యాంకుల ఉద్యోగులు ప్రత్యేక బస్సులలో వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. అలాగే సనత్‌నగర్, [illegible] కార్మికులు మూడుప్రత్యేకబస్సులలో విమానాశ్రయం చేరుకుంటారు, రైల్వేకార్మికులు, అధికసంఖ్యలో విమానాశ్రయానికి రావడానికి సన్నాహాలు పూర్తి అయాయి.

నగర కమ్యూనిస్టు సమితి తరపున, నగర ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ తరపున ప్రత్యేక బస్సులలో వెళ్ళేందుకు ప్రజా సమీకరణ జరుగుతోంది.

అలాగే విద్యార్థులు, యువజనులు, యువకులు, శ్రీ గిరి కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని, శ్రీ గిరికి పెద్ద ఎత్తున స్వాగతం యివ్వడానికి ఆయత్తమౌతున్నారు.


Vijayan
ఆసియా గడ్డపై జీవకోటి లక్షణాలు!
ఆసియా
రెండు దశాబ్దాల అమెరికా విధానాల తరువాత కూడా ఇంకా అక్కడ జీవకోటి లక్షణాలు ఉండటం చాలవింత విషయమే!

అమెరికా అధ్యక్షుడు నిక్సన్ ఇటీవల ఆసియాలో పర్యటించారు

— By Agreement With Sankars weekly

కొత్తగూడెం పోలీసు కాల్పుల్లో యిద్దరు మృతి

హోం మంత్రి శ్రీ జలగం వెంగళరావు రాక సందర్భంగా ప్రదర్శన

(విశాలాంధ్ర విలేకరి)

కొత్తగూడెం ఆగస్టు 5

రాష్ట్ర హోంమంత్రి శ్రీజలగం వెంగళరావు రాక సందర్భంగా ప్రదర్శన జరిపిన వారిపై నేడుదయం కొత్తగూడెంలో పోలీసులు కాల్పులు జరపగా ఇరువురు మరణించారు.

కాల్పులలో మరో ముగ్గురు గాయపడ్డారు.

హోం మంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రసంగిస్తూన్న రామచంద్ర ఆర్ట్సు కాలేజీ వద్ద పోలీసులు మొత్తం 10 సార్లు కాల్పులు జరిపారు. ఈ రోజు ఉదయం నుండి శ్రీ జలగం వెంగళరావు అనుకూల వర్గానికి, తెలంగాణా ఆందోళన కారులకు మధ్య ఘర్షణ జరుగుతున్నది.

పోలీసు కాల్పులలో మృతి చెందిన వారిలో 10 సంవత్సరాల బాలుడు దస్తగిరి, శ్రీ రామచందర్ (25 సంవత్సరాలు. మైలర్)లు వున్నారు.

కాల్పులలో యం. యస్. సాంబయ్య కె మాధవయ్య శ్రీ డి. సత్యనారాయణలకు గాయాలు తగిలాయి, శ్రీ మాధవయ్య పరిస్థితి విషమంగా వున్నది. పట్టణంలో యింకా ఉద్రిక్త పరిస్థితి వున్నది.

పోలీసుల కథనం

పోలీసులపై దాడి జరిపిన ప్రదర్శకులను చెదరగొట్టేందుకు పోలీసులు కాల్పులు జరపగా నలుగురు గాయపడినట్లు పోలీసు ప్రధాన కార్యాలయానికి అందిన వర్తమానం తెలియచేస్తున్నది ప్రదర్శకులు పోలీసులపై చేసిన దాడిలో డిప్యూటీ పోలీసుసూపరింటెండెంటు ఇద్దరు సబ్‌యిన్స్‌పెక్టర్లు, యిద్దరు పోలీసు కానిస్టేబుల్సు గాయపడినట్లు పోలీసులు ప్రకటించారు. యీ రోజు వుదయం 10గంటలకు హోంమంత్రి శ్రీ వెంగళరావు ఒక హాలులో జరుగుతున్నసమావేశంలో ప్రసంగిస్తుండగా, షాపు యజమానిపై చెయ్యిచేసుకొన్న గ్రామ మున్సిఫ్ దండించేందుకు కొంత మంది కర్రలతోను, రాళ్ళతోను హాలులోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. తరువాత బజారుల్లో ప్రజలు పోగయ్యారు. ఆగ్రహపరులైన గుంపు పోలీసులపై దాడి చేయటంతో పోలీసులు ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపినట్లు అధికార ప్రకటనలో పేర్కొన్నారు.

కాల్పులపై రాజేశ్వరరావు ఖండన

పోలీసులు యీ రోజు జరిపిన కాల్పులను సింగరేణి కాలరీ వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి శ్రీ వి. రాజేశ్వరరావు ఖండించారు. ఈ సంఘటనపై విచారణ జరిపించాలని ఆయన డిమాండుచేశారు.

కాల్పులలో గాయపడినవారి కుటుంబాలకు వర్కర్సు యూనియన్ తన గాఢ సానుభూతిని తెలియచేస్తున్నది.

కొత్తగూడెంకు మగ్దూం పయనం

పోలీసు కాల్పుల్లో యిద్దరు మరణించినట్లుగా వార్తలందగానే ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు, శాసనమండలిలో కమ్యూనిస్టుపక్ష నాయకులు అయిన శ్రీ మగ్దూం మొహియుద్దీన్ యీ రోజు సాయంత్రం కొత్తగూడెం బయలుదేరి వెళ్ళారు.

తెలంగాణావాదుల హింసాత్మక చర్యల అణచివేత

శ్రీ వెంగళరావు హెచ్చరిక

భద్రాచలం, ఆగస్టు 4

హింసాత్మక చర్యలకు పాల్పడవలదని తెలంగాణా ప్రజాసమితి నాయకులకు విజ్ఞప్తి చేస్తూ హింసాత్మక చర్యలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తామని రాష్ట్ర హోంమంత్రి శ్రీ జె. వెంగళరావు నేడిక్కడ పత్రికా విలేకరులతో అన్నారు.

ప్రత్యేక తెలంగాణా ఆందోళన సందర్భంగా ప్రభుత్వానికి రు. 50 కోట్లకుపైగా నష్టం వచ్చిందని ఆయన చెప్పారు.

ఆందోళన కాలంలో శాంతియుతంగా ఉన్న ఖమ్మం జిల్లా ప్రజలను అభినందించారు.

ఆగస్టు 8 వ తేదీ నాటికి ఖమ్మంజిల్లాలో పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. ఈ విషయంలో మిగతా తెలంగాణా ప్రాంతానికి ఆదర్శంగా నిలచి ప్రభుత్వంతో సహకరించవలసిందిగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఏజన్సీ ప్రాంతాలలో నక్సలైట్ల కార్యకలాపాలను మాసం రోజులలో అణచివేస్తామని ఆయన చెప్పారు.

బంద్ ఆర్గనైజర్లకు శ్రీమతి రోడామిస్త్రీ విజ్ఞప్తి

పాఠశాలలకు హాజరు కాదలచుకున్న విద్యార్థులపైన, కోర్టులకు హాజరుకాదలచుకున్న న్యాయవాదులపై బలప్రయోగం చేయవద్దని బంద్ ఆర్గనైజర్లకు రాష్ట్ర మహిళా సంక్షేమమంత్రి శ్రీమతి రోడామిస్త్రీ నేడొక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బంద్ ఆర్గనైజర్లు వారి అభిప్రాయాలను ఇతరులపై రుద్దకూడదని ఆమె చెప్పారు.

తమ ప్రాణాలకు, ఆస్తులకు నష్టం జరుగుతుందనే భయం కొద్దీ అనేకమంది వ్యాపారులు దుకాణాలు తెరవడంలేదు, దుకాణాలు తెరవదలచుకొన్నవారిపై దాడులు చేయబోమని దుకాణదార్లకు ప్రత్యేక తెలంగాణా ఆందోళనకారులు హామీ యివ్వాలని ఆమె తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల పునఃప్రారంభం

రాష్ట్ర రాజధానిలో 130 కు పైగా నున్న ప్రైవేట్ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయని, ఈ పాఠశాలలకు విద్యార్థులు స్వచ్ఛందంగా హాజరవుతున్నారని గ్రేటర్ హైదరాబాదు ప్రైవేటు స్కూళ్ళ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలియచేసింది.

శ్రీ ధర్మారెడ్డి అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 5

తెలంగాణా విద్యార్థి నాయకుడు శ్రీ ధర్మారెడ్డిని నేడుదయం పోలీసులు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంక్రింద అరెస్టు చేసి, ముషీరాబాదు జైలుకు పంపించారు.

ఆగస్టు 17 నుంచి ప్రదేశ్ కమ్యూనిస్టు కార్యవర్గ సమావేశం

హైదరాబాద్, ఆగస్టు 5

భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయ సమితి సమావేశం ఆగస్టు 20 నుండి గాక 26 నుండి ఢిల్లీలో సమావేశం మవుతున్నది. జాతీయ సమితి సమావేశం తేదీలలో మార్పువల్ల ప్రదేశ్ కార్యవర్గాన్ని ఆగస్టు 17, 18, 19 తేదీల్లో విజయవాడలో సమావేశపర్చటానికి నిర్ణయమైనదని రాష్ట్రసమితి సహాయ కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ తెలియపరుస్తున్నారు. సభ్యులు 17 వ తేదీ ఉదయానికే విజయవాడ చేరుకోవాలని కోరుతున్నాం.

ఉపరాష్ట్రపతి పదవికి మొదటి నామినేషన్

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ఉపరాష్ట్రపతి పదవికి నేడు రిటర్నింగ్ ఆఫీసరువద్ద మొదటి నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్ వేసిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుజిల్లాకు చెందిన శ్రీ యస్. నాగప్ప.

శ్రీనాగప్ప పేరును జనసంఘ్ పార్లమెంటు సభ్యులు శ్రీ స్వామిబ్రహ్మానంద, శ్రీ బల్లి నారాయణ్‌సింగ్‌లు బలపరిచారు.

నామినేషన్‌లు దాఖలు చేసేందుకు చివరి తేదీ ఆగస్టు 9.

ప్రజలతో సంబంధం లేని నక్సలైట్లు!

ఉగ్రవాద నాయకుడు శ్రీ నాగిరెడ్డి విమర్శ

హైదరాబాదు, ఆగస్టు 4

నక్సలైట్లు అనుసరిస్తున్న పద్ధతి ప్రజల డిమాండ్లతోగాని, వారి పోరాటాలతోగాని, ప్రజలు పాల్గొనడం అనే దానితో నిమిత్తం లేకుండా ఉన్నదని ఉగ్రవాద నాయకులు శ్రీ టి. నాగిరెడ్డి నేడిక్కడ యు.ఎన్.ఐ.కు యిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

భూస్వాముల గూండాయిజానికి, ప్రభుత్వ నిర్బంధ కాండకు ప్రతిఘటనగా సాయుధ పోరాటం జరపాలనే విశ్వాసంతో తమ గ్రూపు ఉన్నది. అలా కాకుండా ముందుగానే భూస్వాములపై దాడులు జరుపడంపట్ల నక్సలైట్లకు విశ్వాసం ఉన్నదని ఆయన అన్నారు.

శ్రీకాకుళంజిల్లా పార్వతీపురం ఏజన్సీ ప్రాంతంలోని నక్సలైట్ల చర్యలను అభినందిస్తూ ఆ పోరాటానికి ప్రజా సమస్యలు పునాదిగా ఉన్నాయన్నారు.

ప్రజాఉద్యమంకాని, ప్రజలు పాల్గొనకుండానే మైదాన ప్రాంతాలలోజరుగుతున్న చర్యలతో ఆయన ఏకీభవించలేదు.

సాయుధ పోరాటం చాల ముఖ్యమైన పోరాటం అని తమ గ్రూపు విశ్వసిస్తున్నది. అయితే అన్నిప్రాంతాలలోనూ అదిఒక్కటే మాత్రమే పోరాటరూపం కాదని తెలిపారు.

సంతకాల కార్యక్రమంతో సహా వివిధ పోరాటరూపాలు

ప్రజలు తమ డిమాండ్ల సాధనకై సాగించే వివిధ పోరాటాల క్రమంలో సంతకాల సేకరణ, సంప్రదింపులు, ప్రదర్శనలతో సహా వివిధ పోరాట పద్ధతులను వినియోగిస్తామని శ్రీ నాగిరెడ్డి అన్నారు.

భూస్వాముల, ప్రభుత్వ నిర్బంధకాండకు వ్యతిరేకంగా జరిగే ప్రతిఘటనా ఉద్యమంగా అవి మార్పుచెందుతాయనే స్పష్టమైన అవగాహనతోనే వివిధ పోరాట పద్ధతులను వినియోగించడం జరుగుతుందని అన్నారు.

తెలంగాణాలో రు. 2 కోట్లు రైల్వే ఆస్తికి నష్టం

న్యూఢిల్లీ, ఆగస్టు 5

తెలంగాణాలో 1939 జూన్ నాటికిదాకా రు. 2.03 కోట్లు రైల్వేఆస్తికి నష్టంచేయుటం కాని, విధ్వంసించటంకాని జరిగింది.

ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి శ్రీరామ్ సుభగ్‌సింగ్ నేడు లోక్‌సభలో తెలియచేశారు.

వరదలవల్ల రు. 6.63 కోట్లు నష్టం

దక్షిణ భారతదేశంలో మే-జూన్ మాసాల మధ్య సంభవించిన వరదలవల్ల దాదాపు రు. 6.63 కోట్ల నష్టం సంభవించిందని శ్రీ సింగ్ తెలియచేశారు.

కేరళ ఐక్యసంఘటన సంక్షోభ పరిష్కారం

మంత్రుల అవినీతి ఆరోపణలపై దర్యాప్తుకు శాసనసభా కమిటీ

మార్క్సిస్టునాయకులు అంగీకరించినట్లువార్త

తిరువనంతపురం, ఆగస్టు 4

మంత్రులపై వచ్చిన అవినీతి ఆరోపణలలో ప్రాథమిక సాక్ష్యాధారం ఉన్నట్లయితే వాటి దర్యాప్తుకు శాసన సభా కమిటీని నియమించాలని ముస్లింలీగ్ చేసిన సూచనను మార్క్సిస్టుపార్టీ నాయకులు అంగీకరించడంతో కేరళ ఐక్య సంఘటనలోని సంక్షోభం దాదాపుగా పరిష్కారం అయినట్లేనని యిక్కడ భావిస్తున్నారు.

ముఖ్యమంత్రిచే యిప్పటికే దర్యాప్తు చేయబడిన కేసులు ఈ కమిటీ దర్యాప్తు క్రిందకు రావు.

నేడిక్కడ ముస్లింలీగ్, మార్క్సిస్టుపార్టీ నాయకులమధ్య జరిగిన చర్చలలో ముస్లింలీగ్ ప్రతిపాదించిన 3 అంశాలపై ఏకీభావం కుదిరింది.

అవినీతి ఆరోపణలపై దర్యాప్తు ఐక్య సంఘటనలోని భాగస్వాముల పరస్పర నిందారోపణలు, మాజీ పి. యస్. పి. మంత్రి శ్రీ కుంజా మంది తీసుకున్న అధికారాలను తిరిగి అప్పగించడం విషయాలపై ఏకీభావం కుదిరింది.

ఐక్యసంఘటనలోని భాగస్వామ్య పార్టీల పరస్పర నిందారోపణలపై పరిశీలనకు విశ్వాసికమైన యంత్రాంగాన్ని ఏర్పరచాలని అందుకు బాధ్యులైనవారు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, కాని అందుకు తిరస్కరిస్తే వారిని బహిష్కరించాలనే విషయాన్ని ఖరీయులూ ఆమోదించారు.

శ్రీ కుంజామండి ముఖ్యమంత్రి తీసుకున్న అధికారాలను మరొక పి. యస్. పి. మంత్రి శ్రీ పి. ఆర్. కురుప్‌కు అప్పగించడానికి ఆమోదించారు. అయితే స్టోర్సు పర్చేజ్ విభాగాన్ని మాత్రం అప్పగించరు.

ముస్లింలీగ్ ప్రతిపాదించిన సూచనలకు కమ్యూనిస్టుపార్టీ, ఆర్.యస్.పి., ఐ.యస్.పి. పార్టీలు లోగడనే హర్షాన్ని వ్యక్తం చేశాయి.

శ్రీ నంబూద్రిపాద్ వ్యాఖ్య

ముస్లింనాయకులతో చర్చలు ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ పత్రికావిలేకరులతో మాట్లాడుతూ ఐక్యసంఘటన బద్దలైపోతుందనిచెప్పిన జోస్యాలు ఈసారికూడా వైఫల్యం చెందాయని అన్నారు.

శ్రీ నంబూద్రిపాద్ నివాస భవనంలో ముస్లింలీగ్ నాయకులు చర్చలు జరిపారు.

ఐక్యసంఘటన సమన్వయ కమిటీ సమావేశంగురించి నిన్న ముస్లింలీగ్ ప్రతినిధులు వాకౌటుచేసిన విషయం పాఠకులకు విదితమే.

ప్రధానితో శ్రీ మురార్జీ చర్చలు

ఉపరాష్ట్రపతి ఎన్నికపై

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీతో మాజీ ఉపప్రధాని శ్రీమురార్జీ దేశాయ్‌నేడుపార్లమెంటు భవనంలోని ప్రధాని కార్యాలయంలో చర్చలు జరిపారు.

ఉపరాష్ట్రపతి పదవికి కాంగ్రెసు అభ్యర్థి నియామకాన్ని గురించి చర్చించినట్లు తెలుస్తున్నది.

రెండువారాల క్రితం మురార్జీ మంత్రివర్గం నుంచి రాజీనామా చేసిన అనంతరం వీరిద్దరిమధ్య సమావేశం జరగడం యిదే ప్రథమం. ఈ సమావేశం 25 నిమిషాల పాటు జరిగింది.

సమావేశం చర్చలను వెల్లడించడానికి శ్రీ మురార్జీ నిరాకరించారు.

సమావేశం అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి రాష్ట్రపతి ఎన్నికకు కాంగ్రెసు అభ్యర్థిని ఎంచుకోవటం విషయంలో పెద్దగా యిబ్బందులేమీ వుండదని అన్నారు.

నేటి సాయంత్రం జరిగే పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ప్రతిదీ సాఫీగా జరుగుతుందని ఆశిస్తున్నానని ఆయన చెప్పారు.

4వ ప్రణాళికలో

ఆదాయ వ్యత్యాసాల నిర్మూలనకు చర్యలు

రాజ్యసభలో ప్రధాని ఇందిరాగాంధీ వివరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ఆదాయాలలోని వ్యత్యాసాలను తొలగించేందుకు నాల్గవ ప్రణాళికా కాలంలో వెనుకబడ్డప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటుకూ, మెట్ట ప్రాంత రైతుల ఆదాయం పెరుగుదలకూ ప్రత్యేక పథకాలు చేపడుతామని ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి నేడు రాజ్యసభలో అన్నారు.

బీదప్రజలకు ప్రభుత్వం కేవలం 'మాటల సానుభూతే' చూపుతున్నదని వచ్చిన విమర్శలను ప్రధాని త్రోసిపుచ్చారు.

వ్యత్యాసాలు పెరుగుదల

ఆదాయం, ఐశ్వర్యంలో వ్యత్యాసాలు ఇంకా వున్నాయని శ్రీ చిత్తబాసు వెల్లడించిన అభిప్రాయాలతో ప్రధాని ఏకీభవించారు పరిస్థితి నిరంతరంగా మార్పు చెందుతున్నదని, కొన్ని ప్రాంతాల్లో వ్యత్యాసాలు తగ్గినా మరికొన్ని ప్రాంతాలలో పెరిగిపోతున్నాయని ప్రధాని అన్నారు.

ప్రభుత్వం నీటిపారుదల సౌకర్యాలుగల భూములలో పంట అభివృద్ధికి కార్యక్రమం కోవడంతో మాగాణి భూమిగల రైతులకు ఎక్కువ ఆదాయం లభిస్తున్నదని మెట్టభూములు గల రైతుల ఆదాయం ఏవిధంగా పెరుగగలదనే అంశాన్నిప్రభుత్వం పరిశీలిస్తున్నదని శ్రీమతి గాంధి చెప్పారు.

క్రుంగిపోతున్న బీదలు

గత నాలుగైదు సంవత్సరాలనుండి తక్కువ ఆదాయం గల ప్రజల తలసరి ఆదాయం తగ్గుతూనే వున్నదనీ, ఆదే సమయంలో టాటాలు, బిర్లాలు, మఫత్‌లాల్‌ల ఆదాయం విపరీతంగా పెరిగిపోయిందనీ, ప్రభుత్వం బీదలపట్ల సానుభూతి వచనాలు మాత్రమే పలుకుతున్నదని శ్రీ అర్జున్ అరోరా అన్నారు. తక్కువ ఆదాయంగల ప్రజల సహాయార్థం ప్రభుత్వం తక్షణమే పూనుకోవాలని అన్నారు.

ప్రభుత్వం తీసుకున్న చర్యల మూలం

(మిగతా 2 వ పేజీలో)

పించనుదారులకు సహాయం నాస్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 4

నిధుల కొరతదృష్ట్యా పించనుదారులకు యింకా సౌకర్యం కల్పించటంగానీ, పించనులు పెంచడంగానీ జరుగదని నేడు లోక్‌సభలో ఆర్థికశాఖ స్టేట్‌మంత్రి శ్రీ పి. సి. సేథీ అన్నారు.

ఆగస్టు 8 మ్యాటనీతో విడుదల



భానస్ కౌబాయ్ రవి
నాగేష్
శ్రీశ్రీనివాస ఫిలింస్
ఆదర్శ పెళ్ళిళ్ళు
ఈస్ట్‌మన్ కలర్
తప్పక చూడండి
పూర్ణా రిలీజ్


ప్రజల ఆస్తిపాస్తులనే కాక ప్రభుత్వ ధనాన్ని కూడ కొల్లగొట్టడానికి పూనుకున్న ఈ జగత్ కిలాడీలను పట్టి వీరికు ఒప్పగించుటకు యింకెంతోకాలం పట్టదు" ఇది ఎలాసాధ్యమైనదో జగత్ కిలాడీలు చూచి తెలిసికోండి

‘లాభార్జనే ప్రభుత్వరంగం ఏకైక లక్ష్యంకాదు’ : లోక్‌సభలో ప్రధాని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ప్రభుత్వరంగాన్ని కేవలం లాభాలు గడించే సంకుచిత దృష్టితో కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠవంతం చేసేందుకూ, ఎగుమతుల అభివృద్ధి, విదేశ మారకం సంపాదన మున్నగు విశాల దృక్పథాలతో చూడాలని నేడు లోక్‌సభలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ అన్నారు.

1967-68 లో ప్రభుత్వ రంగంపై రు. 3,333 కోట్లు పెట్టుబడివుండగా 2.2 శాతం లాభం మాత్రమే వచ్చిందని శ్రీ ఓమ్ ప్రకాశ్ త్యాగి తెలుపగా ప్రధాని పై సమాధానం చెప్పారు.

1965-66 లో 3.4 శాతం లాభంరాగా 1967-68 లో 2.2 శాతానికి తగ్గిందని శ్రీ శాస్త్రి అన్నారు.

ప్రభుత్వ రంగంలోని 55 సంస్థల్లో 30 కి పైగా నష్టంమీద నడుస్తున్నాయని వానికి నష్టం ఎందుకు వస్తున్నదో తెలుసుకోగోరుతున్నానని శ్రీ శాస్త్రి ప్రశ్నించారు.

1966-67 లో ప్రభుత్వ రంగంలోని 38 సంస్థలకు లాభాలు వచ్చాయనీ, 28 సంస్థలకు నష్టాలు వచ్చాయని శ్రీమతి గాంధీ చెప్పారు. లాభం రు. 48 కోట్లుకాగా, నష్టం రు. 33 కోట్లు తేలిందని అన్నారు. ఇందులో హిందుస్థాన్ స్టీల్‌సంస్థ నష్టమే రు. 83 కోట్లు వచ్చిందనీ, లాభం పోగా, నష్టం రు. 35 కోట్లు వున్నదని, హిందుస్థాన్ స్టీల్‌సంస్థ పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠవంతం చేయడమే కాకుండా రు. 31 కోట్లు విదేశమారకం సంపాదించిందని ప్రధాని చెప్పారు.

ఉషా కంపెనీ మేనేజిమెంటు అనుచిత చర్య

హైదరాబాదు, ఆగస్టు 4

భారత రాష్ట్రపతి కీ. శే. డాక్టర్ జాకిర్ హుస్సేన్ మృతిని పురస్కరించుకుని జూన్ 5 న సెలవు యిచ్చినందుకు, ఏదో ఒక ఆదివారంనాడు పని చేయవలసిందిగా ఉషా కంపెనీ కార్మికులను మేనేజిమెంటు అడగడం తప్పు అని కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ, డాక్టరు రాజబహదూర్‌గౌడ్ స్పష్టం చేశారు. మరొకరోజున పనిచేయడానికి తిరస్కరించేందుకు కార్మికులకు హక్కు కలదని ఆయన అన్నారు.

హైదరాబాదులోని ఉషా కంపెనీ యజమానులు కార్మికులతో మంచి సంబంధాలు వుంచుకోడంలో విఫలమవుతున్నారు.

తమ పరిస్థితులను మెరుగుపరచుకోడానికి కార్మికులు ఐక్యంగా కృషి చెయ్యాలని సిటీ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు శ్రీ ఆంతోనీరాం కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఉత్పత్తిలో కాంట్రాక్టు లేబరు పద్ధతులను ట్రేడ్‌యూనియన్లు సహించవని ఆయన అన్నారు.

ఇంజనీరింగు వేతనసంఘ సిఫార్సులపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చేలా ఇంజనీరింగ్ కార్మికులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని యూనియన్ అధ్యక్షుడు శ్రీ కె. యల్. మహేంద్ర కార్మికులకు ఉద్బోధించారు. వేతన సంఘాన్ని నెలకొల్పామన్న సాకుతో అనేక సంవత్సరాలు వేతనాలను పెంచలేదని మహేంద్ర తెలిపారు.

అనుబంధాలతో నిమిత్తం లేకుండా, ఇంజనీరింగ్ కార్మికులకు చెందిన అన్ని ట్రేడ్ యూనియన్‌లు ఐక్య పోరాటం జరపాలనీ, వేతనసంఘ సిఫార్సుల ప్రాతిపదికపై సమిష్టి కార్యాచరణకు పథకం వేసుకోవాలనీ ఆయన విజ్ఞప్తి చేశారు.

నంబూదిపాద్, గోపాలన్‌ప్రకటనపై వాయిదాతీర్మానం

కేరళ శాసనసభలో అనుమతి నిరాకరణ

తిరువనంతపురం, ఆగస్టు 5

రాజ్యాంగంపట్ల మార్క్సిస్టుపార్టీ వైఖరిని నిర్వచిస్తూ ముఖ్యమంత్రి శ్రీ నంబూదిపాద్, పార్లమెంటు సభ్యులు శ్రీ ఎ. కె. గోపాలన్‌లు చేసిన సంయుక్త ప్రకటన విషయమై నేటి కేరళ శాసనసభలో తీసుకవచ్చిన వాయిదా తీర్మానాన్ని స్వీకరించుటకు శ్రీ డి. దామోదరన్ పొట్టి అనుమతించలేదు.

కాంగ్రెసు పక్షనాయకులు తీసుకవచ్చిన వాయిదా తీర్మానంపై చర్చకు ముఖ్యమంత్రి శ్రీ నంబూదిపాద్ అభ్యంతరం తెలుపుతూ పార్టీల విధాన ప్రకటనలను పార్లమెంటులోనూ, రాష్ట్ర శాసనసభలలోనూ చర్చించడం చెడు సాంప్రదాయం నెలకొంటుందని అన్నారు.

సంయుక్త ప్రకటన కాపీని సభవారి ముందుంచుతూ కొన్ని పత్రికలు ఈ ప్రకటనను వక్రీకరించి ప్రచురించాయని ఆయనవన్నారు.

తాను ముఖ్యమంత్రిగా ప్రకటన చేయలేదని, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా తాను, ఎ. కె. గోపాలన్ కలిసి సంయుక్త ప్రకటన చేశామని అన్నారు.

రాజ్యాంగం పరిధిలోనే రాజ్యాంగాన్ని బద్దలు చేయడానికి ఐక్యసంఘటన ప్రభుత్వాలు యేర్పడినట్లు పత్రికలలో వచ్చినట్లుగా తాను చెప్పలేదని, అయితే ప్రజల అభివృద్ధికి ఐక్యసంఘటన ఉద్దేశాలను పరిపూర్తి చేసేందుకు రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలని ప్రకటించామని ఆయన అన్నారు.

నతిరో ఈ విషయాన్ని వర్ణించవలసివచ్చే వాదనతో కాంగ్రెసు పక్ష నాయకులు శ్రీ కె. కరుణాకరన్, ఐక్యసంఘటన కాంగ్రెసు నాయకులు శ్రీ కె. యం. జార్జి ఏకీభవించలేదు.

లఘు పరిశ్రమల స్థాపనలో నూతన దృక్పథం అవసరం

శ్రీ జి. సి. వెంకన్న ప్రకటన

హైదరాబాదు, ఆగస్టు 4

లఘు పరిశ్రమల స్థాపన విషయంలో నూతన దృక్పథాన్ని అవలంబించాలని తద్వారా రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల పైపు దృష్టి మళ్ళించాలని నేడిక్కడ ఒక పత్రికా గోష్ఠిలో రాష్ట్ర లఘు పరిశ్రమల మంత్రి శ్రీ జి. సి. వెంకన్న అన్నారు.

పారిశ్రామిక వనరులను గురించి సమగ్రంగా సర్వే జరుపడానికి ప్రతిపాదించామని ఆయన తెలియచేశారు.

పరిశ్రమలను స్థాపించే అవకాశం, సాంకేతిక సలహాలద్వారా సహాయం లభిస్తే లఘు పరిశ్రమలను నెలకొల్పడానికి వెనుకబడిన ప్రాంతాలలోకూడ సిద్ధపడేవారు న్నారని అన్నారు.

ప్రాథమికదశలో ఈ పరిశ్రమలకు అధిక తర ప్రాముఖ్యత యివ్వాలని చెప్పారు.

రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలను తొలగించడం అవసరమని చెప్పారు.

సీనియర్ సాంకేతిక అధికారులబృందంతో కలసి వర్షాభావ ప్రాంతాలలో పర్యటించదలచుకున్నానని ఆయన అన్నారు

రైలు ప్రయాణాలలో ఎం. పి. లకు అదనపు సౌకర్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 5

పార్లమెంటు సభ్యులు రైల్వే ప్రయాణాలు జరిపేటప్పుడు, వారికి యింకొక రాయితీ కలుగజేయడానికి మంత్రివర్గ ఉపసంఘం నేడు నిర్ణయించింది.

ఉపసంఘ నిర్ణయం మేరకు పార్లమెంటు సభ్యుడు తాను చేసే ఏ రైలు ప్రయాణంలోనైనా తన కుటుంబంలోని ఒక సభ్యుని ఖర్చులు లేకుండా తనతోకూడా తీసుకు వెళ్ళవచ్చును. ఎయిర్ కండిషన్ కోచ్‌లో ప్రయాణం చేసినప్పుడు, పార్లమెంటు సభ్యులకు వర్తించే పద్ధతిలో ఎయిర్‌కండిషనింగ్ ఛార్జీ మాత్రం చెల్లించవలసి వుంటుంది. అయితే పార్లమెంటు సభ్యుడు తనతోపాటు అటెండెంటును తీసుకువెళ్ళడానికి అనుమతించరు.

మంత్రివర్గ ఉపసంఘం ప్రధాని అధ్యక్షతన నేటి సాయంత్రం సమావేశం అయింది. పార్లమెంటు సభ్యుల అలవెన్సుల బిల్లు రేపు లోక్‌సభలో ప్రవేశ పెట్టబోతున్న దృష్ట్యా, సమావేశం అవ్యవధి నోటీసుతో పిలువబడింది ఉపసంఘ నిర్ణయం మేరకు అవసరమైన సవరణ ప్రవేశపెట్టబడుతుంది.

కేరళలో ప్రభుత్వ రంగంలో న్యూస్‌ప్రింట్ ఫ్యాక్టరీ

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ప్రభుత్వరంగంలో నెలకొల్పతలపెట్టిన రెండవ న్యూస్ ప్రింట్ ఫ్యాక్టరీని కేరళలో నెలకొల్పేవిషయమై ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని పారిశ్రామికాభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ భానుప్రకాశ్‌సింగ్ నేడు రాజ్యసభలో తెలియజేశారు.

ఈ ప్రాజెక్టుపైన ఒక ముసాయిదా లేఖ తయారుచేసి, ఆర్థిక మంత్రిత్వ శాఖకు, ప్రణాళికా సంఘానికి పంపడం జరిగింది.

హిమాచల్ ప్రదేశ్‌లో ప్రయివేటు రంగములో మరొక న్యూస్ ప్రింటు ఫ్యాక్టరీని నెలకొల్పే విషయంలో ఒక పరం కృషి చేస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఆ కంపెనీకి మధ్య సంప్రతింపులు కొనసాగుతున్నాయి. అయితే ఈ ఫ్యాక్టరీకి అవసరమైన ముడి పదార్థాల విషయంలో కొన్ని కష్టాలు ఎదురౌతాయి.

లైసెన్సు యివ్వబడిన కొన్ని కంపెనీలు పరిశ్రమను నెలకొల్పడంలో విఫలమవడమే గాక, యితరులు ఫ్యాక్టరీని ప్రారంభించకుండా, వెనుక లైసెన్సులుకూడా సంపాదించాయనీ, అట్టివాటి విషయంలో ప్రభుత్వం ఏమి చర్య తీసుకుందని శ్రీ పి. సి. మిత్రా లైసెన్సింగ్ విధాన విచారణకమిటీ బయటపెట్టిన అంశాన్ని మంత్రి దృష్టికి తెస్తూ ప్రశ్నించారు.

ఆ కమిటీ నివేదికయింకా పరిశీలనలో వున్నట్లు మంత్రి తెలిపారు. ఆ నివేదికను యింతవరకు తాను చదవలేదని అన్నారు.

ఆదోని టెక్స్‌టైల్ కార్మిక యూనియన్ సమావేశం

హైదరాబాద్, ఆగస్టు 5

ఆదోని టెక్స్‌టైల్ కార్మిక యూనియన్ సాంవత్సరిక సమావేశం ఆదోనిలోని రెడ్డి హాస్టల్‌లో ఆగస్టు 3 వ తేదీన జరిగింది.

దాదాపు 800 మంది కార్మికులు హాజరయిన ఈ సమావేశానికి యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీ యన్. రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు.

సమావేశంలో 26 మంది సభ్యులతో కార్యవర్గాన్ని, ఈ కింది ఆఫీసు బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

అధ్యక్షులు శ్రీ యన్. రామచంద్రారెడ్డి (అడ్వకేటు) ఉపాధ్యక్షులు శ్రీయుతులు కె. లింగప్ప, బి. బోజప్ప ప్రధానకార్యదర్శి శ్రీ సి. కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శులు, శ్రీయుతులు ఎ. సలాం, ఎం. ఎస్ సాదిక్ ఆలీ, కోశాధికారి శ్రీ వెంకోబరావు, న్యాయ సలహాదారుడు శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి.

ప్రధాన మంత్రికి హైదరాబాద్ వైద్య ఉద్యోగుల అభినందనలు

హైదరాబాద్, ఆగస్టు 5

బ్యాంకులను జాతీయంచేస్తూ సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకున్నందుకు ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీని అభినందిస్తూ ఆంధ్ర ప్రదేశ్ వైద్య వుద్యోగుల యూనియన్ హైదరాబాద్ విభాగం ఒక టెలిగ్రాం పంపింది.

కార్మికవర్గం ప్రత్యేకించి వైద్య ఉద్యోగులు ప్రధానికి సంపూర్ణ సహకారాన్ని అందిచేయగలరని టెలిగ్రాంలో తెలియజేశారు.

బ్యాంకుల జాతీయకరణ పథకాన్ని బలపరుస్తూ, వైద్య ఉద్యోగులను సమీకరించేందుకు జంటనగరాలలో ప్రదర్శనలను ఏర్పాటు చేయటానికి కౌన్సిల్ నిశ్చయించింది.

ఆగస్టు 6 న హైదరాబాద్ రానున్న శ్రీ వి.వి గిరికి బేగంపేట విమానాశ్రయంలో అపూర్వమైన స్వాగతం యివ్వాలని వైద్య వుద్యోగులకు విజ్ఞప్తిచేస్తూ మరియొక తీర్మానాన్ని చేశారు.

చిట్టెలుకలపై చంద్రధూళి ప్రభావం శూన్యం

హూస్టన్, ఆగస్టు 4

గత గురువారం చంద్రధూళి ద్రావణం ఎక్కించిన 24 చిట్టెలుకలు ఆరోగ్యంగా వున్నాయని హూస్టన్ పరిశోధనా కేంద్రం అధికారులు నేడు ప్రకటించారు.

గత శనివారంకూడా 240 చిట్టెలుకల శరీరంలోకి చంద్రధూళి ద్రావణం ఎక్కించారు. అవి కూడా ఆరోగ్యంగా వున్నాయి.

క్వారంటైన్‌లో చికిత్స పొందుతున్న అపోలో-11 యాత్రికులు వచ్చే సోమవారం తరువాత అందులో వుండవలసిన అవసరం లేదని శాస్త్రజ్ఞులు తెలిపారు.

చిట్టెలుకలపై జరిపిన ప్రయోగం వల్ల చంద్రునిపై విష క్రిములు ఏవీ లేవని, ఇక ముందు చంద్రునిపై కాలూనే యాత్రికులు ద్వారా విష క్రిములు భూమిని చేరుకుంటాయని భయపడవలసిన అవసరం లేదని వారు వివరించారు.

రానున్నయాభై రోజుల్లో ఇంకాకొన్ని జంతువులపై చంద్రధూళిని ప్రయోగించిచూస్తారు.

జనపనార మిల్లుల యజమానులకు శ్రీ భగత్ విజ్ఞప్తి

వేతనాలు పెంచాల్సిందిగా

న్యూఢిల్లీ, ఆగస్టు 5

జనపనార కార్మికుల వేతనాలను పెంచి సమ్మె విరమణకు తోడ్పడవలసిందిగా మిల్లు యజమానులకు విదేశవాణిజ్య శాఖమంత్రి శ్రీ బి. ఆర్. భగత్ విజ్ఞప్తి చేశారు.

జనపనార వస్తువులపై ఎగుమతి సుంకాలను విధించేటప్పుడు ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలించగలదని మిల్లు యజమానులకు హామీ యిచ్చారు.

సమ్మె పరిస్థితిపై లోక్‌సభలో ఒక ప్రకటనచేస్తూ సమ్మె ఇదే విధంగా కొనసాగినట్లయితే ప్రపంచ మార్కెట్లలో దేశం అనేక నష్టాలకు గురికావలసి వస్తుందని చెప్పారు.

తాత్కాలికంగా వేతనాలను పెంచినట్లయితే సమ్మెను విరమించటానికి కార్మికులు తయారుగా వున్నారన్నారు.

వేతనాలను కొంతవరకు పెంచాలన్న డిమాండు న్యాయమైనదని మిల్లుల యజమానులు కూడా భావిస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వం కొన్ని ఆర్థిక రాయితీలను యివ్వకపోయి నట్లయితే వేతనాలను పెంచటం సాధ్యం కాదని మిల్లు యజమానులు తెలియజేశారన్నారు.

నల్లగొండజిల్లా మిర్యాలగూడలో సెప్టెంబరు 1 వ తేదీనుండి ట్యూబెక్టమీ కేంద్రం ప్రారంభించబడుతుంది.

రాజభరణాల రద్దుకై శ్రీ సాదిక్ డిమాండ్

శ్రీనగర్, ఆగస్టు 5

బ్యాంకుల జాతీయకరణతరువాత తర్వలుగా పట్టణ ఆస్తులపై పరిమితి విధించాలనీ, రాజభరణాలను రద్దుచేయాలని కాశ్మీర్ ముఖ్యమంత్రి శ్రీ జి యం. సాదిక్ నిన్న కోరారు.

శ్రీనగర్‌కు 26 మైళ్ళ దూరంలో వున్న కాంగన్‌లో జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తూ ప్రజలపై భూస్వాములకు, గుత్త పెట్టుబడిదారులకు గల ప్రాబల్యాన్ని తొలగించే నిమిత్తంపై చర్యలు అవసరమన్నారు.

రాజభరణాలనేవిమాజీ సంస్థానాధీశులు గత నిరంకుశ పరిపాలనకు ప్రతిఫలంగా యిచ్చే పారితోషకాలని ఆయన విమర్శించారు. రాజభరణాలను వెంటనే రద్దుచేయాలన్నారు.

నిరంకుశ పాలకుల, దోపిడీదారులు పరిపాలించే రోజులుపోయాయని, దేశభవిష్యత్తు ప్రజల చేతులలో వున్నదని ఆయన చెప్పారు.

రాజకీయాలలోని, ఎన్నికల ప్రచారాలలోకి మత విషయాలను చొప్పించటానికి ప్రయత్నిస్తున్నందుకు ప్లెబిసైట్ ఫ్రంటును తీవ్రంగా విమర్శించారు. ప్రజలు మోసపోరాదని చెప్పారు.

జనసంఘం, ఆర్. యస్. యస్. ల మాదిరిగా ప్లెబిసైట్‌ఫ్రంటుకూడా మత ప్రాతిపదికపై ప్రజలలో విభేదాలను సృష్టించటానికి ప్రయత్నిస్తున్నదని చెప్పారు.

విదేశ నూనెకంపెనీల జాతీయానికి డిమాండ్

విదేశ నూనెకంపెనీలను జాతీయం చేయాలని అఖిల భారత పెట్రోల్, కార్మికుల సమాఖ్య ప్రధాన మంత్రిని కోరింది.

దాదాపు వేయిమంది కార్మికులు ప్రధాని నివాస భవనానికి వెళ్ళి కార్మికుల తరఫున ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.

రుమేనియా కమ్యూనిస్టు పార్టీ మహాసభ ప్రారంభం

బుఖారెస్టు, ఆగస్టు 5

రుమేనియా కమ్యూనిస్టుపార్టీ మహాసభ రేపు ఇక్కడ ప్రారంభమౌతుంది.

ఈ మహాసభకు భారత్‌నుండి మార్క్సిస్టుపార్టీ ప్రతినిధులు, నార్వే, ఎరి, కొలంబియా, పోర్చుగల్, ఆస్ట్రియా, ఉత్తర ఐర్లాండు, ఉరుగ్వే, సుడాన్ కమ్యూనిస్టుపార్టీల ప్రతినిధులు వచ్చారు.

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ సమావేశం వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 4

వచ్చే రాష్ట్రపతి ఎన్నికలో సంజీవరెడ్డికి వోటు వేయవలసిందిగా కాంగ్రెసు పార్లమెంటరీపార్టీ సభ్యులకువిజ్ఞప్తిచేసే నిమిత్తం జరుప తలపెట్టిన సమావేశం, బుధవారం నాటికి వాయిదాపడింది.

లోక్‌సభ సమావేశం ఆలస్యంగా జరిగినందువల్ల, కాంగ్రెసుపార్లమెంటరీపార్టీ సర్వసభ్య సమావేశం వాయిదా వేయకతప్పలేదు.

ఈ సమావేశంలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ, నిజలింగప్ప ప్రసంగించాల్సి వుంది.

భవిష్యత్తులో సన్నకారు రైతులకు అధిక ప్రాధాన్యత

శ్రీ జగ్‌జీవన్‌రామ్ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 5

భవిష్యత్తులో చేపట్టే వ్యవసాయ అభివృద్ధి పథకాలలో సన్నకారు రైతుల అవసరాలకు అధిక ప్రాధాన్యత యివ్వబడుతుందని కేంద్ర ఆహార మంత్రి శ్రీ జగ్‌జీవన్‌రామ్ ఐ. రా. స. అండర్ సెక్రటరీ శ్రీ రాల్ఫ్‌బంచ్‌కి తెలియచేశారు.

డాక్టర్ రాల్ఫ్‌బంచ్ కేంద్ర ఆహార మంత్రిని నిన్న కలుసుకొని అనధికార చర్చలు జరిపారు.

వ్యవసాయ ఉత్పత్తుల్లో కలిగినపెరుగుదలలో అధికభాగం ధనిక రైతులు పొందినట్లయితే తీవ్రమైన సాంఘిక వుద్రిక్తత పెరుగగలదని జగ్‌జీవన్‌రామ్ అన్నారు.

గత 18 సంవత్సరాలనుండి రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌కు డాక్టర్ బంచ్ ట్రస్టీగా వున్నారు. భారత అధిక దిగుబడి విత్తనాల పథకాలలో రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ప్రధాన పాత్రను నిర్వహించింది. ఫౌండేషన్ నిధులను సక్రమంగా వినియోగించి ఫలితాలను సాధించినందుకు డాక్టర్ బంచ్ ధన్యవాదాలు తెలియజేశారు

నాగాలాండ్‌లో

కాల్పుల విరమణ రద్దుకు విముఖత

లోక్‌సభలో రక్షణమంత్రి సమాధానం

న్యూఢిల్లీ, ఆగస్టు 5

భద్రతా దళాలపై ఇటీవల నాగా విద్రోహులు కాల్పులు జరిపిన దృష్ట్యా నాగాలాండ్‌లో అమలులోవున్న కాల్పుల విరమణను రద్దుచేసుకోవాలని నేడు పార్లమెంటులో సభ్యులు చేసిన డిమాండును రక్షణమంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ త్రోసిపుచ్చారు.

పార్లమెంటు ఉభయసభల్లోనూ సావధాన తీర్మానాలను పరిశీలిస్తున్న సమయంలో శ్రీ సింగ్ మాట్లాడుతూ పరిస్థితిని ఎదుర్కొనేందుకు మేము తగుచర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు.

నాగావిద్రోహులు ఆయుధాలు, మందుగుండును సేకరించడం ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, ఈ చర్య ప్రాతిపదికపై కాల్పులవిరమణ ఒప్పందాన్ని ఎత్తివేసుకోడం సరికాదని ఆయన అన్నారు.

ఆగస్టు 1, 2, 4 తేదీలలో నాగా విద్రోహులు 10 మందిని చంపారని అజ్ఞాతనాగాలలోని అతివాదులు తమ అనుచరులను ఆకట్టుకునేందుకు ఈ చర్యలకు పాల్పడ్డారని ఆయన అన్నారు.

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సలహాల ననుసరించి కేంద్రం వ్యవహరిస్తుందని అన్నారు.

గత మార్చి, జూలై నెలల మధ్యకాలంలో 12 మంది విద్రోహులు చనిపోయారని 449మంది స్వచ్ఛందంగా లొంగిపోయారనీ 567 మందిని పట్టుకోవడం జరిగిందని ఆయన అన్నారు.

పాక్‌లో నాగాలు శిక్షణ పొందుతున్నట్లు సమాచారంలేదనీ గత సంవత్సరం ఏప్రిల్ నుండి చైనాకు నాగాలు శిక్షణ నిమిత్తం వెళ్ళలేదని ఆయన శ్రీ రణధీర్‌సింగ్‌కు చెప్పారు.

అజ్ఞాత నాగాలసంఖ్య చెప్పటం కష్టమనీ వారిసంఖ్య 4000 నుండి 6000 వరకు వుంటుందని శ్రీమతి శారదాముఖర్జీకి మంత్రి చెప్పారు.

ప్రాథమిక పరిశీలన లేకుండానే కోల్ గ్యాస్ కర్మాగారం

నిపుణుల కమిటీ విమర్శ

హైదరాబాద్, ఆగస్టు 4

ప్రాథమికంగా యేరకమైన పరిశోధన జరపకుండానే కోల్‌గ్యాస్‌ను తయారుచేసే పెద్ద కర్మాగారాన్ని నెలకొల్పినందుకు హైదరాబాదులోని రీజనల్ రీసర్చి లేబొరేటరీని శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా సంస్థ నియమించిన నిపుణుల బృందం సంజాయిషీ అడిగింది.

యంత్రాలకు, ఇతర సామాగ్రులకు ఇచ్చిన ఆర్డర్లను రద్దు చేయవలసిందిగానూ, అలా చేయడం సాధ్యంకాని పక్షంలో ఆ యంత్రాలను ఎరువుల ఉత్పత్తి కర్మాగారానికి తరలించ వలసిందిగా రీసెర్చి లేబొరేటరీని ఆ కమిటీ కోరింది.

అదికూడా సాధ్యంకాని పక్షంలో కోల్ గ్యాస్‌ను తయారుచేసేందుకు ఈ కర్మాగారాన్ని పరిశీలనా కర్మాగారంగా మార్చవలసిందిగా ఆ కమిటీ సిఫారసు చేసింది.

కోల్‌గ్యాస్ కర్మాగార నిర్మాణానికి రు.21 లక్షలు వ్యయమవుతుందని 1962 సంవత్సరంలో అంచనా వేశారు. ఇప్పుడు దాని వ్యయం అంచనా రు. 107లక్షలకు పెరిగింది. ఇప్పటివరకు కర్మాగారం నిర్మాణానికి రు. 72 కోట్లు ఖర్చయింది.

ప్రత్యక్షకార్యాచరణకు సన్నాహాలు

కర్నూలు ప్రభుత్వ ప్రెస్సు కార్మికులచే

కర్నూలు, ఆగస్టు 4

పోలీసు అరెస్టులు, లాఠీఛార్జీలు, అత్యాచారాలకు నిరసనగా కర్నూలులోని ప్రభుత్వ ప్రెస్ కార్మికులు యావన్మంది పనులకు హాజరుకాకుండా, ప్రదర్శనలు, ప్రత్యక్ష కార్యాచరణ జరిపేందుకు సన్నాహాలు జరుపుతున్నారు

రెండు వాగెన్‌ల నిండా రిజర్వు పోలీసులు, స్థానిక పోలీసులు, ఆర్. డి. ఓ; డి. ఎస్. పి.లు వచ్చి, నిన్న పీకివేయగా మిగిలిన ప్రెస్సు కార్మికుల పాకలను పీకివేయడానికి వచ్చారు. ఈ వార్త తెలియగానే కలెక్టరును కలుసుకోవలసిందిగా తమ యూనియన్ అధ్యక్షుడు శ్రీ నాగిరెడ్డి, డ్యూటీలోలేని కార్మికులు వెళ్ళి కలుసుకున్నారు. తమ సంఘ అధ్యక్షుడు వచ్చేవరకు పాకలు పీకవద్దని ఆర్. డి. ఓ.ను కార్మికులు కోరారు. ప్రెస్ కార్మికులు శాంతియుతంగా వున్నారు.

లాఠీచార్జి

కాని కార్మికులపై లాఠీచార్జి జరపవలసిందిగా అధికారులు ఉత్తరువుచేశారు. పోలీసులు కనిపించినవాళ్లనల్లా క్రూరంగా కొట్టారు. డజనుమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఆరుగురు కార్మికులకు ప్రమాదకరమైన గాయాలు తగిలాయి. కొందరు కార్మికులకు ఎముకలు విరిగాయి.

వెంటనే కార్మికులు వారిని ఆస్పత్రిలో చేర్చారు. ఇళ్ళ నిర్మాణానికి సంబంధించిన సుమారు రు. 6 వేల కిమ్మత్తు చేసే సామాను పోలీసులు తీసుకు పోయారు.

అరెస్టులు

శ్రీ ముడుంబై సత్యనారాయణాచార్యులు (యూనియన్ కార్యదర్శి), నిజాముద్దీన్ (మాజీ కార్యదర్శి) హట్స్ కమిటీ మాజీ అధ్యక్షులు, కార్యదర్శి నరసింహులు, మాజీ కార్యదర్శి బాలయ్య, మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కె. నాగిరెడ్డి అరెస్టు అయ్యారు.

అధికారుల నిరంకుశ ప్రవర్తనకు, తమను పాకలనుండి బలవంతంగా ఖాళీ చేయించినందుకు నిరసనగా, యావన్మంది కార్మికులు [illegible] ప్రదర్శనలు, ప్రత్యక్ష కార్యాచరణ జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

బొకారోకు సోవియట్ నిపుణుడు

న్యూఢిల్లీ, ఆగస్టు 5

బొకారో ఉక్కు కర్మాగారంలో ఒక సంవత్సరంపాటు వుండే విధంగా సోవియట్ ప్రభుత్వం ఉన్నత నిపుణుని పంపించింది.

జాప్యం జరుగకుండా అక్కడికక్కడే నిర్ణయాలు చేసేందుకు సోవియట్ ప్రభుత్వం ఈ ఉన్నత నిపుణుని పంపించింది. ఉక్కు బట్టీలకు ఉపయోగించే 20,000 ప్రత్యేక ఇటుకలను పంపించేందుకు కూడ సోవియట్ యూనియన్ సమ్మతిని తెలియజేసింది. ఈ ఇటుకలను మన దేశంలోనే సప్లయి చేయటంలో యిబ్బందులు ఎదురవుతున్నాయి.

సోవియట్ యూనియన్ యీ సహాయం చేస్తానని హామీయిచ్చినందువలన అనుకున్న ప్రకారం కర్మాగార నిర్మాణం పూర్తవుతుందని కేంద్ర ఉక్కు మంత్రివర్గశాఖ వర్గాలు తెలియచేస్తున్నాయి.

ప్రీమియంరేట్లపై 3 నెలల్లో నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ప్రీమియంరేట్లు తగ్గింపుపై జీవిత భీమా కార్పొరేషన్ నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం 3 నెలల కాలపరిమితిని యిచ్చిందని ఆర్థికశాఖ ఉపమంత్రి శ్రీ జగన్నాథ పహాడియా నేడు రాజ్యసభలో తెలియచేశారు.

ప్రీమియం రేట్ల తగ్గింపుపై 1968 లో కార్యదర్శుల కమిటీ సమర్పించిన నివేదిక యింకా జీవితభీమా కార్పొరేషన్ పరిశీలనలో వున్నదని శ్రీ ఆర్. పి. కైతాన్ ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ పహాడియా అన్నారు. ఈ లోపుగా మొరార్కా కమిటీ నివేదిక కొరకు ప్రభుత్వం ఎదురుచూస్తున్నదని అన్నారు.

జీవితభీమా కార్పొరేషన్ మోరవు వ్యాపారం చేసేందుకు అనుకూలంగా వున్నదని శ్రీ ఎ. సి. చటర్జీ అన్నారు. ప్రీమియం రేట్లను తగ్గించి కొత్త వ్యాపారం చేసేందుకు పాలసీదారుల పాలసీలను కొనసాగించాలని శ్రీచటర్జీ సూచించారు.

తెలంగాణానుండి విద్యార్థుల వలస

టి. సి. లతో యితర ప్రాంతాలకు, రాష్ట్రాలకు వెళ్ళుచున్న వైనం

హైదరాబాద్, ఆగస్టు 5

తెలంగాణా ప్రాంతంలో నిరంతరంగా పాఠశాలలు మూసివున్న దృష్ట్యా అందులో చదువుతున్న విద్యార్థులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెటులు తీసుకొని మహారాష్ట్ర, మద్రాసు, ఆంధ్ర ప్రాంతానికి వెళ్ళిపోవుచున్నారు.

విద్యార్థి తరగతి రికార్డునుబట్టి వార్షిక పరీక్ష ఫలితాలను వెల్లడించాలని విద్యా సంస్థలకు విద్యాశాఖ అధికారులు జారీ చేసినందువల్ల టి. సి. లు యివ్వటంలో ప్రధాన ప్రతిబంధకాలు ఏర్పడ్డాయి.

తరగతి రికార్డులు క్రమంగానూ, విద్యార్థికి అనుకూలంగానూ వుండవు. ఎస్సెల్‌సి పరీక్షలో ఉత్తీర్ణులై ఉద్యోగాల్లో చేరిపోవాలనే విద్యార్థులు కొందరు వున్నారు. ఇటువంటివిద్యార్థులకు మెట్రిక్ ఎస్. ఎస్. ఎల్. సి. ప్యాసు అయినట్లు సర్టిఫికెట్లు లేనందువల్ల వారు ప్రైవేటు సంస్థల్లోనూ, తక్కువ తరగతి ఉద్యోగాలు వెతకవలసిన స్థితి దాపురించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పనికిరాకుండా కొందరు వయః పరిమితి దాటిపోయిన విద్యార్థులు కొందరు వున్నారు.

ప్రైవేటు పాఠశాలల దుస్థితి

జూన్, జూలై నెలలలో విద్యార్థులనుండి ఫీజులు రానందువల్ల ప్రైవేటు పాఠశాలలు ఆర్థికంగాదెబ్బతిన్నాయి. యిందులో కొన్నింటికి ప్రభుత్వ సహాయంకూడా లేదు.

పాఠశాలలు లేనందువల్ల తమ పిల్లలు చదువుకోవడం మానేస్తారేమోనని పేద విద్యార్థుల తలిదండ్రులు బాధపడుతున్నారు. డబ్బున్నవారు మాత్రం తమ పిల్లలను ఆంధ్ర వెంకటేశ్వర విశ్వవిద్యాలయాలకు పంపారు.

పుస్తక విక్రేతల వ్యాపారం పూర్తిగా మందగించింది.

కాలేజీలు తెరచిన తరువాత పాఠశాలలు తెరవాలని, లేనిపక్షంలో కాలేజీ విద్యార్థులు పాఠశాలల్లో అలజడి ప్రారంభిస్తారని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

పాక్ దొంగవ్యాపారులకు రాజకీయ నాయకుల రక్షణ

న్యూఢిల్లీ, ఆగస్టు 5

భారత-పాకిస్తాన్ సరిహద్దులలో దొంగవ్యాపారాన్ని సాగిస్తున్న పాకిస్తాన్ వ్యాపారులకు కొంతమంది రాజకీయ నాయకులు రక్షణ కల్పిస్తున్నారన్న ఆరోపణను ఆర్థిక శాఖ స్టేట్‌మంత్రి శ్రీ పి. సి. సేథీ నిన్న లోక్‌సభలో ఖండించారు.

పై ఆరోపణ చేస్తున్న శ్రీ రామ్‌శరణ్‌కు సమాధానమిస్తూ, ఈ విషయంపై నిర్దిష్టమైన విషయాలు వున్నట్లయితే వాన్ని పరిశీలించటం జరుగుతుందన్నారు. ఎవ్వరికీ ప్రభుత్వం రక్షణ కల్పించటం లేదన్నారు.

సరిహద్దులలో అధికంగా నిఘాను ఏర్పాటు చేయటం వల్ల దొంగవ్యాపారం తగ్గిపోయిందని చెప్పారు.

కాకినాడలో ఒక హోటల్లో పనిచేస్తున్న రాజమండ్రి తాలూకా నామిరెడ్డిపల్లికి చెందిన ఒక వ్యక్తివద్దనుండి రు. 35 వేల నగదు దొంగిలించారు.

ప్రధాని వివరణ

(1 వ పేజీ తరువాయి)

గానే వ్యవసాయోత్పత్తులు పెరిగాయనీ, భూమిలేనివారికి సైతం చేతినిండా కావలసినంత పని లభిస్తున్నదని ప్రధాని జవాబు చెప్పారు.

వ్యవసాయ కార్మిక పోరాటంపట్ల వైఖరి

భూమిలేని వ్యవసాయ కార్మికుల పోరాటాన్ని ప్రస్తావిస్తూ భూస్వాములకు వ్యతిరేకంగా ప్రభుత్వం వారికి సహాయపడుతుందా, అని శ్రీ కె. పి. సుబ్రహ్మణ్యం అడిగారు.

దీనిని దృష్టిలో పెట్టుకుని భూసంస్కరణలకు ప్రాధాన్యత యివ్వబడిందని, భూసంస్కరణలకు సంబంధించి తక్షణచర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రులకు రాశానని, ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై వున్నదని ప్రధాని చెప్పారు.

పట్టణ ఆస్తులపై గరిష్ఠ పరిమితి

ప్రభుత్వం పరిశీలన

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ఆదాయం, సంపదలలో అసమానతలను తొలగించేందుకు పట్టణ ఆస్తులపై పరిమితిని విధించే అన్ని అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని నేడు రాజ్యసభలో ఆర్థికశాఖస్టేట్‌మంత్రి శ్రీ పి. సి. సేథీ చెప్పారు.

పార్లమెంటు ముందుగల గుత్త పెట్టుబడు, నిరోధం పరిమిత వాణిజ్యంబిల్లు, ఇటీవల 14 బడా బ్యాంకులను జాతీయం చేస్తూ తీసుకున్నచర్య ఆర్థికశక్తి కేంద్రీకృతం కాకుండా తీసుకున్న కొన్ని చర్యలు అని ఆయన అన్నారు.

ఉపాధ్యాయ హత్యపై న్యాయ విచారణ: లోక్‌సభలో శ్రీ చావన్ ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 5

జనసంఘ్ నాయకులు దీనదయాళ్ ఉపాధ్యాయ మృతిపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపిస్తుందని నేడు లోక్‌సభలో హోంశాఖా మంత్రి శ్రీ చావన్ ప్రకటించారు.

ఈ విచారణ కమిటీలో హైకోర్టుజడ్జీ వుంటారని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి హైకోర్టుజడ్జీని నియమించడం జరుగుతుందని ఆయనఅన్నారు.

రాజ్యసభలో యిదేప్రకటనను హోంశాఖ స్టేట్‌మంత్రి శ్రీ విద్యాచరణ్ శుక్లా గావించారు.

నెల్లూరుజిల్లాలోని 70 మైకా గనులు సెప్టెంబరు 1 నుండి 7 వ తేదీవరకు భద్రతా వారం జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

రుమేనియాకు ‘ఎం. వి. చెన్నైశెల్వం’ పయనం

33 వేల టన్నుల ముడి యినుముతో

మద్రాసు, ఆగస్టు 5

దక్షిణ భారత నౌకా కార్పొరేషన్‌కు చెందిన “యం. వి. చెన్నైశెల్వం” అనే పెద్ద నౌక 33 వేల టన్నుల ముడి యినుము, మాంగనీస్‌తో నేడు రుమేనియాకు బయలుదేరింది.

ఈ సందర్భంగా జరిగిన ఉత్సవంలో తమిళనాడు పరిశ్రమల మంత్రి శ్రీ మాధవన్ మాట్లాడుతూ, మద్రాసురేవునుండి రుమేనియాకు అధిక మొత్తాలలో ముడియినుమును ఎగుమతి చేయుటానికి తోడ్పడిన దక్షిణ భారత నౌకా కార్పొరేషన్‌కు ధన్యవాదాలు చెప్పారు.

సేలంలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించుటకు రుమేనియా ప్రభుత్వం సహాయం చేయగలదన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు.

రైల్వేబ్రిడ్జి వాచ్‌మన్‌పై తెలంగాణావాదుల దాడి

హైదరాబాద్, ఆగస్టు 4

నల్లటి దుస్తులు ధరించిన 16 మంది ప్రత్యేక తెలంగాణా వాలంటీర్లు దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాదు వాడి సెక్షన్‌లో రుక్మాపూర్-తాండూరు స్టేషన్‌ల మధ్య వున్న రైల్వేబ్రిడ్జి వాచ్‌మన్‌పై రాళ్ళు విసిరినందున తీవ్రంగా గాయపడ్డాడు. వాచ్‌మన్ చేతిలోని సిగ్నల్‌లాంప్ పాడైపోయింది.

శాసనసభ్యునిపై గుండా దాడి

హైదరాబాద్, ఆగస్టు 5

శాసనసభ్యులు శ్రీ నిమ్మల రాములుపై సూర్యాపేటలో ఒక గుండా దాడిచేసి ఆయనను కొట్టాడు. శ్రీ రాములు టీ త్రాగేందుకు సూర్యాపేటలోని రవీంద్ర హోటల్‌లోకి ప్రవేశించిన సందర్భంగా ఈ సంఘటన జరిగింది.

శ్రీరాములుకు వెంటనే ప్రాథమిక చికిత్స చేసి, వెంటనే హైదరాబాద్‌కు పంపించారు.

ఈ సంఘటన జరిగిన వెంటనే సమాచార శాఖా మంత్రి శ్రీ ఎ. వాసుదేవరావు, మైనర్ ఇరిగేషన్ శాఖా మంత్రి శ్రీ పురుషోత్తం రెడ్డి హోటల్‌లో ప్రవేశించిన సంఘవ్యతిరేక శక్తులకు హెచ్చరిక చేశారు.

నవంబరు 1 న మహారాష్ట్ర బంద్

సంపూర్ణ మహారాష్ట్ర సమితి కేంద్ర కమిటీ నిర్ణయం

బొంబాయి, ఆగస్టు 5

మహారాష్ట్ర మైసూరు సరిహద్దువివాదాన్ని త్వరలో పరిష్కరించాలని కోరేందుకు నవంబరు 1 వ తేదీన మహారాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చేందుకు నేడిక్కడ సమావేశమైన సంపూర్ణ మహారాష్ట్ర సమితి కేంద్ర కమిటీ నిర్ణయించిందని ఇక్కడికి విశ్వాసనీయంగా తెలియవచ్చింది.

ఈనిర్ణయంపై తుదిరూపం యిచ్చేందుకు అక్టోబరు మూడవ వారంలో రాష్ట్ర స్థాయి సదస్సును జరపడానికి సమితి నిశ్చయించింది.

లోక్‌సభకు స్వతంత్రపార్టీ క్షమాపణ

న్యూఢిల్లీ, ఆగస్టు 5

స్వతంత్రపార్టీ చేసినదిగా సమర్పించిన క్షమాపణ పత్రాన్ని నేడు లోక్‌సభ ఆమోదించింది.

స్వతంత్రపార్టీ నాయకులు లోక్‌సభలో చేసిన ప్రసంగాలను పత్రికలకు తప్పుగా విడుదల చేసినందుకు కమ్యూనిస్టు సభ్యులు శ్రీ ఎస్. ఎం. బెనర్జీ సభాహక్కుల తీర్మానాన్ని ప్రతిపాదించారు.

దీనిపై స్వతంత్ర పార్టీ నాయకులు ఆచార్య రంగా సమర్పించిన, దానికి బాధ్యులైన పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి శ్రీ ఎ. పి. జైన్ క్షమాపణ పత్రాన్ని డిప్యూటీ స్పీకర్ శ్రీ ఖాదిల్కర్ చదివారు.

శ్రీ మసానీ చేసిన ప్రసంగంలో కొన్ని భాగాలు పొరపాటున పత్రికలకు విడుదల చేశామని శ్రీ జైన్ తెలిపారు.

శ్రీ [illegible] మాట్లాడుతూ [illegible] శ్రీ ఖాదిల్కర్ అన్నారు.

నిరుద్యోగానికి వ్యతిరేకంగా

సెప్టెంబరు 10-20 మధ్య అన్ని జిల్లాల్లోనూ సైకిళ్ళపై జైత్రయాత్ర

యువజన, విద్యార్థి సమస్యలపై 5 లక్షల సంతకాల సేకరణకు పిలుపు

విజయవాడలో జరిగిన రాష్ట్ర విద్యార్థి, యువజన సమాఖ్యల సంయుక్త సమావేశం నిర్ణయం

విజయవాడ, ఆగస్టు 5

దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగ సమస్యా పరిష్కారానికి దేశ వ్యాపితంగా జరగబోయే చైతన్య పూరితమైన మహత్తర పోరాటానికి సన్నాహానికిగాను ఆంధ్ర ప్రదేశ్‌లో సెప్టెంబరు 10 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు జైత్రయాత్ర సాగించాలని, రాష్ట్ర శాసనసభవద్ద 5 వేల మందితో ప్రదర్శన జరపాలని, ఆగస్టు 2, 3 తేదీలలో ఇక్కడ జరిగిన ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థి యువజన సమాఖ్య కార్యకర్తల సంయుక్త సమావేశం నిర్ణయించింది.

నిరుద్యోగ సమస్యా పరిష్కారానికి తక్షణమే చర్యలు గైకొనాలని, 18 యేండ్లు దాటినవారికి ఓటింగు హక్కు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ 5 లక్షల సంతకాలను సేకరించాలని ఈ సమావేశం నిర్ణయించింది.

అఖిల భారత విద్యార్థి, యువజన సమాఖ్యల నిర్ణయాల ననుసరించి పై నిర్ణయాలు గైకొన్నారు.

ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ వర్మ అధ్యక్షత వహించారు.

అఖిలభారత విద్యార్థి, యువజన సమాఖ్యల నిర్ణయాలను ప్రదేశ్ యువజనసమాఖ్య కార్యదర్శి శ్రీ కె. ప్రతాపరెడ్డి, అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ సుధాకర్ రెడ్డి వివరించారు.

సమావేశం చర్చలలో దాదాపు 30 మందికి పైగా పాల్గొని ప్రస్తుతమున్న పరిస్థితిలో విద్యార్థి, యువజనసంఘాల నిర్మాణాన్ని పటిష్టవంతంగావించి బలోపేతమైన ఉద్యమాలను నిర్వహించాల్సిన ఆవశ్యకతను గురించి వివరించారు.

అభివృద్ధి నిరోధకుల, మితవాద, మతవాద శక్తుల దాడిని త్రిప్పికొట్టేందుకు దేశంలో అభ్యుదయ శక్తుల ప్రాబల్యాన్ని పెంచడానికి కృషి చేయాలని సభ్యులు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఈ యేడాది నవంబరు మాసంలో పార్లమెంటు వద్దకు నిరుద్యోగ సమస్యపై ప్రదర్శన జరపడానికి అఖిల భారత సంఘాలు తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించి ఆ ప్రదర్శనలో పాల్గొనడానికి ఆంధ్ర ప్రదేశ్ నుంచి అత్యధిక సంఖ్యలో పంపించాలని, అనంతరం పార్లమెంటుకు సమర్పించే విజ్ఞాపన పత్రంపై 5 లక్షల సంతకాలను సేకరించాలని ఈ సమావేశం నిర్ణయించింది.

జైత్రయాత్ర

ఆ కార్యక్రమంలో భాగంగానే అందుకు సన్నాహంగా సెప్టెంబరు 10 నుండి 20 వరకు ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాలలోనూ సైకిళ్ళపై బయలుదేరి జైత్రయాత్ర జరుపాలని, చివరకు వివిధ ప్రాంతాలనుంచి బయలుదేరిన యాత్రలు హైదరాబాదును చేరుకొని అక్కడ ప్రదర్శన జరపాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈ సందర్భంగా యువజన సంఘం పతాకాన్ని ముద్రించుకొని సంఘ ఆశయాలను, లక్ష్యాలను, ఉద్దేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, యువజనసంఘాలులేని వివిధ గ్రామాలలో సంఘాలు నెలకొల్పాలని కూడ నిర్ణయం గైకొన్నారు.

సెప్టెంబరు 10 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సన్నాహంగా జిల్లా, తాలూకా స్థాయిలలో కార్యకర్తల సమావేశాలు, నిరుద్యోగ సదస్సులు జరుపాలని కూడ తీర్మానించారు.

బ్యాంకుల జాతీయమానికి హర్షామోదాలు

14 పెద్ద బ్యాంకులను జాతీయం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఈ సమావేశం హర్షించింది.

బ్యాంకుల జాతీయకరణ సమస్యపై అభివృద్ధి నిరోధక, మితవాద శక్తుల దాడిని త్రిప్పికొడుతూ ప్రజలలో ప్రచారం గావించాలని సమావేశం అభిప్రాయపడింది.

శ్రీ గిరికి తోడ్పాటు

రాష్ట్రపతి ఎన్నికకు జరుగుతున్న పోటీలో అభివృద్ధి నిరోధక శక్తులను, కాంగ్రెసులోని సిండికేట్ అభ్యర్థియైన శ్రీ సంజీవరెడ్డిని ఓడించి, ప్రజాతంత్రవాది శ్రీ గిరి విజయానికి కృషిచేయాలని తీర్మానించారు.

శ్రీగిరి హైదరాబాదుకువచ్చిన సందర్భంగా ఆయనకుజరిగే సన్మానకార్యక్రమంలో పాల్గొనాలనికూడ నిర్ణయించారు.

ఈ కార్యక్రమ నిర్వహణకు సమన్వయ కమిటీని ఈ దిగువవారితో ఎన్నుకున్నారు.

శ్రీయుతులు కె. ప్రతాపరెడ్డి (కన్వీనరు), డి.వి.వి.ఎస్. వర్మ, అజీజ్‌పాషా, ఎ. ఈశ్వరరెడ్డి, స్టాలిన్‌బాబు, నల్లూరు వెంకటేశ్వర్లు (జూనియర్) రాధాకృష్ణ, కోటేశ్వరరావు, అరుణకుమార్, నల్లూరి వెంకటేశ్వర్లు, కె. చంద్రమోహన్, ఇ. నాగేశ్వరరావు, ఎ. పుల్లారెడ్డి బి. అంకూస్, యస్. సుబ్బారావులతో కమిటీ యేర్పడింది.

డా. జాకిర్‌హుస్సేన్, యస్. సత్యనారాయణరెడ్డి, ఇంధ్యాల రాధాకృష్ణమూర్తి, సుధాకర్, దొరికపూడి జోసెఫ్ అకాల మృతికి సంతాపం వ్యక్తంచేస్తూ ఈ సమావేశం తీర్మానించింది.

జైత్రయాత్ర జయప్రదానికి విద్యార్థి ఫెడరేషన్ పిలుపు

ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గ విస్తృత సమావేశం ఆగస్టు 3 తేదీన విజయవాడలో శ్రీ సుధాకరరెడ్డి అధ్యక్షతన జరిగింది.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నిరుద్యోగంపై పెద్దఎత్తున ప్రచారం, ఆందోళన సాగించాలని సమావేశం నిర్ణయించింది.

అంతకు ముందురోజు జరిగిన విద్యార్థి - యువజన ఫెడరేషన్ల సంయుక్త సమావేశంలో తీసుకున్నసమావేశంకార్యక్రమాన్ని సంపూర్ణంగా విజయవంతం చెయ్యాలని విద్యార్థులకు విజ్ఞప్తిచేసింది.

నిరుద్యోగానికి వ్యతిరేకంగా సెప్టెంబరు రెండవ వారం నుండి 10 రోజులపాటు జిలాలలో సైకిల్ జైత్రయాత్ర ద్వారాను, కరపత్రాలు, బహిరంగసభలద్వారా సమస్య తీవ్రతను శాస్త్రీయ పరిష్కారాలను ప్రచారం చెయ్యాలని నిర్ణయించింది.

హైదరాబాద్ యాత్ర

సెప్టెంబరు 3 వ వారంలో పెద్దఎత్తున సెంట్రీకి నిరుద్యోగ యాత్ర నడపాలని నిర్ణయించింది ఈ యాత్ర విజయానికి ఇప్పటినుండి కృషి సాగించాలని నిర్ణయించింది.

ఆ తర్వాత రాష్ట్రంలో [illegible] పరిస్థితిని పరిశీలిస్తూ ఈ సంవత్సరం ప్రారంభంలో సాగిన విద్యార్థిపోరాటానికి [illegible] కులపతి [illegible] ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ తన నిరసనను వ్యక్తం చేసింది.

ప్రయివేటు కాలేజీలలో మరింతగా జరుగుతున్న ఈ అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేసింది. దీనికై ఆందోళనకు సన్నద్ధంకమ్మని విద్యార్థులకువిజ్ఞప్తి చేసింది.

ప్రయివేటు కాలేజీలలో ఫీజుల పెంపుదలను ఖండిస్తూ కనీసం ప్రభుత్వ కళాశాల ఫీజులతోనైనా ఆ ఫీజుల్ని సరి సమానం చెయ్యాలని డిమాండ్ చేసింది.

కొన్ని కాలేజీలలో యూనియన్ల రద్దును ఖండించింది. అన్ని కళాశాలలు ప్రజాతంత్ర పద్ధతుల్లో నిర్వహించాలని డిమాండ్ చేసింది.

విద్యార్థిఫెడరేషన్ అభ్యర్థుల్ని-అభ్యుదయ శక్తుల్ని యూనియన్లలో గెల్పించమని విజ్ఞప్తి చేసింది. ఈ సంవత్సరం కళాశాలల్లో సీట్ల కొరతకు తన ఆందోళనను వ్యక్తంచేస్తూ వెంటనేఅన్ని కళాశాలల్లో సీట్లసంఖ్యను పెంచి షిఫ్టుపెట్టి అందరికీ అవకాశాల్ని వెంటనే కల్పించాలని సమావేశం డిమాండ్ చేసింది.

జూనియర్ కళాశాలలు

జూనియర్ కాలేజీలను ప్రారంభిస్తామంటూనే ప్రభుత్వం సాగిస్తున్న [illegible] పట్ల ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ తన తీవ్ర వ్యతిరేకతను వెలిబుచ్చింది. వెంటనేకాలేజీలు తెరిచి అందరికీసీట్లు కల్పించమని, [illegible] వెంటనే విడుదలచేయ్యాలని లేకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించింది.

ఈ జూనియర్ కాలేజీకు కనీసం ప్రతి తాలూకాకు ఒకటి చొప్పునైనా తెరవాలని, [illegible] లక్ష రూపాయలు, 10 ఎకరాల స్థలం నిర్బంధంగా ఇవ్వాలని కోరడం అనుచితమని వెనుకబడిన ప్రాంతాల వారికి జూనియర్ కాలేజీలు లేకుండా పోయే ప్రమాదం వుందని అందువల్ల షరతులు సడలించాలని డిమాండ్ చేసింది.

జూనియర్ కాలేజీలలోనూ కళాశాలల్లోనూ ప్రతి సంవత్సరం పరీక్షలుండే పద్ధతిని వెంటనే ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేసింది.

కాలేజీల - విశ్వవిద్యాలయాల పరిపాలనాధికార్లు విద్యార్థులకు స్థానం కల్పించాలని కోరింది.

బ్యాంకుల జాతీయకరణ

బ్యాంకులు జాతీయం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షించింది. విద్యార్థి ఫెడరేషన్, అభివృద్ధికర శక్తులు అనేక సంవత్సరాల పోరాట ఫలితమైన ఈ జాతీయకరణపై అభివృద్ధి నిరోధకుల కుట్రను ఓడించేందుకు [illegible] విద్యార్థులకు విజ్ఞప్తి చేసింది.

ఈ జాతీయకరణతోపాటు విదేశీ - ఇంకా మిగిలిన స్వదేశీ బ్యాంకులను జాతీయం చెయ్యాలని, రాజభరణాలను రద్దుచెయ్యాలని, వీటికి నష్టపరిహారం చెల్లించవద్దని డిమాండ్ చేసింది.

మార్క్సిస్టుపార్టీకి రాజీనామాలు

ఖమ్మం, ఆగస్టు 3

ఖమ్మంపట్టణంలో మార్క్సిస్టుపార్టీ కార్యకర్త శ్రీ స్థానంగోపాలం, ఆపార్టీకి రాజీనామా ఇచ్చి మాతృ సంస్థ అయిన కమ్యూనిస్టుపార్టీలో చేరగోరుతూ, పట్టణ కమ్యూనిస్టుపార్టీకి దరఖాస్తు పంపారు. ఈ సందర్భంగా ఆయన ఒక పత్రికా ప్రకటనచేస్తూ, దారి తప్పిన తోటి కార్యకర్తలంతా తిరిగి మాతృ సంస్థ అయిన భారత కమ్యూనిస్టుపార్టీలో చేరవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

శ్రీ కె. లింగయ్య రాజీనామా

ఖమ్మం పట్టణ బురహాన్‌పురం వార్డుకు చెందిన శ్రీ కన్నెకంటి లింగయ్య మార్క్సిస్టుపార్టీకి రాజీనామాయిచ్చి, తిరిగి కమ్యూనిస్టుపార్టీలో చేరి పని చేయడానికి నిశ్చయించుకున్నట్లు తెలియజేశారు.

శ్రీ టి. పోశం రాజీనామా

కొత్తగూడెంలో మార్క్సిస్టుపార్టీ కార్యకర్త శ్రీ టి. పోశం మార్క్సిస్టుపార్టీతో తెగతెంపులు చేసుకుని, కమ్యూనిస్టుపార్టీలో చేరుటకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

ఎ. కె. గోపాలన్ ప్రభృతులచే ధర్నా

పగసాధింపు చర్యలకు నిరసనగా

తిరువనంతపురం, ఆగస్టు 4

కేరళ సర్కిల్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంముందు మార్క్సిస్టు కమ్యూనిస్టు నాయకులు శ్రీ ఎ. కె. గోపాలన్ (యం.పి) ఆయనతోపాటు మరో 28 మంది మార్క్సిస్టు [illegible] ధర్నా చేశారు.

68 సెప్టెంబరు సార్వత్రిక సమ్మె సందర్భంగా ఉద్యోగులపై సాగిస్తున్న పగసాధింపు చర్యలకు నిరసనగా ఈ ధర్నా చేశారు.

ఈ ధర్నాలో యిద్దరు మార్క్సిస్టు పార్లమెంటు సభ్యులు శ్రీ ఇ. కె. నయనార్ శ్రీ కె. అనిరుద్ధన్ 4 గురు కమ్యూనిస్టుపార్టీ శాసనసభ్యులు (ఇందులో మాజీ కమ్యూనిస్టు మంత్రి శ్రీ బి ఎ. మజీద్)కూడా వున్నారు. రాష్ట్ర యన్.యన్.జి. ఛైర్మన్ శ్రీ శివహరిభారతి, రాష్ట్రమార్క్సిస్టుపార్టి సహాయకార్యదర్శి సి. హెచ్. కణరన్ ఐక్య సంఘటన సమన్వయ కమిటీ కన్వీనరు, శ్రీ అజికోడ్ రాఘవన్ ప్రభృతులు వున్నారు.

శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు వున్న ప్రదర్శనకు శ్రీ గోపాలన్ తదితరులు నాయకత్వం వహించి పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయానికి చేరారు.

రాష్ట్ర కార్మిక మంత్రి శ్రీ మత్తయి మంజూరన్ తరువాత శ్రీ గోపాలన్, యితర సత్యాగ్రహులను కలిసి కొంతసేపు వారితో వున్నారు.

వరదల విషయమై ప్రజలకు సాయపడాలి

జిల్లాఅధికార్లకు ఖమ్మంజిల్లా రెవిన్యూ అధికారి విజ్ఞప్తి

ఖమ్మం, ఆగస్టు 3

ఈ సంవత్సరం భారీఎత్తున వరదలు రావచ్చుని భావిస్తూ, ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవలెనని, వరదలకు గురయ్యే ప్రాంతాలకు వెంటనే సరఫరా చేసేందుకు వీలుగా ఆహార పదార్థాలు, పశుదాణా, కిరోసిన్, మందులు, [illegible] తగినంతగా నిల్వచేసివుంచాలని ఖమ్మంజిల్లా రెవిన్యూ అధికారి జిల్లా అధికారులను సూచించారు.

ఖమ్మంజిల్లాలో గోదావరి వరదలకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సహాయ కార్యక్రమాలపై నిర్ణయం తీసుకొనేందుకై ఈనెల 26 వ తేదీన జిల్లా అధికారుల సమావేశం [illegible] విజ్ఞప్తి చేశారు.

వెంకటాపురం, భద్రాచలం, కూనవరం, బూర్గంపాడు ప్రాంతాలలో పెద్దఎత్తున ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఆలిండియా రేడియో విజయవాడ-హైదరాబాద్ కేంద్రాల నుండి వరద హెచ్చరికలపై ప్రత్యేక ప్రకటనలు చేయించాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమాలను [illegible] జిల్లా వరద నివారణ సంఘం కమిటీలను, తాలూకా, ఫిర్కా, [illegible] సహాయక కమిటీలను జిల్లా రెవెన్యూ అధికారి ఏర్పాటు చేశారు.

జిల్లాస్థాయీ సంఘం కమిటీ చైర్మన్‌గా కలెక్టరు వ్యవహరిస్తారు. [illegible]

ఏకసభ్య కమిటీ నియామకం

బెంగాల్ పోలీసు ఘటనలపై

కలకత్తా, ఆగస్టు 4

పశ్చిమ బెంగాల్ శాసన సభపై దాష్టీకం చేసిన పోలీసుల గూండా చర్యలపై విచారణ జరిపే నిమిత్తం బెంగాల్ ప్రభుత్వం నేడు ఒక ఏకసభ్య కమిటీని నియమించింది.

ఆ కమిటీలో శ్రీ వంజికోగుప్తా వుంటారు. ఈయన రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి.

వారంరోజులలోగా నివేదికను సమర్పించవలసిందిగా కమిటీని ప్రభుత్వం కోరింది.

ఇటువంటి సంఘటనలు జరగకుండా ముందుగా జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరిగిందా లేదా ఒకవేళ లేకపోతే దానికిఎవరు బాధ్యత వహిస్తారు అనే విషయాలపై ఈ కమిటీ విచారణ జరుపుతుంది.

ఈ సందర్భంగా ఉన్నతాధి కారులపై చర్యతీసుకునే విషయం పై కమిటీసమర్పించే నివేదికపై ఆధారపడి వుంటుందని డిప్యూటీ ముఖ్యమంత్రి శ్రీ జ్యోతిబాసు నేడు పత్రికా విలేకర్లకు తెలియజేశారు.

ఈ ఘటనలో ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యంచెందినదనడంలో సందేహంలేదని శ్రీబాసు పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుల పరిస్థితుల మెరుగుకు సిఫారసులు

కలకత్తా, ఆగస్టు 4

దేశంలోని 8 లక్షలమంది పారిశుధ్య కార్మికుల జీతాలను, పని పరిస్థితులను నాల్గవ తరగతి ఉద్యోగుల స్థాయికి పెంచాలని జాతీయ కార్మిక సంఘం ఏర్పాటు జేసిన కమిటీ సిఫారసు చేసింది.

ఈ సిఫారసులను అమలుపరచే నిమిత్తం కేంద్రం ఒక చట్టాన్ని చేయాలని కమిటీ తన నివేదికలో సూచించింది.

మొదట స్థానిక సంస్థలలో గ్రామ పంచాయితీలలో ఈ సిఫారసులను అమలుపర్చాలి. ఈ విషయాలను పర్యవేక్షించే నిమిత్తం యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటానికి వీలుగా చట్టాన్ని చేయాలని సూచించింది.

ఈ కమిటీకి డాక్టర్ భానుప్రసాద్ పాండ్య నాయకత్వం వహించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వారానికి ఒకరోజు శలవు తప్పకుండా యివ్వాలని, పని కాలం రోజుకు 8 గంటల కంటే మించరాదని కమిటీ సిఫారసు చేసింది.

జమేదార్లు, దారోగాలు, డ్రైవర్లు, చౌకీదార్లు మొదలగు పుద్యోగాలకు పారిశుధ్య కార్మికుల నుండే వ్యక్తులను ఎన్నుకోవాలి. పారిశుధ్య కార్మికుల పిల్లలకు విద్యాసౌకర్యాలను కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది.

ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రతి కుటుంబానికి రెండు గదులు, ఒక వంటగది వుండే గృహాలను సమకూర్చాలని కమిటీ సిఫారసు చేసింది.

వ్యవసాయ ఆధార పరిశ్రమల అభివృద్ధి

ఎంతేని అవసరముందని మంత్రి తిమ్మారెడ్డి

(విశాలాంధ్ర విలేకరి)

ఏలూరు, ఆగస్టు 5

చెరకు ఉత్పత్తిదారుల సమావేశంలో రాష్ట్ర రివెన్యూ శాఖ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధితో పాటు వ్యవసాయంతో సంబంధమున్న పరిశ్రమలు కూడా వృద్ధిచెందాల్సిన అవసరం వుందన్నారు.

ఇందుకు ప్రభుత్వం పూనుకొనేటప్పుడు ఆ పరిశ్రమకు చెందిన 'పక్కా ప్రాజెక్టు రిపోర్టు'ను ముందు తయారుచేయవలసి వున్నది. 1957 లో మహారాష్ట్ర ఒక్కసారి 18 పంచదార మిల్లులను స్థాపించుకోగల్గిందంటే, ఆ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సొమ్ముకు హామీగావుండటానికి సిద్ధపడటమేకారణం అన్నారు. ఆ పని మన రాష్ట్ర ప్రభుత్వంచేయలేకపోయింది అని శ్రీ తిమ్మారెడ్డి అన్నారు.

ప్రభుత్వశాఖల్లో సమన్వయం లేకపోవడంచేత పనిజరగడంలేదని, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు రివెన్యూ, విద్యుచ్ఛక్తి, పబ్లిక్ వర్క్సులాంటి శాఖలతో ముడిపడివుందని వీటన్నింటి సమన్వయమే వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు.

రైతులకు భూమి తనఖా బ్యాంకులు ఇస్తున్నసొమ్ము పదో శతాబ్దంలో లెక్కగట్టి ఇస్తున్నట్లుగా వుంది. ఎకరం 10 వేలవరకు భూమివిలువ పెరిగిన సందర్భంలో కొద్ది మొత్తాలు రైతులకు ఇవ్వడం జరుగుతున్నదని, ఈ విధానంలో మార్పు జరగాలని అన్నారు.

రెవెన్యూబోర్డు స్టాండింగ్ ఆర్డర్సు అనేవి పాతకాలపు పద్ధతిలో అతుకులతో, చేర్పులు, కూర్పులతో అయోమయంగా వున్నాయని, తాను బోర్డుస్టాండింగ్ ఆర్డర్సు తిరగ వ్రాయించాలని అనుకొంటున్నట్లుగా మంత్రి తెలిపారు.

అంతకుముందు భీమడోలు కో-ఆపరేటివ్ పంచదారమిల్లు చీఫ్ ప్రమోటర్ శ్రీ కొమ్మారెడ్డి సూర్యనారాయణ యం.పి.) మాట్లాడుతూ జిల్లాలో పంచదారమిల్లు స్థాపన సత్వరమే జరిగితే రైతులకు ఎంతో ఉపయోగమని, అందుకు రైతులు ముందుకు వచ్చి తమవంతు షేరుధనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో ఆగ్రో ఇండస్ట్రియల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీరామన్, జిల్లా కలెక్టర్ శ్రీ కె. సుబ్రమణ్యం శ్రీ యం. సీతారామదాసు ప్రభృతులు పంచదారమిల్లుకు అవసరమైన ధనసేకరణకై సూచనలు ఇచ్చారు. రివెన్యూమంత్రికి స్థానిక జర్నలిస్టుల సంఘం వారు ఇండ్ల స్థలాలు మంజూరు చేయవలసిందిగా విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు.

శ్రీ రంగాతో నిజలింగప్ప భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 4

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నిజలింగప్ప గత రాత్రి స్వతంత్ర పార్టీ నాయకుడు శ్రీ ఎన్. జి. రంగాతో 40 నిమిషాలపాటు చర్చలు జరిపారు. ఉభయులు అధ్యక్ష పదవి ఎన్నికలపై చర్చలు జరిపినట్లుతెలుస్తోంది.

తమ పార్టీ అభ్యర్థి శ్రీ సంజీవరెడ్డిని గెలిపించడానికి కాంగ్రెసు వాదులు భగీరథ ప్రయత్నాలు ప్రారంభించారు.

శ్రీ సంజీవరెడ్డికి మద్దతు లభించడానికి కొంత మంది ప్రముఖుల్ని ప్రచారానికి పంపడానికి అధిష్టాన వర్గం ప్రయత్నాలు చేస్తోంది.

శ్రీ అతుల్య ఘోష్, ఎస్. కె. పాటిల్ అప్పుడే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

కలుషితమైన సారాతాగి 6 గురుమృతి

అహమ్మదాబాద్, ఆగస్టు 4

అహమ్మదాబాద్ పరిసరంలోని సదాన్ గ్రామంలో గత రాత్రి కలుషితమైన సారా తాగి ఆరుగురు వ్యక్తులు మరణించారు.

ఇంకో నలుగురు వ్యక్తులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఈ సారాను తయారుచేసిన నలుగురు వ్యక్తుల్ని పోలీసులు అరెస్టు చేశారు.

శ్రీ గిరికి ఘనమైన స్వాగతం ఇవ్వండి

ట్రేడ్‌యూనియన్లకు శ్రీ అమ్‌లోక్‌రామ్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 4

రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తున్న శ్రీ వి. వి. గిరి ఈనెల 6 వ తేదీన హైదరాబాద్ వస్తున్న సందర్భంగా ఆయనకు ఘనమైన స్వాగతం యివ్వవలసిందిగా సిటీ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు శ్రీఅమ్‌లోక్‌రామ్ అన్నిట్రేడ్‌యూనియన్లకు, ఉద్యోగులకు విజ్ఞప్తిచేశారు.

శ్రీ గిరికి స్వాగతం చెప్పేందుకు 3.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం చేరుకోవలసిందిగా ఆయన కోరుతున్నారు.

దేశంలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి శ్రీ గిరికి చిరకాలంగా సాగాసన్నిహిత సంబంధాలు వున్నాయి. భారత ప్రభుత్వం శాస్త్రి బ్యాంక్ అవార్డును మార్పు చేసినందుకు నిరసనగా శ్రీ గిరి రాజీనామాచేసి మంచిసంప్రదాయాన్ని నెలకొల్పారు. ఆయన ఏఉన్నతపదవిని నిర్వహించినప్పటికీ, అనుసరించతగ్గ మంచి సంప్రదాయాలను నెలకొల్పుతూ వచ్చారు, అని శ్రీ అమ్‌లోక్‌రామ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రపతి పదవికి శ్రీ గిరి అభ్యర్థిత్వం ప్రకటించటంతో పచ్చి అభివృద్ధి నిరోధక సిండికేట్ వర్గానికి, బ్యాంకుల జాతీయాన్ని బలపరిచే ప్రగతిశీల శక్తులకు మధ్య ముఖాముఖి సంఘర్షణ ప్రారంభమయినదనటానికి ఉదాహరణ. అందువలన 6 వ తేదీన గిరికి ఘనంగా ఆహ్వానించేందుకు విమానాశ్రయం వద్ద సమీకృతం అవవలసిందిగా అన్ని ట్రేడ్‌యూనియన్లకు ప్రత్యేకంగా బ్యాంక్, రైల్వే ఉద్యోగులకు విజ్ఞప్తి చేస్తున్నాను అని శ్రీ అమ్‌లోక్‌రామ్ పేర్కొన్నారు.

శ్రీ సుందరరావు ప్రకటన

శ్రీ గిరికి ఘనమైనస్వాగతం చెప్పేందుకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకోవలసిందిగా ఆంధ్రప్రదేశ్ బ్యాంకు ఉద్యోగులఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. సుందరరావు నేడొక ప్రకటనలో బ్యాంకు ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు.

బ్యాంకు ఉద్యోగులకు శ్రీ గిరి సన్నిహితుడు, బ్యాంక్ అవార్డును ప్రభుత్వంమార్చినందుకు నిరసనగా శ్రీ గిరి 1954లో మంత్రివర్గం నుండి నిష్క్రమించారు.

తాత్కాలిక రాష్ట్రపతిగా 14 బ్యాంక్‌లను జాతీయంచేసే ఆర్డినెన్సుపై శ్రీ గిరి సంతకం చేశారు. అందువలన బ్యాంక్ ఉద్యోగులందరి మద్దతు శ్రీ గిరికి వుంటుందని అని శ్రీ సుందరరావు నేడొక ప్రకటనలో పేర్కొన్నారు.

నల్గొండలో మంత్రులకు నల్లజెండాలు

హైదరాబాద్, ఆగస్టు 3

నల్గొండ జిల్లాలోని గ్రామాలను నేడు సందర్శించిన ముగ్గురు తెలంగాణా మంత్రులకు తెలంగాణా ప్రజాసమితి అనుయాయులు నల్లజెండాల స్వాగతం చెప్పారని తెలుస్తున్నది. ఇందులో రాష్ట్ర హోంమంత్రి శ్రీ జలగం వెంగళరావుకూడా వున్నారు.

మంత్రులరాక సందర్భంగా నల్గొండ జిల్లాలో చౌటుప్పల్, పెంద్యాల్, నార్కెట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట గ్రామాలలో 200 మందికిపైగా అరెస్టుచేసినట్లు కాంగ్రెస్ శాసనసభ్యుడు ప్రముఖ ప్రత్యేక తెలంగాణావాది శ్రీ వి. గోవర్ధన్ రెడ్డి నేటి రాత్రి యు. ఎన్. ఐ. తో చెప్పారు.

మంత్రులకు నల్లజెండాలతో పాటు "ద్రోహులారా పొండి!!"అనే నినాదాలుగల బ్యానర్లు స్వాగతం చెప్పాయని ఆయన అన్నారు.

సమైక్యతావాది కాంగ్రెసు శాసనసభ్యుడైన శ్రీ నిమ్మల రాములును తెలంగాణా ఆందోళనకారులు గాయపరిచారని సూర్యాపేటనుండి ధృవపడని వార్తలు తెలుపుతున్నాయి.

ఆగస్టు 20 న రాష్ట్రపతి ఎన్నిక ఫలితాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ఈ నెల 16 వ తేదీన జరిగే రాష్ట్రపతి ఎన్నికల ఫలితాలు ఈ నెల 20 వ తేదీ సాయంత్రం ప్రకటించబడతాయి.

20 వ తేదీన ఉదయం 11.30 గంటల నుంచి పార్లమెంటు మొదటి అంతస్తులోని 62 నంబరుగదిలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లెక్కింపు సాయంత్రానికి పూర్తి అవుతుంది.

1969-70 లో లాటరీలవల్ల 12 కోట్ల నికరాదాయం

బొంబాయి, ఆగస్టు 4

వివిధరాష్ట్రాలు లాటరీలవల్ల 1969-70 లో రు. 21.52 కోట్లు రాబడిపొందుతుందని అంచనా. 1968-69లో లాటరీలవల్ల రాబడి రు. 9.92 కోట్లు 1967-68 సంవత్సరంలో రు. 20 లక్షలు.

1969-70 లో లాటరీలవల్ల రు. 12.77 కోట్ల నికరాదాయం వస్తుందని అంచనా. 1968-69 లో రు. 6.76 కోట్ల నికరాదాయం 1967-68 లో రు. 15 లక్షల నికరాదాయం వచ్చింది.

హరియానా, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు నిర్వహిస్తున్న లాటరీల ఆదాయ వ్యయ వివరాలు అందాయి. ఉత్తర ప్రదేశ్ నిర్వహిస్తున్న లాటరీల ఆదాయ వ్యయ వివరాలు అందవలసి వుంది.

అస్సాం, జమ్మూ కాశ్మీర్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాలు ఈ సంవత్సరం నుండి లాటరీలను నిర్వహించాలని నిశ్చయించాయి.

వార్తాపత్రికల ఫైనాన్స్ కార్పొరేషన్‌కు డైరెక్టర్లబోర్డు

మద్రాసు, ఆగస్టు 3

వార్తాపత్రికల ఫైనాన్స్ కార్పొరేషన్‌కు భారత ప్రధానన్యాయమూర్తి, ప్రెస్ కౌన్సిల్ ఛైర్మన్, రిజర్వుబ్యాంకు గవర్నరులతో కూడిన డైరెక్టర్ల బోర్డును నియమించనున్నట్లు కేంద్ర సమాచారశాఖ మంత్రి శ్రీ ఐ. కె. గుజ్రాల్ నేడిక్కడ చెప్పారు.

ప్రెస్ కౌన్సిల్ నివేదిక ప్రాతిపదిక పైన వార్తాపత్రికల ఫైనాన్సు కార్పొరేషన్ నెలకొల్పబడనుందనీ, ఆ విషయం పార్లమెంటు ప్రస్తుత సమావేశంలో చర్చకు రానున్నట్లు మంత్రి పత్రికాగోష్ఠిలో చెప్పారు.

చిన్న వార్తాపత్రికల అభివృద్ధికి కార్పొరేషన్ బాగా కృషిచేస్తుందని అన్నారు. గత ఐదుసంవత్సరాలుగా ప్రచురింపబడుతూ, కనీసం మూడు సంవత్సరాలుగా లాభసాటిగా నడుస్తున్న చిన్న వార్తాపత్రికలు కార్పొరేషన్ నుండి ఆర్థిక సహాయం పొందవచ్చునని అన్నారు.

చిన్న వార్తాపత్రికలు ఎదుర్కొంటున్న న్యూస్‌ప్రింట్ కొరత తీర్చేందుకు సుమారు 1500టన్నుల న్యూస్‌ప్రింట్ దిగుమతి చేసుకోనున్నట్లు గుజ్రాల్ చెప్పారు.

ప్రెస్ కమిషన్ సిఫార్సుమేరకు ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాను కార్పొరేషన్‌గా రూపొందించే అంశం పరిశీలనలో వున్నట్లు త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి చెప్పారు.

తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధితో గుజ్రాల్ కలుసుకుని, జాతీయ ఫిలిం కౌన్సిల్ ఏర్పాటుకు చెందిన ప్రతిపాదనపై చర్చలు జరిపారు.

మద్రాసు, పూనాలలోని ఫిలిం సంస్థల సమగ్ర అభివృద్ధి విషయం కూడా ఉభయులు చర్చించారు.

రేడియో

గురువారం ఆగస్టు 7

శక 1891 ★ శ్రావణ 16

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6.00 వందేమాతరం. ప్రసార విశేషాలు; 6.10 భక్తిరంజని - దీక్షితదాస్ కీర్తనలు; 6.40 ఆం. వా; 6.45 సూక్తిముక్తావళి; 6.50 పొలం పనులు; 7.00 తె. వా; 7.15 సంగీత శిక్షణ - సీనియర్లకు; 7.30 హై. వలె; 7.45 సుగమ సంగీత్; 8.00 హిం. వా; 8.15 ఆం. వా; 8.30 ఎ. వెంకయ్య - నాదస్వరం; 9.00 సమాప్తి.

11.45 మాధ్యమిక పాఠశాలలకు; 12.05 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం : 12.30 కార్మికుల కార్యక్రమం: 1.00 మంచిరాజు సత్యనారాయణమూర్తి; 1.30 ఆం. వా: 1.40 పసిడి పంటలు; 1.50 తె. వా; 2.00 వాతావరణ సూచన. ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5.30 ఎ. వెంకయ్య - నాదస్వరం; 5.55 స్థానిక ప్రకటనలు; 6.00 ఆం. వా; 6.05 ప్రాం. వా; 6.15 గ్రామలక్ష్మి - పరిమిత కుటుంబం - పరిచయము; 6.25 వ్యవసాయదారులకు వార్తా ప్రసారం; 6.30 చిత్ర తరంగిణి; 7.00 తె. వా; 7.15 పంటసీమలు; 7.45 లలిత సంగీతం; 8.00 ఉభయ కుశలోపరి; 8.15 రేడియో న్యూస్ రీల్; 8.25 టాగూర్ రచనల నుండి కొన్ని ఘట్టాలు; 8.35 ఈ రోజు పార్లమెంటులో; 8.45 హిం. వా; 9.00 ఆం. వా; 9.15 లలిత సంగీతం; 9.30 డిబేట్; 10.00 మంచిరాజు సత్యనారాయణమూర్తి: 10.30 ఆం. వా; 10.35 జన గణ మన - ప్రసార సమాప్తి.

హైదరాబాద్ (ఎ)

405.4 మీ. (740 కిలో సై.)

62.50 మీ (4800 కిలో సై)

ఉదయం : 6.30 వందేమాతరం: 6.35 భక్తిరంజని; 7.00 తె. వా; 7.15 సంగీత శిక్షణ: 7.30 సంస్కృత పాఠము; 7.45 వాద్యసంగీతం: 8.00 హిం.వా; 8.15 ఆం. వా; 8.30 ని. వలె; 9.00 వాతావరణ సూచన. ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం : 11.45 మాధ్యమిక పాఠశాలలకు; 12.05 ప్రసార సమాప్తి.

12.30 కార్మికుల కార్యక్రమము: 1.00 సంధుల శ్రీరామమూర్తి: 1.30 ఆం. వా: 1.40 [illegible]; 1.50 తె. వా: 2.00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సాయంత్రం : 5.55 ప్రసార విశేషాలు; 6.00 ఆం. వా: 6.05 ప్రాంతీయ వార్తలు; 6.15 ఉర్దూలో కార్యక్రమం; (హైదరాబాద్ కేంద్రము మాత్రమే): 6.25 వ్యవసాయదారులకు; 6.30 [illegible]: 7.00 తె: వా:

7.15 పురాణ కాలక్షేపం: 7.30 లలిత సంగీతం: 7.45 ఆంగ్లం: 8.00 మీరు కోరిన పాటలు: 8.30 పరిచయపత్రిక; 8.40 జానపదగేయాలు: 8.45 హిం. వా: (కడప, విశాఖపట్టణాలు మాత్రమే): 9.00 ఆం. వా: 9.15 వాద్యసంగీతం: 9.30 ఆంగ్లం; 10.05 సంధుల శ్రీరామమూర్తి: 10.30 ఆం. వా: 10.35 వాతావరణ సూచన - జన గణ మన, ప్రసార సమాప్తి.

కడప

333.3 మీ. (900 కిలో సై.)

సా॥ 5.55 నుండి రాత్రి 10.35 వరకు

శనివారములు మాత్రము

సా॥ 5.55 నుండి రాత్రి 11.05 వరకు

విశాఖపట్నం

322.6 మీ. (930 కిలో సై.)

సా॥5.55 నుండి రాత్రి 10.35 వరకు

హైదరాబాద్ (బి)

217.4 మీ. (1380 కిలో సై.)

ఉదయం : 6.30 వందేమాతరం: 6.40 ఆం. వా; 6.45 సుగమ సంగీత్: 7.00 నందాలాల్ ఘోష్: సరోద్: 7.30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం : 2.00 శాస్త్రీయ సంగీత్; 2.10 ఉ. వా; 2.20 శాస్త్రీయ సంగీత్: 2.30 ఉన్నతర ప్రాథమిక పాఠశాలలకు (ఉర్దూ): 2.50 సుగమసంగీత్: 3.00 ప్రసార సమాప్తి.

రాత్రి : 8.00 సుగమ సంగీత్: 8.15 రేడియో వార్తావాహిని: 8.25 వాద్యసంగీత్: 8.35 ఈరోజు పార్లమెంటులో: 8.45 హిం. వా: 9.00 చిత్రపట్ సే: 9.15 ఉ. వా; 9.30 ఉర్దూలో కార్యక్రమము; 10.00 [illegible]: 10.30 జన గణ మన, ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

211.3 మీ . (1420 కిలో సై.)

ఉదయం : 6.55 వందేమాతరం,మంగళధ్వని: 7.00 తె. వా: 7.15 సంగీతమంజరి- 7.30 టి. కె. రంగాచారి: 8.00 హిం. వా: 8.15 ఆం. వా: 8.30 ప్రసార సమాప్తి.

(211.3 (మీ 1420 కి. సై)

మధ్యాహ్నం : 1.00 పాశ్చాత్యసంగీతం: 1.30 ఆం. వా: 1.40 వాద్యగోష్టి: 1.50 తె. వా: 2.00 ప్రసార సమాప్తి.

211.3 మీ. (1420 కిలోసై)

సాయంత్రం : 5 30 పాశ్చాత్యసంగీతం: 6.00 ఆం.వా: 6.05 ప్రాంతీయ [illegible]: 6.30 మహిళా మండలి - స్త్రీల కార్యక్రమం: 7.00 తె: వా: 7.15 సంగీత మంజరి: 7.30 వాద్య సంగీతం: 7.45 చిత్రగానం. 8.15 రేడియో న్యూస్ రీల్: 8.25 అంజలి: 8.35 ఈ రోజు పార్లమెంటులో: 8.45 హిం. వా: 9.00 ఆం. వా: 9.15 ఢిల్లీనుండి రిలే: 9.30 డిబేట్: 10.00 [illegible]: 10.30 ఆం.వా: 10.35 వాతావరణ సూచన జన గణ మన - ప్రసార సమాప్తి.

విశాలాంధ్ర

1969 ఆగస్టు 6 బుధవారం

ముదుగునీటి పారుదల పథకాలపట్ల అలసత్వం

జూలై ఆఖరువారంలో వరుసగా 10 రోజులు కురిసిన అధిక వర్షాలవల్ల కృష్ణా గోదావరి డెల్టాలలో పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయినాయి. మురుగుకాల్వలన్నీ పొంగి, పూడ్పులు జరిగిన వేలాది ఎకరాలు నీట మునిగిపోయాయి. మరికొన్ని వేల ఎకరాలలో నాట్లకు అంతరాయం కలిగింది.

మే నెలలో తుపాన్ బీభత్సంతో దాళ్వాపంట నాశనమై విపరీతంగా నష్టపోయిన రైతాంగానికి ఈ మురుగుకాల్వల ముంపు గోరుచుట్టుపై రోకటిపోటులా పరిణమించింది

పశ్చిమ గోదావరిజిల్లాలోని భీమవరం, నర్సాపురం తాలూకాల్లోను, కృష్ణాజిల్లాలోని గుడివాడ, కైకలూరు బందరు, దివి తాలూకాల్లోను, గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా మొదలైన ప్రాంతాల్లోను యీ మురుగునీటిదెబ్బ తీవ్రంగా ఉన్నట్టు వార్తలు అందుతున్నాయి. ఇతర ప్రాంతాల్లో నష్టాల వివరాలు ఇంకా అందవలసి ఉన్నది.

కృష్ణాగోదావరి జిల్లాలో మురుగునీటి పారుదల పథకాల గురించిన మిత్రా కమిటీ సిఫారసులు వెలువడి అయిదు సంవత్సరాలు అవుతూంది. కేంద్రంనుండి ఇందుకు తగు నిధులు సంపాదించడానికి బదులు ఈసిఫారసులు అమలుకు రైతాంగంమీదనే ఈ భారాన్ని మోపటానికి రాష్ట్రప్రభుత్వం డ్రైనేజి సెస్సు చట్టం చేసి సంవత్సరం దాటుతోంది. ఎకరానికి 10 మొదలు రు. 25 వరకు రైతాంగంమీద అదనపుభారం విధించబడింది.

అయినప్పటికీ ఈ మురుగునీటి పారుదల పథకాల విషయంలో ఇంతవరకు ప్రభుత్వం ఒక నిర్దిష్ట కార్యక్రమాన్ని చేపట్టలేదు. కొల్లేరు, బుడమేరు మొదలైన పెద్ద పథకాలను మినహాయించి స్థానికమురుగు కాలువలు త్రవ్వటకు సుమారు రు 5 కోట్లువ్యయం కాగలదని మిత్రాకమిటీసూచించింది. ప్రభుత్వంయీ చిన్న చిన్న మురుగుకాల్వల మరమ్మతులకుకూడా ఇంతవరకుజిల్లాల వారీగ పథకాలను రూపొందించలేదు. రెవిన్యూ, పి డబ్ల్యు.డి. శాఖలలో ఈ విషయమై ఇంతవరకు ఎక్కడా కదలిక ఉన్నట్లు కనబడదు. అందుచే వర్షాకాలంవచ్చేసరికి ఏ ఏటేటా సంభవించే ముంపు దెబ్బవలెనే ఈ ఏడాదికూడా మురుగునీటి పొంగుతో రైతాంగం నష్టపడక తప్పలేదు.

నాల్గవ ప్రణాళికా కాలంలో వరద నిరోధక పథకాలకు కేంద్రం వెచ్చించదలచిన నిధుల నుండిగాని, ప్రపంచ బ్యాంకు ఇదే విషయమై మన దేశానికి ఇవ్వదలచిన నిధుల నుండిగాని ఆంధ్రలోని మురుగునీటి పారుదల పథకాలకు తగు మొత్తం రాబట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలి. ఇక ఎంతమాత్రం జాగుచేయకుండా ఈ మురుగునీటి పారుదల పథకాలకు యిప్పటి నుండే తగుఅంచనాలు తయారుచేయించి డిసెంబరునుండి మురుగు కాల్వల మరమ్మతులకు పూనుకోవాలి. అందుకు రెవెన్యూ, పి. డబ్లు డి. శాఖలను మేల్కొలపాలి.

మే నెలలో తుపాన్ ఫలితంగా దాళవా పంటలు నాశనం గావడంతోపాటు సారవా ఆకుమళ్ళు దెబ్బతిని, పూడ్పులు ఆలస్యమై రైతాంగం సతమతమవుతున్న స్థితిలో ఈ అధికవర్షాల వల్ల మురుగునీటిముంపువల్ల వారుమరింత నష్టపడ్డారు. అనేకచోట్ల వారం పదిరోజులు నీటిక్రింద మునిగివున్న పైరులు కుళ్ళిపోయాయి.

మురుగు దెబ్బతిన్న ఇటువంటి ప్రాంతాలలో జిల్లా అధికారులు పర్యటించి నష్టాలగురించిన నివేదికలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలి. వారికి ఋణాలు మంజూరు చేయాలి విత్తనాలు, ఎరువులు సరఫరాచేసి ఆదుకోవాలి.

చిన్న రైతులకు ప్రత్యేక పథకం

లోక్ సభలో శ్రీ ఈశ్వరరెడ్డి ప్రభృతుల ప్రశ్నకు మంత్రి సమాధానం

న్యూఢిల్లీ ఆగస్టు 5

చిన్నరైతుల కుపయోగపడే ప్రత్యేక పథకం ఆహార, వ్యవసాయ, కమ్యూనిటీ డెవలప్ మెంటు సహకార మంత్రిత్వశాఖచే సూత్రప్రాయంగా ఏర్పాటు చేయబడిందని రాష్ట్రాల్లో దాన్ని ప్రవేశపెట్టే విషయమై వ్యవసాయఉత్పత్తి కమిషనర్ల సదస్సు ముందుంచబడిందని జూలై 24న లోక్ సభలో శ్రీ ఈశ్వరరెడ్డి ప్రభృతుల ప్రశ్నకు సమాధానమిస్తూ మంత్రి శ్రీ ఎ. పి. సిందే అన్నారు.

ఈ పథకం ఏర్పాటు విషయమై వ్యవసాయ ఉత్పత్తి కమీషనర్ల సదస్సు నిర్ణయం తీసుకున్నదా? ఏర్పాటు చేయబడినట్లయితే దాని వివరాలేమిటి? దేశంలోని వివిధ భాగాల్లో ఎన్నిక చేయబడిన పరిమిత జిల్లాలెవి? ఏ పద్ధతిపై జిల్లాల ఎన్నిక జరిగింది? అవి ఏవి? అని శ్రీయుతులు [illegible] అలీఖాన్, సర్జూపాండే, ఈశ్వరరెడ్డి, ఆర్. బారువా, [illegible] నాయుడు, నాథూరామ్ అహిర్వార్ లు ప్రశ్నించారు.

ఈ పథకం సూత్రప్రాయంగా ఏర్పాటు చేయబడింది. కానీ తుది నిర్ణయం జరుగలేదు. దేశంలోని వివిధ భాగాల్లోని 20, 21 పరిమిత జిల్లాల్లో ఈ పథకం ప్రవేశపెట్టబడిందని మంత్రి సమాధానమిచ్చారు.

ఋణాలు పొందే అవకాశం లేకుండా తమ శక్తితోనే పెట్టుబడులు పెట్టి సాంద్ర వ్యవసాయానికి, ఇతర పెట్టుబడులకు ఉపయోగపడే చిన్న రైతులసంఖ్య గణనీయంగా వుండటం, చెరువులు, కాల్వల నీరు, [illegible] జలాల వసతులు కల్పించటం, తదితరాల ఈ పథకం ప్రవేశపెట్టేందుకు జిల్లాలను ఎన్నిక చేశారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాల సంప్రదింపులపై ఈ సెలక్షను జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం వివరాలను కూడా మంత్రి వివరించారు.

భద్రాచలం సహకార సంఘ ఎన్నికల్లో మార్క్సిస్టుల ఓటమి

కమ్యూనిస్టులను ఓడించాలని కాంగ్రెసు జనసంఘాలతో కలసినా ఫలితం దక్కని స్థితి

ఖమ్మం, ఆగస్టు 5

ఖమ్మంజిల్లా, భద్రాచలం పట్టణానికి చెందిన కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలలో స్థానిక కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులను ఓడించడానికై మార్క్సిస్టుపార్టీ పడరానిపాట్లు పడి కాంగ్రెసు,జనసంఘంవారితో లాలూచీపడి అమాంబాపతు కూటమిని ఏర్పాటుచేసుకొన్నప్పటికీ ఫలితం దక్కకపోగా మార్క్సిస్టుల "పవిత్ర" కూటమికి శృంగభంగం తప్పలేదు.

(ఈ వార్తను ఇదివరకే సంక్షిప్తంగా యిచ్చాం. ఆలస్యంగా అందిన వివరాలు ఈ దిగువ ఇస్తున్నాం.)

పార్టీ చీలిన తరువాత చాలాకాలంవరకు మార్క్సిస్టు పార్టీలోనేవుండి గతసంవత్సరమే అనేకమంది ముఖ్య కార్యకర్తలు పార్టీసభ్యులు తిరిగి కమ్యూనిస్టు పార్టీలోనికి వచ్చిన తరువాత మార్క్సిస్టుపార్టీ క్షీణించిపోయినప్పటికీ ఇంకా తమదే బలం వుందని బింకాలు పలుకుతున్న మార్క్సిస్టు పార్టీ వారికి, కమ్యూనిస్టులకు మధ్య యీ ఎన్నికలు సవాలుగానే ఇప్పటి ప్రజలు భావించి కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులను ఎన్నుకున్నారు.

యీ ఎన్నికల ఫలితాలకోసం భద్రాచలం పట్టణ ప్రజలేగాక చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు కూడా ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఫలితాలు తెలియగానే అనేకమంది తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు ముఖ్యంగా మార్క్సిస్టుపార్టీ, వారి కూటమి తరపున పోటీచేయబడిన వారు వ్యాపారస్తులు, కాంట్రాక్టుదార్లు అయి వుండగా వారితో పోటీచేసి గెలిచిన కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులు కేవలం కార్మికవర్గానికి చెందిన వారవటం, ఎన్నికల ఫలితాలు ఎంతగానో ఆసక్తిని కలిగించాయి.

ఉమ్మడిపార్టీ సమయంలో పరిస్థితి

ఖమ్మంజిల్లా భద్రాచలం కో.ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ స్థాపించిన తరువాత అనేక సంవత్సరాలపాటు కాంగ్రెసు చేతిలో వున్నది. ఆనాడు ఉమ్మడిపార్టీగా వున్నప్పుడు కమ్యూనిస్టుపార్టీ పోరాడి దాన్ని కాంగ్రెసు నుండి లాగబడి 8 సంవత్సరాలుగా పార్టీ నడుపుకున్నది. పార్టీ చీలిన తరువాత యీ సంస్థ యావత్తూ మార్క్సిస్టుపార్టీ వారి ఆధీనమైపోయింది. గత సంవత్సరం దీని అధ్యక్షులైన శ్రీ [illegible] మార్క్సిస్టు పార్టీనుంచి బయటపడి కమ్యూనిస్టుపార్టీలో ప్రవేశించిన పిదప పరిస్థితి అంతా తారుమారైందనే ఉద్దేశ్యంతో యీ సంస్థ నెలాగైనా సాగకుండా చేయాలనే దురుద్దేశ్యంతో, ఎన్నికలు పెడితే తమ ఓటమిఖాయమని తెలుసుకొని ఆనాడు కార్యవర్గంలో మెజార్టీగావున్న మార్క్సిస్టులు కుట్రపన్ని యీ సంస్థను రద్దుపర్చి స్పెషల్ ఆఫీసరు పాలన వచ్చేటట్లు తీర్మానించారు. అందువల్ల దీని ఎన్నికలు గత సంవత్సరం వాయిదా పడ్డాయి.

తిరిగి యీ సంవత్సరం ఎన్నికలు కో-ఆపరేటివ్ అధికార్లే జరుపవలసివచ్చింది. యీసారి ఎలాగైనా కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులను ఓడించాలని మార్క్సిస్టు పార్టీ వారు నానా తంటాలు పడ్డారు. ఉభయ పార్టీలు కలిసి కాంగ్రెసును ఓడించటం మంచిదని పార్టీ సూచించిన సహేతుకమైన సూచనను కూడా కాదని కాంగ్రెసుతో కలసినాసరే ఫరవాలేదు. కాని కమ్యూనిస్టులను మాత్రం గెలవనివ్వరాదని మార్క్సిస్టు పార్టీ కార్యకర్తలు బాహాటంగా చెప్పుకున్నారు. చివరకు కాంగ్రెసు జనసంఘాలతో కలిసి ఫ్రంటుకట్టి కమ్యూనిస్టు పార్టీపైన పోటీకి నిలబడ్డారు. కమ్యూనిస్టుపార్టీ ఒంటరిగానే నిలబడి బలాబలాలు తేల్చుకోవాలని దృఢ దీక్షతో ఎదిరించింది.

ఓటింగ్ వివరాలు

7 డైరెక్టర్ల స్థానాలకు కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులను పోటీ పెట్టగా, మార్క్సిస్టుపార్టీ కూటమి తరపునకూడా అన్నిస్థానాలకు పోటీలో నిలబడ్డారు. చివరి నిమిషందాకా తామే గెలుస్తామని మార్క్సిస్టులు బింకాలు పలికారు. కాని ఓటింగు ఫలితాలు తెలిసేసరికి చల్లగా తప్పుకున్నారు. కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులకు 127 ఓట్లు రాగా మార్క్సిస్టు కూటమి అభ్యర్థులకు 82 ఓట్లు వచ్చాయి. పోటీచేసి ఓడిపోయిన వారిలో భద్రాచలం డివిజన్ మార్క్సిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ టి. వి. ఆర్. చంద్రం, ఆ ప్రాంతంలో వారికి ముఖ్యనాయకుడనబడే శ్రీ బండారు చంద్రరావుగారలు వుండటం గమనార్హం. శ్రీ చంద్రరావు ఈ సంస్థకు 7 సంవత్సరాలపాటు అధ్యక్షులుగా పనిచేశారు.

ఎన్నికైన కమ్యూనిస్టు అభ్యర్థులు

అధ్యక్షులుగా శ్రీ [illegible], ఉపాధ్యక్షులుగా శ్రీ బి. భూపతిరావు, కార్యదర్శిగా శ్రీ యం. మృత్యుంజయమాచారి డైరెక్టర్లుగా శ్రీయుతులు యం. డి. జానీసాహెబ్, దాసరి వెంకయ్య, కోరం రాజులు, శ్రీమతి మీసాల వెంకటసుబ్బమ్మగారలు వున్నారు.

రాష్ట్రాల్లోని కరువు ప్రాంతాలకు 10 శాతం కేంద్ర సాయం

దీర్ఘకాలంగా కరువుకు గురవుతున్న ప్రాంతాలకు సహాయం, తదితర ప్రత్యేక అంశాలకై 4వ పంచవర్ష ప్రణాళికా కాలంలో రాష్ట్రాలకు 10 శాతం కేంద్ర సాయం వీలవుతుందని లోక్ సభలో జూలై 24న శ్రీయుతులు ఈశ్వరరెడ్డి, డి. ఎన్. పటోడియాల ప్రశ్నలకు సమాధానమిస్తూ మంత్రి శ్రీ ఎ. పి. సిందే అన్నారు.

దీర్ఘకాలంగా కరువు, కాటకాలకు గురవుతున్న ప్రాంతాల అభివృద్ధి అంశాలను పరిశీలించుటకై కేంద్ర నమూనాతో కూడిన ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారా? ఏర్పాటుచేసినట్లయితే ఎలాంటి నిర్ణయం తీసుకున్నారు? అని శ్రీ ఈశ్వరరెడ్డి, పటోడియాలు ప్రశ్నించారు.

దేశవ్యాపితంగా వివిధ రాష్ట్రాల్లో వున్న కరువు ప్రాంతాల్లో పరిమిత సమస్యలను యిలాంటి సమస్యను ఏదో ఒక కేంద్ర ప్రయోగాత్మకంగా ఎదుర్కొనలేదన్నారు.

దీర్ఘకాలంగా కరువుకు గురవుతున్న ప్రాంతాల అభివృద్ధి పథకాన్ని 1969 ఏప్రిల్ 1 నుండి అమలుకై రాష్ట్ర రంగానికి ఇవ్వబడిందన్నారు.

6 నెలలుగా పిల్లల్ని మభ్యపెట్టి బంగారం కాజేస్తున్న దొంగ

ఏలూరులో పట్టుబడి

ఏలూరు, ఆగస్టు 5

గత ఆరు నెలలుగా పట్టణంలో పలు ప్రాంతాల్లో బాలికలకు మిఠాయిపెట్టి, సైకిల్ మీద తీసుకొనివెళ్ళి, వంటిమీదనున్న బంగారాన్ని కాజేస్తున్న గుంటూరుజిల్లా కొనగొళ్ళ గ్రామానికి చెందిన తటవర్తి జనార్ధనరావు అనే దొంగను పోలీసులు పట్టుకున్నారు.

అతనివద్దనుంచి దొంగిలింపబడిన 30 సవర్ల బంగారాన్ని స్వాధీన పరచుకొనడం జరిగింది.

సెకండ్ అడిషనల్ జ్యుడిషరీ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు పెట్టబడింది. కేసు విచారణ జరిగి జనార్దనరావుకు 18 నెలల శిక్ష విధించబడింది. (వి. వి)

విద్యార్థి నాయకునిగా ఫెడరేషన్ అభ్యర్థి ఎన్నిక

ఈదర సుబ్బమ్మాదేవి మున్సిపల్ హైస్కూలు విద్యార్థుల స్కూల్ పీపుల్ లీడర్ ఎన్నికల్లో విద్యార్థి ఫెడరేషన్ అభ్యర్థి శ్రీ పి. అప్పలరాజు ఎన్నికయ్యారు. (వి. వి.)

ఒంగోలు, ఆగస్టు 3

ఒంగోలు పత్రికా విలేకరుల అసోసియేషన్ కార్యదర్శి, హిందూ, ఆంధ్ర పత్రికల విలేకరియైన శ్రీ భీమరాజు నరసింహారావు ఈనెల 1వ తేదీ ఉదయం మృతి చెందారు.

రాష్ట్రవ్యాపితంగా ఐక్య ఉపాధ్యాయ సమావేశాలు

ఏలూరు, ఆగస్టు 5

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఆదేశానుసారం కొఠారి కమిషన్ స్కేళ్ళ సాధనకై జరిపే ఆందోళన కార్యక్రమంలో ప్రథమ ఘట్టంగా, జిల్లా కేంద్రమైన ఏలూరులో ఉపాధ్యాయుల నిరసన సభ జరిగింది.

కె. పి. డి. టి. హైస్కూలు [బ్రాంచి] లో జరిగిన ఈ సభకు జిల్లా టీచర్సు గిల్డు అధ్యక్షులు శ్రీ డి. కామేశ్వరరావు అధ్యక్షత వహించారు.

సభలో జిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ కార్యదర్శి శ్రీ పి. సుబ్బారావు, శాసనమండలి సభ్యులు శ్రీ డి. ఎస్. సుబ్రమణ్యం, స్థానిక కళాశాల లెక్చరర్ శ్రీ వెల్చేరు నారాయణరావు, జిల్లా ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ కె. వెంకటేశ్వర్లు, జిల్లా టీచర్సు గిల్డు కార్యదర్శి శ్రీ యం. రామకృష్ణారావు తదితరులు కొఠారి కమిషన్ స్కేళ్ళను వెంటనే అమలుపరచాలని, అందుకు ఉపాధ్యాయులు ఐక్యతతో ఆందోళన చేయాల్సి వుందని ప్రసంగించారు.

నాలుగు ఉపాధ్యాయ సంఘాలచే సంయుక్తంగా ఏర్పాటు చేయబడిన ఈ సభలో కొఠారి కమిషన్ స్కేళ్ళను అమలుపరచుటలో ప్రభుత్వం అనుసరించుచున్న విపరీత జాప్యాన్ని నిరసించుతూ, ప్రభుత్వం వెంటనే ఆ స్కేళ్ళను అమలుపరచాలని డిమాండు చేస్తూ తీర్మానించారు.

తీర్మానం టెలిగ్రాం ద్వారా ముఖ్యమంత్రికి పంపడం జరిగింది.

రామచంద్రపురం పట్టణ ఐక్య ఉపాధ్యాయ సభ

తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం పట్టణంలోని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త సమావేశం ఆగస్టు 1వ తేదీన జరిగింది శ్రీ వసుపులేటి వీర్రాజు అధ్యక్షత వహించారు.

కొఠారి కమిషన్ సూచించిన స్కేళ్ళను అమలు జరపడంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యం సహించరానిదని సభాధ్యక్షులు అన్నారు. ఉపాధ్యాయులంతా ఐక్యంగా నిలబడి వేతనాల పెంపుదల సాధించాలని అన్నారు.

ప్రభుత్వ విధానాన్ని విమర్శిస్తూ పలువురు సభలో ప్రసంగించారు.

రాష్ట్రసంఘాల సంయుక్త ఆదేశానుసారం నిరసన తీర్మానం ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించడమైనది.

కన్వీనర్ శ్రీ బ్రహ్మానందరావు స్థానిక ఉపాధ్యాయ సంఘాల సాధక బాధకాలను వివరిస్తూ మాట్లాడారు.

తాడేపల్లిగూడెం టీచర్స్ గిల్డు సమావేశం

1968 డిసెంబరు నెలలో [illegible] ప్రకటించిన కొఠారి కమిషన్ స్కేళ్ళను ఉపాధ్యాయులకు వెంటనే అమలు జరపాలని పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం తాలూకా టీచర్సు గిల్డు సమావేశం కోరింది.

ఈ సమావేశం ఆగస్టు 1వ తారీఖున శ్రీ కె. వి. యస్. శర్మ అధ్యక్షతన జరిగింది

బాపట్లలో వివిధ ఉపాధ్యాయ సంఘాల సభ

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ఆదేశానుసారం ఆగస్టు 1వ తారీఖున బాపట్లలోని ఉపాధ్యాయుల సభ జరిగింది. వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన వారు సమావేశానికి హాజరైనారు.

సభకు శ్రీ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు.

శ్రీయుతులు ఆర్ల నాగేశ్వరరావు, మంత్రవాది సత్యనారాయణ, బి. వి. రత్నం తదితరులు సభలో ప్రసంగించారు.

కొఠారి కమిషన్ వేతనాలను ఉపాధ్యాయులకు వర్తింపచేయడంలో ప్రభుత్వం చేస్తున్న దగా గురించి సమావేశం నిరసన తెలిపింది. వెంటనే ఉపాధ్యాయుల వేతనాలను పెంచాలని కోరుతూ తీర్మానం ఆమోదించింది.

తునిలో సంయుక్త కార్యాచరణ సమితిసభ

తూర్పుగోదావరిజిల్లా తుని తాలూకా ఉపాధ్యాయ సంఘాల సంయుక్తకార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన ఇటీవల సభ జరిగింది. శ్రీ బాలాంజనేయశాస్త్రి సభకు అధ్యక్షత వహించారు.

రాష్ట్రప్రభుత్వోద్యోగులకు జీతాలు పెంచి ఉపాధ్యాయులకు జీతాలు పెంచకుండా ప్రభుత్వం చూపిన పక్షపాతం పాలించు విధానాన్ని సభలో పలువురు విమర్శించారు.

వెంటనే కొఠారి కమిషన్ స్కేళ్ళను అమలుపరచాలని తీర్మానం ఆమోదించబడింది. సమావేశానికి 60 మంది ఉపాధ్యాయులు హాజరైనారు.

గ్రామోద్యోగుల నాయకులకు సన్మాన సభ

రామచంద్రపురం ఆగస్టు 5

తూర్పు గోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకా ద్రాక్షారామంలో తూర్పుగోదావరిజిల్లా గ్రామోద్యోగుల సంఘం ఆధ్వర్యాన, రాష్ట్ర గ్రామోద్యోగుల సంఘాధ్యక్షులు శ్రీ గోగినేని నాగేశ్వరరావుని ప్రధానకార్యదర్శి శ్రీ ద్రోణంరాజు సత్యనారాయణ సన్మానించారు.

సభకు శాసనసభ్యులు శ్రీ చెముడుపాటి వెంకటరత్నం అధ్యక్షత వహించారు.

తూర్పు గోదావరిజిల్లా కలెక్టర్ శ్రీ పి. యస్. కృష్ణన్ సభను ప్రారంభించారు.

సన్మానితులను పుష్పమాలలతో ఘనంగా పూరేగించారు.

పలువురు సన్మానితులనుగూర్చి ప్రసంగించారు. సభకు సుమారు 2 వేలమంది గ్రామోద్యోగులు, అధికార్లు, అనధికార్లు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో కాటన్ మార్కెట్, పేకాట క్లబ్బులు

చిలకలూరిపేట, ఆగస్టు 5

గుంటూరు జిల్లా, చిలకలూరిపేటలో [illegible] కాటన్ మార్కెట్, పేకాట క్లబ్బులు అక్కడక్కడ తెరువబడుతున్నాయి.

కొందరు రాజకీయ నాయకుల అండవల్లనే బహిరంగంగా కాటన్ మార్కెట్ లాంటి జూదవ్యాపారం సాగుతున్నట్లు తెలుస్తున్నది.

ప్రస్తుత సబ్ ఇన్స్పెక్టరు రాకపూర్వం క్లబ్బులు విపరీతంగా వుండేవి ఆయన వచ్చిన తర్వాత అనేక క్లబ్బులను యిలాంటి వ్యాపారాలను స్తంభింపజేశారు.

కాని తిరిగి ఆయన సమక్షంలోనే ఇలాంటివి బహిరంగంగా జరగటం చూస్తే వారి కృషికి గండికొడుతూ రాజకీయ నాయకుల అండ కొంత కల్పిస్తున్నట్లు తెలుస్తున్నది కనుక పై అధికారులు వెంటనే జోక్యం చేసుకొని యిలాంటి అవినీతికర వ్యాపారాలను అరికట్టాలని స్థానిక ఎస్. ఎస్. పి. కార్యదర్శి [illegible] వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

దోభీ ఖానాలు నిర్మించాలి

తూర్పుగోదావరి జిల్లా రజక సంఘ కార్యవర్గం తీర్మానం

పిఠాపురం, ఆగస్టు 4

ప్రతి మున్సిపాలిటీలోను రజకుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని దోభీఖానాలు నిర్మించాలని, [illegible] ప్రభుత్వం జారీ చేయాలని కోరుతూ తూర్పుగోదావరిజిల్లా రజక సంఘ కార్యవర్గ సమావేశం తీర్మానం చేసింది.

ఈ సమావేశం జూలై 27వ తేదీన పిఠాపురంలో రాష్ట్రసంఘాధ్యక్షుడు శ్రీ చెలివాక తలుపులు అధ్యక్షతన జరిగింది. ముందుగా శ్రీ ఎస్. సత్యనారాయణరెడ్డి, డా. జాకిర్ హుసేన్ ల మృతికి సంతాపం తెలియజేశారు.

శ్రీ చెలివాక తలుపులు మాట్లాడుతూ రజకులు సంవత్సర జీతాలు రద్దుచేసుకొని రోజువారి కూలిరేట్లనలుగా బట్టలు వందల లెక్కలోనికి మార్చుకొని కనీసం రు. 15 వసూలుచేస్తూ స్వక్రమపద్ధతిని వృత్తి సాగించినచో పల్లెగ్రామాలు వదలి పట్టణవాసాలకు వలసపోయే దుస్థితి వుండదన్నారు.

మరికొన్నితీర్మానాలు కూడా చేయబడ్డాయి

రేపల్లె నుండి గుంటూరు టెలిఫోన్ లైనుకై విజ్ఞప్తి

రేపల్లె, ఆగస్టు 5

రేపల్లె పట్టణంనుండి గుంటూరుకు సరాసరి టెలిఫోను లైను ఏర్పాటు చేయవలసిందిగా పురపాలక సంఘ మాజీ ఉపాధ్యక్షులు శ్రీ మేకా రామకోటేశ్వరరావు టెలిగ్రాఫ్ డివిజనల్ యింజనీరు దృష్టికి తెచ్చారు. యింజనీరు లైను ఏర్పాటు చేయుటకు ప్రయత్నం చేస్తామని చెప్పారు. పెండింగ్‌లో నున్న ఫోన్లు వెంటనే యిస్తామని, ప్రస్తుతం ఉన్న ఫోన్లు బాగా పనిచేయునట్లు అన్ని ఏర్పాటులు చేస్తామని యింజనీరు అన్నారు.

జూనియర్ కాలేజికి నిధి వసూళ్ళు

గుంటూరుజిల్లా రేపల్లెలో జిల్లా పరిషత్తు హయ్యర్ సెకండరీస్కూలును జూనియర్ కాలేజీగా నడుపుటకు కావలసిన నిధిని కమిటీ వారు రేపల్లె పట్టణంలో వసూళ్ళు ప్రారంభించారు. వసూళ్ళ కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ డాక్టర్ మైనేని సీతారామయ్య, రేపల్లె సమితి ప్రెసిడెంటు డి. బుచ్చారావు, [illegible] బసవ పున్నయ్య, మండలి సుబ్రమణ్యం, కొచటాల సత్యనారాయణ, మేకా రామకోటేశ్వరరావులు వున్నారు.

యల్.ఐ.సి. ఏజెంట్ల సంఘ నూతన కార్యవర్గం

విజయవాడ, ఆగస్టు 3

విజయవాడ జీవిత భీమా ఏజెంట్ల సంఘానికి యీ క్రిందివారు 1969.70 సంవత్సరానికి ఆఫీసు బేరర్లుగా ఎన్నికయ్యారు.

శ్రీయుతులు కొత్త మాధవరావు (అధ్యక్షులు), జి. హనుమంతరావు (కార్యదర్శి) సహాయకార్యదర్శులు ఎం. సీతారామయ్య, ఎం. పున్నారావు, ఉపాధ్యక్షులు పి. సూర్యనారాయణ, యస్. సుబ్రహ్మణ్యం, మరో 11 మంది కమిటీసభ్యులుగా ఎన్నికయ్యారు.

స్కూళ్ళ ఇనస్పెక్టర్ అవినీతి చర్యలు

భీమడోలు సమితిలో ఉపాధ్యాయుల కడగండ్లు

(విశాలాంధ్ర విలేకరి)

ఏలూరు, ఆగస్టు 5

ఏలూరు తాలూకా భీమడోలు సమితికి చెందిన సీనియర్ డిప్యూటీ ఇనస్పెక్టర్ పక్షపాతం వుపాధ్యాయులనుండి అక్రమంగా వసూళ్ళు చేస్తున్నట్లు పలువురు ఉపాధ్యాయులు ఆరోపించుచున్నారు.

ముఖ్యంగా ఈ స్కూళ్ళ ఇనస్పెక్టర్ ఎయిడెడ్, మిషన్ పాఠశాలలను నెలకు ఒకటి రెండుసార్లు విజిట్ చేస్తూ, ప్రతి విజిట్ కు, రు. 5 చొ॥ ఉపాధ్యాయులనుండి నిర్బంధంగా వసూలు చేస్తున్నట్లు తెలియవచ్చింది

ఉపాధ్యాయుల్లో ఎవరైనా డబ్బులేదని చెబితే, ఎక్కడైనా అప్పుతీసుకొని వచ్చి ఇచ్చేవరకు పాఠశాలలోనే వుంటానని బహిరంగంగా చెబుతున్నాడని తెలిసింది

పాఠశాల సాంవత్సరిక పరీక్షను ఒక్కొక్క ఉపాధ్యాయుని రు. 15 ఇమ్మని కోరితే [illegible] రద్దుచేస్తానని బెదిరించడం జరుగుతున్నదని. ప్రివిలేజిలీవు పెట్టుకొన్నందుకు రు. 10 జరిమానా చెల్లించకపోతే ఆ సెలవు మంజూరు చేయటంలేదని తెలుస్తున్నది.

[illegible] మిషన్ పాఠశాలలో పని చేయు ఒక ఉపాధ్యాయుని జీతం అడిగిన లంచం ఇవ్వలేదని 13 నెలల పాటు ఆపటం జరిగింది చివరకు జిల్లా విద్యాశాఖాధికారి జోక్యంతో చెల్లింపచేయడం జరిగిందని తెలుస్తున్నది.

తాను అడిగిన లంచం రు. 200, ఇవ్వలేదని ఆ టీచరుకు తిరిగి జనవరినెల నుండి జీతం మంజూరు చేయకుండా ఆపినట్లు తెలుస్తున్నది.

ఈవిధంగా అక్రమ వసూళ్ళకు అలవాటుపడిన స్కూళ్ళఇనస్పెక్టర్ చర్యలను చూచి సమితిలోని వుపాధ్యాయులు ఆందోళనచెందుతున్నారు. ఈయన్ను వెంటనే బదిలీ చేయాలని అక్రమాలను విచారణ జరపాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

విదేశీ నూనె కంపెనీల స్వాధీనానికి తిరస్కృతి

లోక్ సభలో స్వల్పవ్యవధి ప్రశ్నకు మంత్రి జవాబు

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ముడినూనె ధరలను తగ్గించటానికి నిరాకరిస్తున్న విదేశ నూనె కంపెనీలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న సూచనను నేడు లోక్ సభలో పెట్రోలు, రసాయనాలమంత్రి శ్రీ త్రిగుణసేన్ త్రోసిపుచ్చారు.

శ్రీ చింతామణి పాణిగ్రాహి స్వల్పకాల వ్యవధి ప్రశ్నకు సమాధానం చెపుతూ విదేశ నూనె కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలను మార్చటానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని చెప్పారు. పరిస్థితులను ప్రభుత్వం గమనిస్తుందన్నారు

ప్రపంచ మార్కెట్లలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిపున్న దృష్ట్యా, విదేశ నూనె కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరిస్తుందా? లేక నూనె దిగుమతులను స్వాధీనం చేసుకుంటుందా అని శ్రీ పాణిగ్రాహి అడిగారు.

పెట్రోలియం రసాయనాల స్టేట్ మంత్రి శ్రీ డి. ఆర్. చావన్ సమాధానం చెపుతూ అలాంటి ఒప్పందాలను పునర్వ్యవస్థీకరించటం కష్టమని తెలియజేశారు.

డాక్టర్ సేన్ చర్చలో కలుగజేసుకుంటూ, నూనె శుద్ధికర్మాగారాలతో చేసుకున్న ఒప్పందాలు 15 నుండి 25 సంవత్సరాల దాకా అమలులో వుంటాయన్నారు. గడువు ముగియక ముందే ఆ ఒప్పందాలను పునర్నిర్ణయించటం సాధ్యం కాదన్నారు.

శ్రీ ధీరేశ్వర్ కలిత ప్రశ్నకు సమాధానం చెపుతూ పై ఒప్పందాలను పునర్వ్యవస్థీకరించటానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసిందని, కాని ప్రభుత్వ ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. ఈ విషయం పై చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు.

దేశాభివృద్ధికి విదేశ నూనె కంపెనీలు ఎంతో సహాయం చేశాయన్న విషయాన్ని సభ్యులు గుర్తుంచుకోవాలని అన్నారు. నూనె ధరలను తగ్గించటానికి బర్మాషెల్ కంపెనీ అంగీకరించిందని చెప్పారు.

మోటూరులో గ్రామీణ రేడియో గోష్ఠికి ప్రారంభోత్సవం

గుడివాడ, ఆగస్టు 3

గుడివాడ పంచాయతీసమితి జనసంబంధ శాఖ ఆధ్వర్యాన మోటూరు గ్రామంలో జూలై 29వ తేదీన గ్రామీణ రేడియోగోష్ఠికి ప్రారంభోత్సవం జరిగింది.

గ్రామ సర్పంచ్ శ్రీ ఎస్. గంగాధరరావు, అధ్యక్షత వహిస్తూ, ప్రతిమంగళవారం, శుక్రవారం జరిగే యీ గోష్ఠిలో పాల్గొని అధికాహారోత్పత్తికి తోడ్పడాల్సిందిగా యువరైతులకు ఉద్బోధించారు.

డా॥ లింగేశ్వరరావు శ్రీ ఆర్. ఏకాంబరంలు గోష్ఠి ప్రాముఖ్యాన్ని, లక్ష్యాలను వివరించారు.

నిడదవోలుమున్సిపల్ ఆఫీసు నిర్మాణానికి ఆమోదం

కౌన్సిల్ తీర్మానం

నిడదవోలు, ఆగస్టు 3

లక్ష 35 వేల రూపాయలతో మున్సిపల్ కార్యాలయం భవనాన్ని నిర్మించుటకు [illegible] ఆమోదిస్తూ నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీర్మానించింది

ఈ సమావేశం జూలై 30వ తేదీన వైస్ఛైర్మన్ శ్రీ బండి రామారావు అధ్యక్షతన జరిగింది.

సమావేశంలో కౌన్సిలర్ శ్రీ టి.వి.రత్నం మాట్లాడుతూ, కార్యనిర్వహణాధికారి శ్రద్ధవహించి ఈ కార్యాలయం నిర్మించుటకు కావలసిన ఏర్పాట్లు తొందరగా చేయాల్సిందిగా కోరారు.

మున్సిపల్ ట్రాక్టరుకు అవసరమైన ట్రయిలరు కొనుటకు రు. 5 వేల 500 మంజూరు చేస్తూ మరో తీర్మానం చేశారు.

శ్రీయుతులు సూరంపూడి దాసినీడు, [illegible] మృతికి సంతాపం ప్రకటిస్తూ మరో తీర్మానం చేశారు.

నిడదవోలులో జూనియర్ కాలేజీకి రు.10 వేలు

లారీఓనర్సు అసోసియేషన్ చే

నిడదవోలు, ఆగస్టు 5

నిడదవోలులో జూనియర్ కాలేజీ కొరకై స్థానిక లారీఓనర్సు అసోసియేషన్ వారు తమ నిధుల నుండి 10 వేల రూపాయలు దానంగా యివ్వటానికై తీర్మానించారు.

పట్టణంలో ఇతర వర్గాలనుండి కూడా విరాళాలు ఉదారంగా వసూలు చేయుటకు కాలేజీ కమిటీ వారు కృషిచేస్తున్నారు.

జూనియర్ కాలేజీని ఆగస్టు 1 నుండి ప్రారంభించుటకు ప్రభుత్వం నుండి అనుమతి లభించింది. (వి వి)

మంత్రి తిమ్మారెడ్డికి పశ్చిమగోదావరిజిల్లా మాజీసైనికుల మొర

ఏలూరు, ఆగస్టు 5

పశ్చిమ గోదావరిజిల్లా మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జూలై 31వ తారీఖున ఏలూరులో రాష్ట్ర మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డిని కలుసుకొని మాజీ సైనికుల కష్టసుఖాలను గురించి మెమోరాండం సమర్పించారు.

మాజీ సైనికులకు భూములు కేటాయించినప్పటికీ అవి పంపకంలో విపరీతమైన జాప్యం జరుగుచున్నదని అలాగే ఉద్యోగాల విషయంలో కూడానని మంత్రిగారికి నివేదించుకున్నారు. మాజీ సైనికులకు తగిన సహాయం చేయగలనని మంత్రి చెప్పారు.

రంజీ ట్రోఫీకి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ టీమ్ ఎన్నిక

గుంటూరు, ఆగస్టు 5

రంజీ ట్రోఫీ పోటీకి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున వెళ్ళే టీములో క్రింది వారు ఎన్నికయ్యారు.

శ్రీయుతులు వి. మహేంద్రకుమార్ (కెప్టెన్), వి రామప్రసాద్ (వైస్ కెప్టెన్) డి. మహేశ్వరసింహా, పి. ఆర్.పి. గుప్తా, ఎవ్. వెంకటరావు, ఎం. ఎస్. ప్రభాకర్ రాజు, కె. చంద్రశేఖర్‌రావు, జి. ఎస్. ఎన్. రాజు, ఆర్. వి. వి కె ప్రసాద్, సుల్తాన్ సలీమ్, [illegible], కె. ప్రభాకర్ రామమూర్తి, ఎస్. రఘు, కె. భాస్కరరెడ్డి, జి. చిన్నానింగయ్య.

తిరువూరులో జూనియర్ కాలేజికై రు. 51 వేలడిపాజిట్

తిరువూరు, ఆగస్టు 3

తిరువూరు జూనియర్ కాలేజీ కమిటీవారు జూలై 30వ తేదీనాటికి కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి పేరుతో స్టేట్ బ్యాంకులో రు. 51 వేలు డిపాజిట్ చేశారు.

ఈ విషయం ఎడ్యుకేషనల్ కార్యదర్శి, విద్యాశాఖామంత్రికి తెలియజేశారు.

విజయవాడలో ఆంధ్రసారస్వత పరిషత్తు పరీక్షలు

విజయవాడ, ఆగస్టు 5

ఆంధ్ర సారస్వత పరిషత్తు (హైదరాబాదు) వారి తెలుగు ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలు వచ్చే నవంబరులో జరుగుతాయి. దరఖాస్తులు ఆగస్టు 16వ తేదీలోగా విజయవాడ కేంద్రానికి పంపవలెను.

పూర్తి వివరాలను "[illegible] సేవ, హిందీ నికేతన్, [illegible] విజయవాడ-2" అను చిరునామాకు వ్రాసి తెలుసుకొనవచ్చును.

సభలు—సమావేశాలు

గుంటూరుజిల్లా విద్యార్థి [illegible] సమావేశం [illegible] ఆగస్టు 10వ తేదీ ఉదయం 11 గంటలకు [illegible] జరుగుతుంది. [illegible]

బ్యాంకుల జాతీయం బిల్లుకు లోక్‌సభ ఆమోదం

ప్రభుత్వరంగ సంస్థల యాజమాన్యంలో ప్రప్రథమంగా కార్మికులకు ప్రాతినిధ్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 4

"పాటిల్ ఎక్కడ?" అంటూ కమ్యూనిస్టు సభ్యులు ఆనందాతిశయంతో కేకలు వేస్తుండగా, లోక్‌సభ నేటి రాత్రి బ్యాంకుల జాతీయకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది.

మూడు గంటలపాటు లోక్‌సభ అదనంగా సమావేశం జరిపి 27 క్లాజులలో మిగిలిన 21 క్లాజులను, మూడు షెడ్యూలులను ఆమోదించింది.

ఆఖరి గంటలో యీ బిల్లును తృతీయ పఠనానికి తీసుకొన్నందుకు నిరసనగా స్వతంత్రపార్టీ, జనసంఘం సభ్యులు వాకౌట్ చేశారు.

బిల్లును ఆమోదించిన చారిత్రాత్మక సమయంలో స్వతంత్రపార్టీ, జనసంఘసభ్యుల స్థానాలు ఖాళీగా వున్నాయి.

అయితే జనసంఘం సభ్యుడు న్రపాన్ రోబే మాత్రం వాకౌట్‌లో పాల్గొనలేదు.

నేడు ఆమోదించిన బిల్లు క్రింద 14 బడా బ్యాంకులను జాతీయం చేయడంతోపాటు ప్రభుత్వ రంగ పరిశ్రమల యాజమాన్యంలో ప్రథమంగా కార్మికులకు ప్రాతినిధ్యం యిస్తారు.

ఈ బిల్లు నిబంధనలకు ఈరోజు ప్రతిపాదించిన సవరణల క్రింద తాత్కాలిక సలహా బోర్డులలోనూ, బ్యాంకు సంరక్షకులలోనూ, అలాగే రిజర్వు బ్యాంకుతో సంప్రదించి కేంద్ర ప్రభుత్వం, జాతీయం చేయబడిన బ్యాంకుల పునర్వ్యవస్థీకరణ జరిగిన అనంతరం ఏర్పాటు చేసే డైరెక్టర్ల బోర్డులలోనూ ఉద్యోగులకు ప్రాతినిధ్యం యిస్తుంది.

ఆఖరి నిముషంలో నష్టపరిహార పథకం క్రింద ప్రభుత్వం చేసిన మార్పుల ప్రకారం "పూర్వపు బ్యాంకుల"కు మాత్రం నష్టపరిహారం యిస్తారు గాని వాటాదార్లకు మాత్రం రాదు.

4. 5 శాతం వడ్డీతో వున్న 10 సంవత్సరాల ప్రభుత్వ బాండ్లను 5.5 శాతం వడ్డీతో వున్న 30 సంవత్సరాల బాండ్లను యీ బ్యాంకులు తీసుకోవచ్చు లేదా అలాగే వుంచుకోవచ్చు.

ఈ బాండ్లను తీసుకోదలచిన బ్యాంకులు అనుకొంటే ముందుగా తాత్కాలికచెల్లింపుగా తమ మూలధనంలో సగం తీసుకోవచ్చు. అయితే తీసుకొన్న యీ మొత్తం వాటాదార్లకు పంపిణీ చేయాలన్న షరతుతోనే

భారతదేశంలోవున్న విదేశీ బ్యాంకులను గూడా జాతీయం చేయాలని యస్.యస్.పి. సభ్యులొకరు నేడు డిమాండ్ చేశారు.

జాతీయంచేయబడిన బ్యాంకుల పెన్షనర్లకు ఆయన ప్రతిపాదించిన సవరణకు రెండు ఓట్లు మాత్రమే వచ్చాయి.

బ్యాంకుల ఆవరణలో ఉద్యోగుల ప్రదర్శనపై విధించబడిన నిషేధం జాతీయం చేయబడిన బ్యాంకులకు వర్తింపరాదన్న జనసంఘం సభ్యుని సవరణ 20-153 ఓట్లతో ఓడిపోయింది.

తృతీయపఠనం సందర్భంగా క్లాజులు ఆమోదించినప్పుడు దొర్లిన అనేక పొరపాట్లను సరిదిద్దారు.

బిల్లు కొద్దిక్షణాలలో ఆమోదింపబడుతున్నదనగా విద్యుచ్ఛక్తి పోయిన కారణంగా లైట్లు ఆరిపోయాయి. మైక్రోఫోనులు పనిచేయలేదు.

కొద్దిక్షణాలలోనే తిరిగి లైట్లు వచ్చాయి. అనంతరం హర్షధ్వానాలమధ్య బిల్లు ఆమోదించబడింది.

వామపక్షాల పూర్తి మద్దతు

బ్యాంకుల జాతీయకరణ బిల్లు చర్చ సందర్భంగా వామపక్ష పార్టీలు బిల్లును పూర్తిగా బలపరిచాయి.

అయితే కమ్యూనిస్టు సభ్యులు బ్యాంకింగ్ కంపెనీల రెగ్యులేషన్ చట్టంలోని 36 (ఎ) (డి) క్లాజుకు తీవ్ర అభ్యంతరం పెట్టారు. కమ్యూనిస్టు సభ్యులు శ్రీ యోగేంద్రశర్మ, మార్క్సిస్టుసభ్యులు శ్రీ రామమూర్తి మాట్లాడుతూ, యీబిల్లును బలపరుస్తున్నామంటే ఒక్కసారిగా యిది సోషలిజం తెస్తుందని కాదనీ, ఆర్థికవ్యవస్థపై గుత్తపెట్టుబడిదారుల పట్టును సడలించడానికి మరో చర్యఅని దానిని బలపరుస్తున్నామని అన్నారు.

బిల్లుకు సవరణలు ఆమోదించిననాడే తృతీయ పఠనం కూడదన్న పటోడియా పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను స్పీకర్ ఖాదిల్కర్ తిరస్కరించడంతో స్వతంత్రపార్టీ సభ్యులు వాకౌట్ చేశారు.

తరువాత జనసంఘ పక్ష నాయకుడు శ్రీవాజ్‌పాయ్‌మాట్లాడుతూ, యీబిల్లును తొందరతో ఆమోదించుతున్నారనీ జాతీయకరణ ద్వారా సోషలిజం సాధించలేరని అనుకొంటున్నారనీ అన్నారు. తరువాత జనసంఘ సభ్యులు వాకౌట్ చేశారు.

హర్షధ్వానాలు

జనసంఘ సభ్యులు శ్రీ స్వామీ బ్రహ్మానంద్ బ్యాంకుల జాతీయకరణ సాహసోపేతమైన చర్య అని ప్రధానిని అభినందించడంతో కాంగ్రెస్, కమ్యూనిస్టు సభ్యులు హర్షధ్వానాలు చేశారు.

డి. ఎం. కె. సభ్యుడు శ్రీ కంఠప్పన్ ఈ చర్య పట్ల హర్షం ప్రకటించారు.

జాతీయం చేయబడిన బ్యాంకుల సలహా బోర్డులలో డిపాజిటర్లకు, ఉద్యోగులకు, రైతులకు, చిల్లరవ్యాపారులకు ప్రాతినిధ్యం యివ్వాలన్న శ్రీ మధులిమాయే తదితరుల సూచనకు న్యాయశాఖ మంత్రి గోవిందమీనన్ అంగీకరించారు.

అయితే పై బోర్డులలో పార్లమెంటు సభ్యులకు ప్రాతినిధ్యం యివ్వాలన్న సూచనను తిరస్కరించారు.

బ్యాంకింగ్ కంపెనీల చట్టంనుండి 36(ఎ)(డి) క్లాజులను తొలగించడానికి మంత్రి తిరస్కరించారు.

కాంగ్రెసులో సిద్ధాంతపరమైన చీలిక అవసరం

శ్రీ జయప్రకాశ్ వివరణ

కోహిమా, ఆగస్టు 3

1972 సాధారణ ఎన్నికల అనంతరం కాంగ్రెసులో సిద్ధాంత ప్రాతిపదికపై అతివాదుల, మితవాదుల మధ్య చీలిక రావాలని సర్వోదయ నాయకులు శ్రీ జయప్రకాశ్ నారాయణ అన్నారు.

గతరాత్రి ఇక్కడ అడ్మినిస్ట్రేటివ్ స్టడీ సర్కిల్ సమావేశంలో ప్రసంగిస్తూ పై విధంగా చెప్పారు.

తమిళనాడ్ మంత్రివర్గం విస్తరణ

శ్రీ నెడుంచెజియన్‌కు తిరిగి స్థానం

తమిళనాడ్, ఆగస్టు 4

పదిమంది సభ్యులుగల తమిళనాడు మంత్రివర్గం నేడు 13మంది సభ్యులకు విస్తరించబడటంతో, మాజీ మంత్రి శ్రీ నెడుంచెజియనకు తిరిగి మంత్రి వర్గంలో స్థానం లభించింది.

శ్రీ వి. ఆర్. నెడుంచెజియన్ మాజీ విద్యా మంత్రి. డి. ఎం. కె. పార్టీ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి. ఈయనతో పాటు మంత్రి వర్గంలో స్థానం లభించిన మిగతా ఇద్దరు శ్రీయుతులు ఎన్. వి. నటరాజన్, కె. వేలువేదన్‌లు.

నూతన మంత్రివర్గ సభ్యుల పేర్ల జాబితాను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి, గవర్నర్ శ్రీ ఉజ్జల్ సింగ్‌కు రాజభవన్‌లో సమర్పించారు.

ముఖ్య మంత్రి విజ్ఞప్తికి గవర్నర్ ఆమోదించినట్టు రాజభవనంనుండి వార్త వెలువడింది.

ఈ క్రిందివిధంగా వివిధ శాఖలు తిరిగి కేటాయించబడ్డాయి:

శ్రీ కరుణానిధి ముఖ్యమంత్రి. నెడుంచెజియన్‌కు విద్యా, పౌర ఆరోగ్యశాఖలు. కె. ఏ. మదియళగన్‌కు ఆర్థికశాఖ. టి. ఎన్. ముత్తుకు వ్యవసాయశాఖ. ఎన్. వి. నటరాజన్‌కు వెనుకబడిన తరగతులమంత్రిత్వశాఖ. మణ్ణైగంకు ఆహారశాఖ. ఎస్. మాధవన్‌కు పరిశ్రమలశాఖ. సాదిక్ పాషాకు పబ్లిక్ వర్క్స్ శాఖ. ముత్తుస్వామికి స్వపరిపాలనశాఖ. అదిలనార్‌కు సహకారశాఖ. కె.వి. సుబ్బయ్య దేవాదాయశాఖ. రామన్‌కు విద్యుత్‌శాఖ. విజయేందరన్‌కు కార్మికశాఖ.

కృష్ణానది మట్టం తిరిగి పెరుగుదల

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఆగస్టు 4

విజయవాడలో కృష్ణాబ్యారేజివద్ద కృష్ణా నది నీటిమట్టం తిరిగి నేడు పెరగటం ప్రారంభించింది. రాత్రి 10 గంటలకు 10.1 అడుగుల నీటిమట్టం ఉన్నది. సాయంత్రం 6 గంటలకే 10 అడుగులకు నీటిమట్టం పెరిగింది. నది దిగువభాగాన గల గ్రామాలకు ప్రమాద సూచకంగా ప్రాథమిక హెచ్చరిక చేయబడింది.

మహారాష్ట్రలోగాని లేక కృష్ణ ఎగువ ప్రాంతాలలో గాని వర్షాలవల్ల కృష్ణ నీటి మట్టం పెరుగుతున్నట్టు భావించబడుతోంది. విజయవాడ ఆనకట్టవద్ద తలుపులన్నీ తెరచి నీరు వదిలి వేశారు. నది వేగంగా ప్రవహిస్తోంది.

జగ్గయ్యపేట వద్దనున్న ముక్త్యాలలో నది మట్టం సాయంత్రం 6 గంటలకు 33.6 అడుగులున్నట్లు సమాచారం అందింది. అందువల్ల రాగల 24 గంటలలో బ్యారేజివద్ద నీటిమట్టం మరొక అడుగుకుపైగా పెరగవచ్చుని భావిస్తున్నారు.

నీటి మట్టం 12 అడుగులకు పెరిగితే అధికార్లందరూ జాగరూకులై గమనిస్తుంటారు. 14 అడుగులకు చేరగానే పల్లపు ప్రాంతాలను ఖాళీ చేయిస్తారు.

రాష్ట్ర ఎగుమతుల్లో రు.2కోట్ల పెరుగుదల

శిరోజాలకు అగ్రస్థానం

హైదరాబాద్, ఆగస్టు 4

1968 69 యేడాది చివరి భాగంలో అంతకు క్రితం యేడాది అదే కాలంతో పోల్చుకున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎగుమతులలో రు. 2 కోట్లకు పైగా పెరుగుదల సంభవించింది.

ఆంధ్రప్రదేశ్ నుంచి శిరోజాల ఎగుమతి బాగా పెరిగింది.

1969 మార్చి మాసాంతానికి రు. 13.7 కోట్ల మేరకు ఎగుమతులు జరిగాయి. క్రితం యేడాది అదే కాలంలో రు. 11.6 కోట్ల ఎగుమతులు జరిగాయి.

ఎగుమతి అయిన సరకులలో పొగాకు, పసుపు, జీడిపప్పు, [illegible], గ్రనైట్, మెడి మాంగనీస్, [illegible], చేతిపనులు, [illegible], ఇంజనీరింగ్ ఉత్పత్తులు వున్నాయి.

ప్రతిపక్షాలతో ప్రధాని చర్చలు

స్పీకర్ ఎన్నిక సమస్యపై

న్యూఢిల్లీ, ఆగస్టు 4

లోక్‌సభ స్పీకర్ పదవికి తగిన అభ్యర్థిని నిర్ణయించే విషయంపై ప్రధాని ఇందిరా గాంధి పార్లమెంటులోని పలువురి ప్రతిపక్ష నాయకులతో నేడు చర్చలు జరిపారు.

ప్రస్తుతం [illegible] పేర్లలో ఖాడిల్కర్, హనుమంతయ్యా, ధిల్లాన్ తదితరులు వున్నారు.

ప్రతిపక్షంవారు ఫలానావారిని నుంచవలసిందిగా చెప్పలేదని తెలుస్తున్నది.

ప్రతిపక్ష సభ్యుల్లో ఎవరినైనా స్పీకర్ పదవికి నిర్ణయించితే బాగుంటుందని కొంతమంది ప్రతిపక్ష నాయకులు సూచించారని తెలుస్తున్నది.

కాంగ్రెస్ పార్టీలోగూడా స్పీకర్ ఎన్నిక సమస్యపై భేదాభిప్రాయాలున్నాయని తెలుస్తు

ఆగస్టు 15న ఎన్నిక జరుగవలసివుంది.

ప్రతిపక్షాలతో ప్రధాని జరిపిన చర్చలలో శ్రీ ధిల్లాన్ పేరు వినవచ్చింది.

శ్రీ ధిల్లాన్‌కు అన్నిప్రతిపక్షపార్టీలనుంచి మద్దతు లభించకపోయినా, కాంగ్రెసు పార్టీ శ్రీ ధిల్లాన్‌ను నిలబెడితే గెలిచే అవకాశం వుంది.

ఒకవేళ శ్రీ ధిల్లాన్ కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా నిలబడితే తాము బలపర్చడానికి అభ్యంతరం లేదని కమ్యూనిస్టుపార్టీ తెలియచేసింది.

నేడు ప్రధాని శ్రీమతి గాంధీని శ్రీయుతులు హిరేన్‌ముఖర్జీ (కమ్యూ) పి. రామమూర్తి (మార్క్సిస్టు), వాజ్‌పాయ్ (జనసంఘ్), నాథ్ పాయ్ (ఎస్. ఎస్. పి.), ఎస్. ఎన్. ద్వివేది (పి. ఎస్. పి.) కృష్ణ మనోహరన్ (డి. ఎం. కె) ప్రభృతులు కలుసుకున్నారు.

జూట్ కార్మికులసమ్మెపై ప్రభుత్వ ప్రకటనకు డిమాండ్

పార్లమెంటుఉభయసభలలో

న్యూఢిల్లీ, ఆగస్టు 4

పశ్చిమబెంగాల్‌లో జూట్ కార్మికులసమ్మెపై ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలని కమ్యూనిస్టు సభ్యులు శ్రీ భూపేష్‌గుప్తా నేడు రాజ్యసభలో డిమాండ్ చేశారు.

కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను యజమానులచే అంగీకరింపచేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యఏమిటో తెలుసుకోవాలని వుందన్నారు.

పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఈవిషయాన్ని పరిశీలిస్తోందని, తీసుకోవలసిన చర్యలన్నీ తీసుకుంటున్నదని కార్మిక మంత్రి శ్రీ జైసుఖ్‌లాల్ హాథి తెలియచేశారు.

ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారని? శ్రీ భూపేష్ ప్రశ్నించగా పారిశ్రామిక వివాదం ఏర్పడితే ఆ వివాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించవలసి వుంటుందని, జూట్ పరిశ్రమ ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ మారకం లభ్యమవుతుంది కనుక కేంద్రప్రభుత్వం కల్పించుకొన్నదని విదేశ వాణిజ్య స్టేట్ మంత్రి ఈ విషయాన్ని పరిష్కరించే నిమిత్తం కలకత్తా వెళ్ళారని మంత్రి తెలియజేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని పరిశీలిస్తున్నాయని రాజ్యసభ చైర్మన్ స్థానంలోనున్న శ్రీ అలీఅక్బర్‌ఖాన్ పేర్కొని సభను వాయిదా వేశారు.

లోక్‌సభలో కూడా అనేకమంది ప్రతిపక్ష సభ్యులు పశ్చిమబెంగాల్ జూట్‌మిల్లు కార్మిక సమ్మెపై ప్రకటన చేయాలని విదేశీ వాణిజ్య మంత్రిని, కార్మిక మంత్రిని కోరారు.

ఈ విషయాన్ని పరిశీలించవలసిందిగా సభాధ్యక్షుడు శ్రీ పి. కె. వాసుదేవనాయర్ పార్లమెంటరీ వ్యవహారాలమంత్రిని కోరారు.

ట్రాక్టర్ కొన్నతర్వాత అమ్మకుండా ఆంక్ష

2ఏండ్లపాటువిధించటానికి ప్రభుత్వ యోచన

న్యూఢిల్లీ, ఆగస్టు 5

ట్రాక్టర్లను కొనుగోలు చేసిన తదుపరి రెండు సంవత్సరముల వరకు తిరిగి అమ్మరాదని కొన్ని ఆంక్షలను విధించనున్నట్లు కేంద్ర పారిశ్రామికాభివృద్ధిశాఖ మంత్రి నేడు లోక్‌సభలో తెలియజేశారు.

శ్రీ యస్. కె. తిప్పరయ్య ప్రశ్నకు సమాధానం చెపుతూ, ట్రాక్టర్లను బ్లాక్‌మార్కెట్లో అమ్ముతున్నట్లుగా కొన్ని ఫిర్యాదులు వచ్చాయన్న విషయాన్ని అంగీకరించారు.

ట్రాక్టర్లను సరఫరా చేయటానికి వేయి రూపాయలు అడ్వాన్సుగా చెల్లించాలని కొంతమంది ఉత్పత్తిదారులు, డీలర్లు పట్టుబడుతున్నట్లు ఒక ఫిర్యాదు అందిందన్నారు. రు. 100 లకంటే ఎక్కువగా అడ్వాన్సును తీసుకోరాదని ప్రభుత్వం ఒక ఉత్తర్వును జారీచేసిందన్నారు.

ట్రాక్టర్ల ఉత్పత్తిని పెంచటానికి ప్రభుత్వం వీలైనన్ని చర్యలు తీసుకున్నది. 30 వేల ట్రాక్టర్లను ఉత్పత్తి చేయుటానికి లైసెన్సులు మంజూరు చేయబడినవి. కాని 15 వేల ట్రాక్టర్లు మాత్రమే ఉత్పత్తి అవుతున్నవి. ఈ సంవత్సరం 20 వేల ట్రాక్టర్లు ఉత్పత్తి కాగలవని శ్రీ అహమ్మద్ తెలియజేశారు.

ట్రాక్టర్ల పరిశ్రమపై లైసెన్సు పద్ధతిని ప్రభుత్వం రద్దుచేసిందని, ట్రాక్టర్ల ఉత్పత్తికి ప్రభుత్వం ప్రోత్సాహమిస్తుందని ఆయన చెప్పారు.

20 అశ్వశక్తికి తక్కువగల ట్రాక్టర్లను ఉత్పత్తి చేయరాదనే విధానాన్ని ఆయన సమర్థించారు. ప్రభుత్వరంగంలో 20 అశ్వశక్తి కన్న తక్కువగల ట్రాక్టర్లను ఉత్పత్తి చేయటానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఈ విషయంపై సత్వరమే నిర్ణయం తీసుకోబడుతుందని చెప్పారు. ఈ పథకం పూర్తయినట్లయితే 50 వేల ట్రాక్టర్లు అదనంగా లభిస్తాయని చెప్పారు.

1973 - 74 నాటికి సంవత్సరానికి 58 వేల ట్రాక్టర్లు అవసరమౌతాయని ప్లానింగ్ కమిషన్ అంచనా వేసిందని, కాని ఈ సంవత్సరానికే 70 వేల ట్రాక్టర్లు కావాలని, 1973 - 74 నాటికి 90 వేల ట్రాక్టర్లు అవసరమౌతాయని వ్యవసాయశాఖ తెలియజేసిందన్నారు.

రోమ్, ఆగస్టు 3

రాజకీయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఇటలీలో నూతన ప్రభుత్వం ఏర్పాటుకు మరోసారి ప్రయత్నించమని తాత్కాలిక ప్రధాని మారియానో రూమర్‌ను అధ్యక్షుడు సారాగత్ నేటి రాత్రి కోరారు.

పార్లమెంటులో మైనారిటీ అయిన క్రిస్టియన్ డెమొక్రాట్ ప్రభుత్వం ఇటీవల పతనమైన విషయం పాఠకులకు విదితమే.

కాంగ్రెస్ ముఠా కీచులాటల్లో ప్రజాస్వామ్యం బలి: శ్రీ వి. వి. గిరి హెచ్చరిక

తిరువనంతపురం, ఆగస్టు 4

దేశ ఐక్యతకు చిహ్నంగా, రాజ్యాంగ రూపకల్పనా నిర్ణేతలు ఏర్పాటు చేసిన రాష్ట్రపతి పదవికి అభ్యర్థిని ఎన్నిక చేయడంలో తామొక్కరికే బాధ్యతవున్నట్లు యింకెవ్వరికీ లేనట్లుగా కాంగ్రెసు పార్లమెంటరీబోర్డు ప్రవర్తించిందనీ, దానిలోని 8 మంది సభ్యులు ఓటింగ్ ప్రాతిపదికమీద కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ "గర్విష్టితనంతో" ప్రవర్తించిందని శ్రీ వి. వి. గిరి యిక్కడన్నారు.

తిరువనంతపురం ప్రెస్‌క్లబ్‌లో పత్రికల వారితో మాట్లాడుతూ ఈ విషయంచెప్పారు.

కాంగ్రెస్‌లోని ముఠాతగవులతో భారత దేశంలోని ప్రజాస్వామ్య భవిత్వాన్ని నష్టపరచడాన్ని అంగీకరించగూడదనీ, కాంగ్రెస్ పార్టీ యీ విషయంలో న్యాయమైనమార్గాన్ని అనుసరించి వుండాల్సింది అనిఅన్నారు.

కాంగ్రెస్ తమ తాత్కాలిక సిఫారసులను ప్రతిపక్ష పార్టీల వారికి తెలియచేసి మొత్తం ఏకాభిప్రాయాన్ని సేకరించి వుండాల్సిందని శ్రీ వి. వి. గిరి అన్నారు.

ఉప రాష్ట్రపతిని రాష్ట్రపతిగా నియమించాలన్న సాంప్రదాయాన్ని మార్చడంలో ఔచిత్యం యేమిటని ? ప్రశ్నించారు

లోక్‌సభ స్పీకర్‌గా, డిప్యూటీ స్పీకర్‌ను నియమించాలని హోం మంత్రి వాదించడాన్ని ఆయన ప్రస్తావించారు.

రాష్ట్రపతి ఎన్నికలు యీ కొలత ఎందుకు తీసుకోగూడదని అన్నారు, "రాజుకో న్యాయం, పేదకో న్యాయమా" అని" ఆయన అన్నారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికపై ప్రతిపక్షాలతో చర్చలు

శ్రీ భూపేష్ డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ఉపరాష్ట్రపతి ఎన్నిక సమస్యపై ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపాలని రాజ్యసభలో కమ్యూనిస్టు సభ్యులు శ్రీ భూపేష్ గుప్తా, స్వతంత్ర పార్టీ సభ్యులు శ్రీ లోక్‌నాథ్ మిశ్రా నేడు డిమాండ్ చేశారు.

రాజ్యసభకు అధ్యక్షత వహించవలసిన ఉపరాష్ట్రపతిని యెన్నుకొనే విషయమై ప్రతిపక్షంతో సంప్రదించటం 1962 సంవత్సరం నుండి వస్తున్న సాంప్రదాయం అన్నారు.

ప్రతిపక్ష పార్టీలతో సంప్రదించడానికి యింకా వ్యవధి వున్నదని శ్రీ భూపేష్ గుప్తా డిమాండ్‌ను లోక్‌నాథ్ మిశ్రా బలపరిచారు. ప్రతిపక్షాలనుండి సహకారం కావాలని అనుకొంటే సంప్రదింపులు ప్రారంభించవచ్చునని అన్నారు

అయితే యీ సూచనలను ఎస్. ఎస్. పి. సభ్యుడు రాజ్‌నారాయణ్ తిరస్కరించారు.

శ్రీ గిరికి అకాలీదళ్ మద్దతు

చండీగఢ్, ఆగస్టు 4

రాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్న శ్రీ వి. వి. గిరికి పూర్తి మద్దతు ఇవ్వడానికి అకాలీదళ్ వర్కింగ్ కమిటీ నేడొక సమావేశంలో ఇక్కడ ఏకగ్రీవంగా నిర్ణయించింది.

తమ రెండవ ఓటును ఎవరికి వేయరాదని కూడా వర్కింగ్ కమిటీ తీర్మానించింది.

1972 నాటికి ఒకినావాదీవిని జపానుకు యివ్వరట

అమెరికా విదేశాంగ శాఖ ప్రకటన

వాషింగ్‌టన్, ఆగస్టు 4

పసిఫిక్ మహాసముద్రంలోని ఒకినావా దీవిని 1972 నాటికి జపానుకు యిచ్చివేయవలసిందిగా జపాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అంగీకరించినట్లు టోక్యో నుండి వచ్చిన వార్తలు వాస్తవం కావని అమెరికా విదేశాంగశాఖ నేడు తెలిపింది.

ఆ దీవిలో అణ్వాయుధాలు లేకుండా వుండేందుకు అమెరికా విదేశాంగమంత్రి విలియం రోజర్సు, జపాన్ విదేశాంగ మంత్రి కిచీకి మధ్య ఒప్పందం కుదిరినట్లు గత శనివారం జపాన్ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఒకినావా దీవిని జపానుకుయిచ్చి వేయడానికి అమెరికా అంగీకరించిందనీ, కాని ఒక నిర్ణీత తేదీకాని, షరతులనుగాని అంగీకరించలేదని అమెరికా విదేశాంగశాఖ తెలిపింది. కీలకమైన యీ సైనిక స్థావరాన్ని ద్వితీయ ప్రపంచ యుద్ధంలో అమెరికా యీ దీవిని ఆక్రమించుకుని, వినియోగించుకొంటోంది.

ఇండియన్ జూట్ మిల్స్

అసోసియేషన్‌లో చీలికలు;

కార్మికుల వేతనాల హెచ్చింపుసమస్యపై

అసోసియేషన్‌కు కొన్ని కంపెనీల సలాం

కలకత్తా, ఆగస్టు 4

పశ్చిమబెంగాల్‌లోని "జూట్ మిల్లును నడుపుతున్న బర్డ్ అండ్‌కో ఇండియన్ జూట్‌మిల్స్ అసోసియేషన్‌నుండి రాజీనామా చేసింది.

[illegible] యీ అసోసియేషన్‌నుండి రాజీనామా యిచ్చింది.

కార్మికులతో సంప్రదించి వేతనాలకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించుకోవాలని యీ కంపెనీలు కోరుతున్నాయని యు. ఎన్. ఐ. విలేకరి వ్రాస్తున్నారు.

నేడిక్కడ జరిగిన జూట్ అసోసియేషన్ సమావేశంలో వేతనాలు పెంచే విషయంపై తీవ్ర భేదాభిప్రాయాలు వచ్చాయని, కొంతమంది సభ్యులు నిష్క్రమించారని [illegible] తెలుస్తున్నది.

కృష్ణాజిల్లా గన్నవరంలో [illegible] నెలకొల్పేందుకు [illegible] పరిశీలిస్తోంది

40 వేల టన్నుల కిరోసిన్ దిగుమతికి ప్రభుత్వ ప్రయత్నం

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ప్రస్తుత సంవత్సరానికి 40 వేల టన్నుల కిరోసిన్ ఆయిల్‌ను దిగుమతిచేసుకోవడానికి [illegible] ప్రభుత్వం పరిశీలిస్తుంది.

సోవియట్ యూనియన్ సరఫరా చేయనున్న 50 వేలటన్నుల కిరోసిన్ ఆయిల్ కాక, అదనంగా పై మొత్తాన్ని దిగుమతిచేసుకోవాలని ప్రభుత్వం భావిస్తుంది.

[illegible] ఇరాన్ ఇంకా యితర దేశాల నుండి కిరోసిన్ ఆయిలు దిగుమతి చేసుకోవటానికి [illegible] వచ్చాయి.

ప్రస్తుతం దేశంలో [illegible] తెలియచేశారు.

అపోలో యాత్రికులు తెచ్చినరెండో పెట్టెలోని చంద్ర శిలలు

మరింత నల్లగా వున్నట్టు వెల్లడి

హూస్టన్, ఆగస్టు 4

అపోలో - 11 అంతరిక్ష యాత్రికులు తమతో తెచ్చిన రెండవ పెట్టెలోని చంద్రశిలలు గత వారం తెరచిన మొదటి పెట్టెలో వాటికంటె, ఎక్కువ నల్లగాను, బూడిద రంగుగాను వున్నాయని శాస్త్రవేత్తలు నేడు తెలియజేశారు.

అంతరిక్ష యాత్రికులు ఆరమ్‌స్ట్రాంగ్ ఆల్డ్రిన్‌లు తెచ్చిన చంద్రశిలల చుట్టూగల పైభాగాన్ని అంతరిక్ష సంస్థ భూగర్భ శాస్త్రవేత్త డాక్టర్ డోనాల్డ్‌ఫ్లోరి చెక్కి అది బూడిద వర్ణం కలిగి ఎండినబురదలావుందని వర్ణించారు.

చిన్న షోవెల్‌తో ఆ పెట్టెనుండి చంద్రశిలల బూడిదను పైకితీయగా, అదిపైకి పొగలాలేచిందనీ, దాన్ని సులువుగానే ఒక పాకెటులో కట్టడం సాధ్యమైందని ఆయన చెప్పారు.

చంద్రశిలల ధూళిని టెలివిజన్‌లో చూస్తుంటే, అందులో చిన్నచిన్న తునకలు వున్నట్లు కనిపించాయి.

రాళ్ళు సంచి అడుగున ధూళిలో కప్పబడి వున్నాయి.

మొదటి పెట్టెలోని చంద్రశిలల ధూళిని పరిశీలించగా, వివిధ రూపాలలో మెరిసే చిన్న చిన్న తునకలు కనిపించాయి.

మొదటి పెట్టె ఖాళీ ప్రదేశంలో తెరవబడింది. రెండవ పెట్టెను నత్రజనితో కూడిన పరిసరాల్లో తెరవాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ప్రాణవాయువు, బొగ్గుపులుసు గాలి వగైరా వాయువులలో చంద్రశిలలో ఎట్టి మార్పు సంభవించలేదని తెలుసుకున్న తర్వాత, నత్రజని వాయువుతోనిండిన పరిసరాల్లో దాన్ని తెరవడం జరిగింది.

అంతరిక్షయాత్రికులు ముగ్గురి ఆరోగ్యం బాగావుందని, అయినా వారు మరో వారం పాటు క్వారంటైన్‌లో వుంటారని తెలియచేయబడింది.

ఉక్కు కొరత పరిష్కారానికి మంత్రివర్గ చర్చలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ఇంజనీరింగ్ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్రమైన ఉక్కు కొరత పరిష్కారానికి తగు విధానం రూపొందించేందుకు ఉక్కు మంత్రిత్వశాఖ, పారిశ్రామికాభివృద్ధి మంత్రిత్వశాఖ సీనియరు అధికారుల మధ్య సంప్రదింపులు జరుగుతున్నాయి.

ఉక్కు కొరత తాత్కాలికమే అని ఉక్కు మంత్రిత్వశాఖ వర్గాలు తెలియజేస్తున్నాయి. బొకారో ఉక్కు ఫ్యాక్టరీ ఉత్పత్తి ప్రారంభించగానే, దేశావసరాలకు సరిపోయే ఉక్కు లభ్యం కాగలదని తెలియజేస్తున్నారు.

ప్రస్తుతం ఉక్కు దిమ్మలు, షీట్లు వగైరా సామగ్రి కొరతగా వుందని పారిశ్రామిక ప్రతినిధి తెలియజేశారు.

రాజకీయాలనుండి శ్రీ వీరరాఘవులు నిష్క్రమణ

అమలాపురం, ఆగస్టు 4

తమకు ఏ కమ్యూనిస్టుపార్టీతో సంబంధం లేదని అమలాపురంనుండి శ్రీ కె. వీరరాఘవులు ప్రకటిస్తున్నారు.

మార్క్సిస్టుపార్టీ నుండి విడిపోయి శ్రీనాగిరెడ్డి గ్రూపులోచేరివున్నామనరీ కమ్యూనిస్టుపార్టీ తరపున అమలాపురం తాలూకా కార్యదర్శిగా పనిచేశానని ఆ పదవికి 1969 జనవరిలోనే రాజీనామా చేశానని ఆయన ప్రకటించారు.

రాజకీయరంగం నుండి విరమించుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన వివరించారు.

ట్రాక్టరుక్రింద పడి ఒక వ్యక్తి మృతి

పొన్నూరు, ఆగస్టు 4

గుంటూరుజిల్లా పొన్నూరులో యీ నెల 3 వ తేదీన శ్రీ చంద్రమౌళి ఆసుపత్రివద్ద కోటయ్య అనే మేదరి కార్మికుడు ట్రాక్టరు క్రిందపడి అక్కడికక్కడే చనిపోయాడు. శవాన్ని పోస్టుమార్టంకు పంపించారు. యస్. ఐ. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేరళ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం

తిరుగుబాటు కాంగ్రెసు నాయకునిచే నోటీసు

తిరువనంతపురం, ఆగస్టు 4

కేరళ తిరుగుబాటు కాంగ్రెసు నాయకుడు శ్రీ కె. యం. జార్జి కేరళ సంయుక్త ప్రభుత్వంపై రేపు ప్రారంభం కానున్న వర్షాకాల సమావేశంలో చర్చించేందుకు వీలుగా విశ్వాస రాహిత్య తీర్మానం ప్రవేశపెడుతూ నోటీసు యిచ్చారు.

ముగ్గురు తపాలా ఉద్యోగులు నిర్దోషులని ఢిల్లీమేజిస్ట్రేట్ తీర్పు

న్యూఢిల్లీ, ఆగస్టు 5

కరోల్‌బాగ్‌మండలం తంతితపాలాశాఖకు చెందిన ముగ్గురు వుద్యోగులు నిర్దోషులని న్యూఢిల్లీ మేజిస్ట్రేట్ తీర్పుయిచ్చారు. గత సంవత్సరం సెప్టెంబరు 19 సమ్మె సందర్భంలో చట్టవిరుద్ధంగా సమావేశాలు జరిపారని వారిపై నేరాలు ఆరోపించారు.

సమ్మె సందర్భంగా నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన 3 వేలమంది రాజధాని వుద్యోగులపై పెట్టిన కేసులు మేజిస్ట్రేటు కోర్టులలో యింకా తేలకుండా వున్నాయి. మొదటిసారిగా పై ముగ్గురిని నిర్దోషులుగా తీర్పు చెప్పారు.

అరెస్టు చేయబడిన వుద్యోగుల తరఫున న్యాయవాదిగా శ్రీ వి. కె. కృష్ణమీనన్ మేజిస్ట్రేటు కోర్టులో హాజరయ్యారు.

కావలెను

మా దినపత్రికలు ఇంటింటికి తిరిగి ఇచ్చుటకు పనివారలు కావలెను. జీతము నెల 1కి రు. 85/లు (డిపాజిట్ రు. 300/-) విజయవాడలో నివసించువారికి మాత్రమే. స్వయంగా కలుసుకొనుము.

నిమ్మగడ్డ వెంకటకృష్ణారావు & సన్స్,
ఏలూరురోడ్, విజయవాడ-2.

దావా సమను

మహారాజశ్రీ కొత్తగూడెం ఏజన్సీ మున్సిఫ్ కోర్టులో

O.S. No. 5 of 1969

నందువట్ల రాజయ్య — వాది
మధురత్రేజ — ప్రతివాది

To
మధురత్రేజ w/o వెంకన్ age 35. occ. Employee at (5) incline Dispensary, R/o (5) incline Quarter No.142, Kothagudem Tq. — ప్రతివాది.

వాది ప్రోనోటుకు రూ. 326.25 పైసలు రాబట్టుకొను నిమిత్తం దావావేసి యున్నారు. దావాలో మీరు హాజరు అగుటకు నోటీసు నిమిత్తం ది 20-8-1969 తేదీ వాయిదా వేసినారు. సదరు తేదీ ఉదయం 10.30 గంటలకు మీరుగాని, మీ తరపు వకీలుద్వారాగాని హాజరై ఆక్షేపణలు తెలియచేసుకొనని యెడల, మీ పరోక్షమందు దావా తీర్మానింపబడునని ఇందుమూలముగా మీకు తెలుపు కొనవలెను.

(సం.) బొల్లేపల్లి లక్ష్మీనారాయణ,
B.A.LL.B. Advocate
Kothagudem Collieries

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

డైరక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్: చిరాగ్ అలీలేన్, హైదరాబాద్.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారిచే "గుంతకల్‌వద్ద" స్థాపించబడిన మోడల్ టానరీలో ఉత్పత్తి అయిన తోళ్ళ అమ్మకానికి సోల్ సెల్లింగ్ ఏజంటుగా ఒకసంవత్సరానికి వ్యవహరించడానికి స్థిరపడిన వ్యాపారులు సంస్థల నుండి సంతృప్తికరమైన దరఖాస్తులు కోరబడుచున్నవి.

బ్యాంక్ లావాదేవీలతోసహా, సెల్లింగ్ ఏజెన్సీని స్వీకరించటానికి తాము ఆమోదించవలసిన షరతులు, నియమాలు దరఖాస్తుదార్లు తెలియచేయాలి. దరఖాస్తులు అందిన తర్వాత డీలర్‌షిప్ కాలపరిమితి సంప్రదింపుల ద్వారా నిర్ణయించబడును.

ఏజెన్సీ కంట్రాక్టు ప్రారంభంలో ఒక ఏడాదికి యివ్వబడుతుంది. ఆ పని పరిస్థితిని బట్టి ఎప్పటికప్పుడు గడువు పొడిగించబడుతుంది.

'సెల్లింగ్ ఏజెన్సీ - గవర్నమెంటు మోడల్ టానరీ - గుంతకల్' పేర 30-8-1969 తేదీకి ముందుగా ఈ క్రింది సంతకందారు చిరునామాకు దరఖాస్తు చేరేటట్లు పంపుకోవాలి.

ఉత్పత్తిఅయ్యే తోళ్ళ రకాలు వగైరా ఇతర వివరాలు, సూపరింటెండెంటు గవర్నమెంట్ మోడల్‌టానరీ-గుంతకల్ వారి వద్ద నుండి వ్రాతమూలకంగా గాని స్వయంగా గాని తెలుసుకొనవచ్చును.

(సం.) టి.యల్. శంకర్
అడిషనల్ డైరక్టర్,
ఇండస్ట్రీస్ డిపార్టుమెంటు.

బి-టెక్స్
తామర, దురద, మరుపులకు
బి-టెక్స్
బొంబాయి

కృష్ణా-గుంటూరు జిల్లాల్లో చెరువుల మరమ్మతు పథకం

రు. 40 లక్షలు వ్యయం కాగలదని అంచనా : ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నియామకం

విశాలాంధ్ర విలేకరి

విజయవాడ, ఆగస్టు 4

ఇటీవలి తుపాను మూలంగా కృష్ణా, గుంటూరు జిల్లాలలో గండ్లుపడిన, దెబ్బతిన్న చెరువులను శాశ్వతంగా బాగుచేసేందుకుగాను ప్రత్యేకంగా చెరువుల డివిజన్ ఇంజనీరింగ్ శాఖను ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధిపత్యం క్రింద ఏర్పాటుచేశారు.

ఈ రెండు జిల్లాలలోను 47వేల ఎకరాలకు నీరు సరఫరా చేసే వంద చెరువులను 40 లక్షల రూపాయల ఖర్చుతో బాగుచేసేందుకు కార్యక్రమం రూపొందించారు. వాటిని బాగుచేసేందుకు 1 సంవత్సరం పట్టవచ్చని అంచనా.

విజయవాడ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైన ఈ చెరువుల డివిజన్ క్రింద గుంటూరుజిల్లాలోని కొన్ని తాలూకాలు కృష్ణాజిల్లాలోని గన్నవరం, విజయవాడ, నందిగామ, తిరువూరు, నూజివీడు తాలూకాలు చేర్చబడినాయి.

కృష్ణాజిల్లాలో 75 చెరువులు, గుంటూరు జిల్లాలో 25 చెరువులు ఈ డివిజన్ క్రింద బాగుచేయబడతాయి.

గుంటూరు జిల్లా నర్సారావుపేటలో ఒక సబ్ డివిజన్ ఏర్పాటు చేస్తున్నారు.

తుపానులో దెబ్బతిన్నచెరువులను తాత్కాలికంగా బాగుచేసే పనిని మామూలుగా ఇంతకుపూర్వం ఉన్న డివిజన్లు నిర్వహిస్తున్నాయి. ఈ బాధ్యతను ప్రత్యేక డివిజన్ చేపట్టబోతోంది. చెరువుల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ టి. సుబ్బారాయుడు తెలియపరిచారు.

కృష్ణాజిల్లాలోని విజయవాడ తాలూకాలో 12 లక్షల 85 వేలు, గన్నవరం తాలూకాలో 3 లక్షల 10వేలు, తిరువూరులో 4 లక్షల 81 వేలు, నందిగామలో 3 లక్షల 40 వేల నూజివీడు తాలూకాలో 40 వేల రూపాయలు చెరువుల మరమ్మతులకు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని అంచనా వేశారు.

గండ్లుపడిన, దెబ్బతిన్న చెరువుల కట్టలకు ఇప్పటివరకు చేసిన మరమ్మతులు తాత్కాలికమైనవి మాత్రమే. ఆ చెరువు కట్టలకు శాశ్వతమైన మరమ్మతులు చేయాల్సివుంది.

రాష్ట్రంలో రు. 50 కోట్ల ఎరువుల వాడకం

హైదరాబాద్, ఆగస్టు 3

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయదారులు రు. 50 కోట్ల విలువచేసే ఎరువులను రు. 3 కోట్ల విలువచేసే క్రిమి సంహారక మందులను వాడుతారని వ్యవసాయశాఖ డైరెక్టర్ నేడిక్కడ చెప్పారు. రాష్ట్రంలో నాలుగు వ్యవసాయ శిక్షణా కేంద్రాల ఇన్‌స్ట్రక్టర్ల, సిబ్బంది సమావేశాన్ని ప్రారంభిస్తూ యీ విషయాన్ని ఆయన చెప్పారు.

నిర్దిష్ట శిక్షణ, విద్యాబోధనద్వారా 10 శాతం ఎరువుల నష్టాన్ని రైతులు కాపాడగలరని డాక్టర్ రెడ్డి చెప్పారు. అలాగే క్రిమిసంహారక ఔషధాల వినియోగంపై చక్కగా తర్ఫీదు యిస్తే రు. 50 లక్షల ఔషధాలు నష్టపడకుండా చూడగలరని ఆయన అన్నారు.

శ్రీ డి. పి. మిశ్రాకు సుప్రీంకోర్టు అనుమతి

న్యూఢిల్లీ, ఆగస్టు 5

రాష్ట్ర శాసనసభకు 1962 ఎన్నికను రద్దు చేస్తూ రాష్ట్ర హైకోర్టు యిచ్చిన తీర్పుపై అప్పీలు చేసుకొనేందుకు మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ డి. పి. మిశ్రాకు సుప్రీమ్ కోర్టు అనుమతిచ్చింది.

శ్రీ డి. పి. మిశ్రా ఎన్నికను సవాలు చేస్తూ పెట్టిన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు ఆమోదించింది. హైకోర్టు తన తీర్పును చెప్పకముందే తిరిగి 1967 లో శ్రీ మిశ్రా శాసనసభకు ఎన్నికయ్యారు.

భార్యాభర్తలు పిల్లలతో సహా చూడతగిన గొప్ప హిందీచిత్రం

సాధనా సంజయ్ బల్‌రాజ్ సహాని ఇంకా

ఏక్ ఫూల్ దో మాలి

ఈస్ట్‌మన్ కలర్

విజయవాడ శ్రీనివాస

రాజమండ్రి అప్సర

దివి తాలూకాలో యాగ్లగడ్డ, వక్కలగడ్డ మొదలైన గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరద వరిపైరు పొలాలను ముంచివేసిన దృశ్యం

దివి తాలూకాలో వరి పొలాలు వరద పాలు

డెల్టా రైతుసంఘ ప్రతినిధుల ప్రకటన

విజయవాడ, ఆగస్టు 5

కృష్ణాజిల్లాలో ఇటీవలనే ఊడ్పులు పూర్తయినాయి. ఇంతలోనే వర్షాలు పడటంతో వరిపైరు పూర్తిగా నీట మునిగిపోయింది. తిరిగినూతనంగానాట్లు వేయాలన్నా నారు దొరకడం కష్టం కాబట్టి, రైతుల గోడు వర్ణనాతీతంగావుంది. మురుగు నీటి పథకాలను నిర్వహించడంలో ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ వహించనందున ఈ దుస్థితి సంభవించింది. ఆంధ్రప్రదేశ్ డెల్టా రైతు సంఘ ప్రతినిధులు దివి తాలూకాలో పర్యటించి వివరాలు తెలియజేస్తున్నారు.

డెల్టా రైతు సంఘం అగ్రనాయకులు ఎలమంచిలి భాస్కరరావు, గొర్రెపాటి చంద్రశేఖరరావు (ఘంటసాల) వేములపల్లి సత్యనారాయణ (చిట్టూర్పు) పర్యటించి వివరాలు సేకరించిన వారిలో గలరు.

ఎడతెరిపిలేకుండా గత 24 వ తేదీనుండి కురిసిన భారీవర్షాలకు దివితాలూకాలో రేగోడు భీమనది, కూచిపూడిడ్రైను, పల్లకాలువ, గంజికాలువ, బోరగుడిచేను, అయినంపూడి డ్రైను, గుండేరు, శిల్లలవాగు పొంగి కపిలేశ్వరపురం ముళ్ళపూడి. అయినంపూడి కుసుమద్దాలి. కనుమూరు శేరీదగ్గుమిల్లి, చినముత్తేవి, పెదముత్తేవి. కూచిపూడి పెదపూడి, మొవ్వ, మొవ్వపాలెం, తురకపాలెం, రుద్రవరం, చింతలపూడి. మల్లపల్లి, ఘంటశాల, కొడాలి, దేవరకోట, దాలిపర్రు, లక్ష్మీపురం, లంకపల్లి, చిట్టూర్పు,వక్కలగడ్డ వేములపల్లి గ్రామాలలోని పల్లపు వరిచేలు నీటిలో మునిగిపోయాయి. గత అయిదారు రోజులనుండి నీటిలోమునిగియున్నవి. పైరుకు నీటిలో గాలి తగలక అవిశిపోయి కుళ్ళిపోనారంభించినది.

గంజికాలువ, శిల్లలవాగుల ఘంటశాల గ్రామందగ్గర గుండేరులో కలిశాయి. ఇచట వరద బీభత్సం అతి భయంకరంగా ఉన్నది. ఎటుచూచినా వరిపొలాలు నీటిలో మునిగి సముద్ర దృశ్యాలను మించిపోయినవి. మునిగిన వరిపైర్లపై నీరు నిలిచి తెప్పలు కొట్టుచున్నవి.

శిల్లలవాగు వరద నీటిలో వక్కలగడ్డ చిట్టూర్పు. వేములపల్లి గ్రామంలో వరిపైరు 80శాతంమునిగిపోయాయి.మునిగిన పొలాలను రైతు చూచుకొని పంటలు పోయినందుకు ఆందోళనపడుచున్నారు. వేసవిలో వచ్చిన తుపానువల్ల ఈ గ్రామాలలో దాళవా, ప్రత్తి చెరుకుపంట పాడై దక్కకుండా పోయింది. తిరిగి ఇపుడు సార్వా నాటిన పైర్లు గూడ శిల్లలవాగు ముంపువల్ల పాడైపోయాయి

గంజికాలువ, గుండేరులు ఘంటశాల గ్రామాన్ని మూడువైపులా ముట్టడించాయి. గ్రామం చుట్టూ ఎటుజూచినా తెల్లగా సముద్రాన్ని పోలిన దృశ్యాలు కనిపించుచున్నవి. మునిగిన పొలాలు తక్షణం వర్షాలు తగ్గితేతప్ప అయిదారు రోజులవరకుగాని తేలవు. కొన్ని వ్యవసాయక్షేత్రాలు పూర్తిగాపాడైపోయినవి. మరి కొన్ని నాళ్ళవరకు పైరైనా దక్కే అవకాశంలేదు. తిరిగి నాట్లువేయుటకు నారు దొరుకుటలేదు.

పైన ఉదహరించిన మురుగు కాలువలు పూడికవేసి మెరకలు తేలినవి. శిల్లలవాగులోను మరికొన్ని మురుగుకాలువలలో నాచు, తూడి, గుర్రపుడెక్కకాడ, జమ్ము దట్టంగా మొలిచి మురుగునీటిని దిగువకు దిగజారనివ్వకుండా అడ్డి, ముంపును పెంచుచున్నవి. ఏ మురుగుకాలవ వెంట వెళ్ళి చూచినా కరకట్టలు లేవు, ఎక్కడైనా అవి వున్నా ముంపునీటిని ఆపే అంతపెద్దవిగా లేవు.

గుండేరు ముంపును జూస్తే వరదలు వచ్చినపుడు బుడమేరు దృశ్యాలు జ్ఞాపకం చేశాయి. గుండేరును ఆయకట్టు మేరకు లోతును, వెడల్పును పెంచాలి.

పలుగుల గండికి ఇదివరలో ఏర్పాటు చేసిన మూడు అడుగుల వ్యాసం గల 18 ఖానాలను రెట్టింపుచేయాలి. ఇపుడు దాదాపు రెండు అడుగుల నీటి లెవెలును పలుగుల గండి ఎగువన ఆపుచున్నది.

శిల్లలవాగులో వక్కలగడ్డ, చిట్టూర్పు, చల్లపల్లి, దేవరకోట శివార్లలో జమ్ము, గుర్రపుడెక్కకాడ దట్టంగాపెరిగి మురుగు నీటిని దిగజారనీయటంలేదు. అందువల్ల 16, 18, 20 కాంటోరులలోగలపొలాలుగూడ ముంపుకు గురియగుచున్నవి. దివితాలూకాలో ఈ మురుగుకాలవల ముంపువల్ల దాదాపు 14 వేల ఎకరాలలో పైర్లు పాడైపోయాయి.

వేసవిలో తుపాను, ఇపుడు వరదలు వచ్చి దాళవా, సార్వా రెండు పంటలు పాడైపోయినవి. రైతులు చాలా దయనీయ పరిస్థితులలో ఉన్నారు.

దివి తాలూకాలో ఈ మురుగు కాలువలను ప్రభుత్వం వెంటనే త్రవ్వించి ముంపునుండి రైతులను కాపాడకపోతే ఇచటి ప్రజలకు ఏకైక జీవనాధారం వ్యవసాయమే గాబట్టి. అట్టి జీవనాధారాన్ని కోల్పోతే ఉద్భవించే పరిస్థితులను ప్రభుత్వం గమనించాలి.

వ్యవసాయరంగానికి ప్రణాళికలలో అత్యధిక ప్రాధాన్యత నిచ్చామని ప్రభుత్వం చెప్పుచున్నది. అలా ఉన్నత స్థానాన్ని వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిజేయుటకు ప్రభుత్వం కల్పించి కృషిచేసియుంటే చరిత్రలో ఇది వరకు మున్నెన్నడూ మురుగునీటిలో మునగని విలువైన వ్యవసాయ క్షేత్రాలు యిపుడు ఎందుకు మునిగిపోవుచున్నవి?

ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధి పద్ధతిలో చెప్పేదొకటి చేసేదొకటిగా యున్నదని రైతులు విమర్శించుచున్నారు.

గాన వెంటనే దివి తాలూకాలోని మురుగు కాలవలను అభివృద్ధిజేసి ముంపు సమస్యను పరిష్కరించుటకు ప్రభుత్వం కృషి చేయాలి.

కాజ రామనాథం ప్రకటన

"ఇటీవల 10 రోజులుగా కురిసిన వర్షాలు రైతులకు తీవ్ర నష్టం కలుగజేశాయి. మురుగు కాల్వల ప్రక్కనున్న వేలాది ఎకరాలలో నాట్లు వేయడానికి వీలులేకపోగా, వూడ్చిన వరిపైరు నీట మునిగిపోయింది. గుడివాడ, బందరు, కైకలూరు తాలూకాలో మురుగు కాల్వలు పొంగి పల్లపు ప్రాంతాలంతా జలమయమై పోయాయి" అని ఇటీవల అతివృష్టిపై శాసన సభ్యుడు శ్రీ కాజ రామనాథం ఒక ప్రకటన చేశారు.

వెంటనే ప్రభుత్వం జరిగిన నష్టాన్ని సేకరించి ఈ సంవత్సరం దాళ్వా పంట ఆపి- మురుగు కాల్వలు మరమ్మత్తు చేయకపోతే - డెల్టా ప్రాంతమంతా శాశ్వతంగా నాశనమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన తన ప్రకటనలో హెచ్చరించారు.

ఎరువులపై లెవీ విధింపు తప్పనిసరి

లోక్‌సభలో ప్రధాని సమర్థన

న్యూఢిల్లీ, ఆగస్టు

ఈ సంవత్సరపు బడ్జెట్‌లో ఎరువులపై లెవీ విధింపును ఎవరూ హర్షించలేదు. కాని వనరుల ఆవశ్యకత ఎక్కువగా వుండటంచేత లెవీవిధించడం తప్పనిసరి అయిందని శ్రీమతి ఇందిరాగాంధీ నేడు లోక్‌సభలో ప్రభుత్వ చర్యను సమర్థించారు.

సామాన్య ప్రజల సంక్షేమం దృష్ట్యా 14 బడా బ్యాంకుల్ని జాతీయం చేసిన అనంతరం, మాజీ డిప్యూటీ ప్రధాన మంత్రి శ్రీ మురార్జీ తన హయాంలో ఎరువులపై విధించిన లెవీని కూడా ఉపసంహరిస్తారా అని శ్రీ బి. పి. త్యాగి ప్రశ్నించారు.

శ్రీమతి గాంధీ సమాధానమిస్తూ శ్రీ త్యాగి ప్రశ్న సబబుగా లేదని, ఎరువులపై లెవీ విధించాలని నిర్ణయించడం వ్యక్తిగత విషయం కాదన్నారు, యావత్తు మంత్రివర్గం దీనిని నిర్ణయించిందని, దీనిని ఎవరూ హర్షించడంలేదని శ్రీ మురార్జీ కూడా సభలో తెలియజేశారని శ్రీమతి గాంధీ పేర్కొన్నారు.

వనరుల ఆవశ్యకత చాలా ఎక్కువగా వుండటంచేత లెవీ విధించడం తప్పని సరైందన్నారు.

ఒక్క రైతులనేకాక దేశంలోని యావత్తు సామాన్య ప్రజలనుకూడా దృష్టిలో వుంచుకోవాలన్నారు.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
షోరూములను సందర్శించండి

మీరు కోరుకొనిన అన్ని సోవియట్ ప్రచురణలను - నవలలు, చిన్నకథలు మార్క్సిజం - లెనినిజం సాహిత్యపు గ్రంథములు, చిన్నపిల్లల పుస్తకాలు సామాన్యశాస్త్రంపై పుస్తకాలు, సైన్సు, టెక్నాలజీపై టెక్స్ట్‌బుక్స్ మరియు అనేక ఇతర గ్రంథములు లభించును. ఈ పుస్తకములు ఇంగ్లీషులోను మరియు తెలుగుతోసహా అన్ని ఇతర భారతీయ భాషలలోను లభించును. ఆకర్షణీయముగా తయారు చేయబడినవి - తక్కువ ధర. లెనిన్ శతజయంతిఉత్సవముల సందర్భంగా సోవియట్ ప్రచురణలు అన్నీ ప్రత్యేక తగ్గింపు ధరలకు లభించును.

ఈ సదవకాశాన్ని జారవిడువకండి

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరురోడ్ సెంటర్, విజయవాడ-2
విశాలాంధ్ర బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైద్రాబాద్.

ADMARK

దక్షిణ మధ్య రైల్వే

1. ఇపుడు డోర్నకల్ వరకు నడచుచున్న నెం. 397 ఖాజీపేట - విజయవాడ పాసింజరు 3—8—1969 వ తేదీ నుండి విజయవాడ వరకు నడచునట్లు పునరుద్ధరించబడినది. నెం. 398 అప్ 4—8—1969 వ తేదీ నుండి విజయవాడ నుంచి నడచునట్లు పునరుద్ధరించబడినవి.
2. నెం. 331 మరియు, 332 పాసింజరు బళ్లు సికింద్రాబాద్ - ఖాజీపేటల మధ్య నడచుటకు వరుసగా 4—8—1969 మరియు. 5—8—1969 న పునరుద్ధరించబడినది.
3. నెం. 349 మరియు. 350 పాసింజరు బళ్లు హైదరాబాద్ - పూరీ - విశాఖల మధ్య నడచునట్లు పునరుద్ధరించబడినవి. 1—4—1969 పబ్లిక్ టైమ్ టేబుల్‌లో తెలియజేసిన టైముకు వరుసగా హైదరాబాద్‌లో 4—8—1969న పూరీ - విశాఖలో 5—8—1969 న బయలుదేరును.

331/332 మరియు 397/398 బండ్లు సికింద్రాబాద్ -ఖాజీపేట మరియు ఖాజీపేట-విజయవాడల మధ్య సంగ్రహ టైములు వరుసగా ఈ క్రింద ఈయబడినవి.

331 డౌన్				332 అప్
20—00	డిపార్చర్	సికింద్రాబాద్	ఎరైవల్	10—10
0—10	ఎరైవల్	ఖాజీపేట	డిపార్చర్	5—50

397 డౌన్				398 అప్
6—40	డిపార్చర్	ఖాజీపేట	ఎరైవల్	20—20
10—15	ఎరైవల్	డోర్నకల్	డిపార్చర్	16—30
10—45	డిపార్చర్	,,	ఎరైవల్	16—10
15—45	ఎరైవల్	విజయవాడ	డిపార్చర్	11—00

ఇతర స్టేషన్‌లలోని టైములకొరకు ఆయా స్టేషన్‌మాష్టర్లను సంప్రదించండి.

ఛీఫ్ ఆపరేటింగ్ సూపరింటెండెంట్,
సికింద్రాబాద్.

PUB. 151/69.



నేడే
సుఫల
[20:20:0•18:18:9•15:15:15]
వాడండి
తరువాత
పుష్కలమైన
పంటను పొందండి

ఊడ్పులకు ముందే, దమ్ముచేసిన పొలంలో సుఫలను వేయండి. పుష్కలమైన పంట కిదే శ్రీరామరక్ష. పైరు పిలకవేసే కాలంలో మరల సుఫలను చల్లండి. సుఫలను వేయటం చాలా సులభం. కలుపు తీతలో దాన్ని నేలలో కలిపేట్లు చేయండి. ఈ విధంగా పైరు జవసత్తువలను ఇనుమడింప చేయండి.

సుఫల మిశ్రమాలన్నీ వరికి వాడదగినవే. మీ భూమిలోవున్న పొటాష్ పరిమాణాన్ని బట్టి మీకు కావలసిన మిశ్రమాన్ని ఎన్నుకోండి.

ఉచిత సేద్య సలహాలకూ, భూసార పరీక్షలకూ:

सुफला
ఎగ్రోనమిస్ట్
ఏరియా ఆఫీస్
ది ఫెర్టిలైజర్ కార్పొరేషన్
ఆఫ్ ఇండియా లి.,
ట్రాంబే యూనిట్
5-10-173, ఫతేమైదాన్ రోడ్డు,
హైదరాబాదు ఫోన్: 37616

పనిభారానికి - ప్రమాదాలకు సంబంధం లేదట : రైల్వే మంత్రి వింత సమాధానం

న్యూఢిల్లీ, ఆగస్టు 4

రైల్వే ప్రమాదాలకు రైల్వే సిబ్బంది పని గంటలకు సంబంధం ఏమీ లేదని, పని భారం వల్ల ప్రమాదం జరుగుట లేదని నేడు రాజ్యసభలో రైల్వే స్టేట్ మంత్రి శ్రీ పరిమళఘోష్ అన్నారు.

రైల్వేలమంత్రి చేసిన ప్రకటనపై జరుగుతున్న చర్చలో జోక్యం చేసుకుంటూ జూన్ 21, జూలై 14 న జరిగిన పెద్ద రైలు ప్రమాదాలు డ్రైవర్లు 18 గంటలసేపు విశ్రాంతి తీసుకొని డ్యూటీలోకి ఎక్కిన రెండు గంటలలోనే జరిగాయని శ్రీ ఘోష్ అన్నారు.

పశ్చిమ రైల్వేల లెక్కల ప్రకారం 90 శాతానికిపైగా ప్రమాదాలకు కారణాలు పనిగంటలుకాదని తేలిందని ఆయన అన్నారు.

అదనపు పనిగంటలవల్ల ప్రమాదాలు పెరిగి పోతున్నాయని సభ్యులు లేవనెత్తిన అంశాలను మంత్రి తిరస్కరించారు.

1951 లో కన్నా రైల్వేలు ప్రయాణించే దూరం రెట్టింపు కాగా ప్రమాదాలు ఒకటిలో మూడవ వంతు తగ్గాయి. నేడు రైళ్లు రోజుకు 58,000 కిలో మీటర్లు ప్రయాణం చేస్తున్నాయని 10,000 రైళ్లు రోజుకు పది లక్షల మంది రైల్వే సిబ్బందితో నడుపబడుతున్నాయని మంత్రి అన్నారు.

ప్రయాణీకుల భద్రతకు సంబంధించి కుంజ్రూ కమిటీ చేసిన 377 సిఫారసులలో 355 సిఫారసులను ఆమోదించామనీ అందులో 326 అమలు పెట్టామని మిగతా సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి అమలు జరుపుతామని మంత్రి అన్నారు.

పనిగంటలు

ఎట్టి పరిస్థితులలోనూ రన్నింగ్ స్టాఫ్ రోజుకు 12 గంటలకన్నా ఎక్కువ పని చేసేందుకు అనుమతించబోమని అంగీకరించారని. అవసరాల ప్రాతిపదికపై కనీస వేతనాల నిర్ణయానికి రైల్వేలు ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి అన్నారు.

జూన్ 21 న [illegible] జరిగిన రైలు ప్రమాదంపై న్యాయ విచారణ జరిపించాలని ప్రతిపక్ష సభ్యులు తొలుత డిమాండ్ చేశారు.

విద్రోహ చర్యవల్ల ఈ ప్రమాదం జరిగిందని రైల్వే శాఖచేసిన ప్రకటనను వారు అనుమానించారు, రైల్వే శాఖ జరిపిన విచారణ తృప్తికరంగాలేదని ప్రతిపక్ష సభ్యులు అన్నారు.

రైల్వేమంత్రి రాజీనామాచేయాలని కొంత మంది అన్నారు. విచారణ జరుగక ముందే ప్రమాదానికి కారణం విద్రోహకచర్యఅని మంత్రి ప్రకటించినందుకు చాలా మంది తీవ్రంగా విమర్శించారు.

పొసగని పొంతన

రైల్వేలమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసేవారు బెంగాల్ శాసనసభలో జరిగిన సంఘటనపై శ్రీ జ్యోతిబాసు కూడా రాజీనామా చేయాలని అడగాలని శ్రీ పి. సి. మిత్రా (కాం) అన్నారు.

రైల్వేశాఖలోని క్రిందిస్థాయిలో రన్నింగ్ స్టాఫ్‌పై తీరని పనిభారం పడుతున్నదని బంగ్లా కాంగ్రెసు సభ్యుడు శ్రీ పి. కె. ముఖర్జీ అన్నారు.

ప్రయాణీకులకు రక్షణ కల్పించలేని రైల్వేలమంత్రి రాజీనామా చేయాలని, ప్రమాదాలపై విచారణ జరిపేందుకు "త్రైపాక్షిక [illegible]" ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు సభ్యులు శ్రీ కె. ఎస్. రాయ్ అన్నారు.

[illegible] సంవత్సరాలుగా రైల్వే ప్రమాదాలు పెరుగుతూనే వున్నాయని శ్రీ ఎ. పి. చటర్జీ (మార్క్సిస్టు) అన్నారు.

రైల్వే ఆస్తిని సంరక్షించేందుకు ప్రత్యేక పోలీసుశాఖను ఏర్పాటు చేయాలని శ్రీ నిరంజన్ వర్మ (జనసంఘ్) అన్నారు.



బహాదూర్
దారాసింగ్
మెచ్చిన టీ

బహాదూర్ టీ

BAHADUR
DUST TEA
A TATA-FINLAY TEA
క్రొత్త

దారాసింగ్
అంటున్నాడు:

"నేను త్రాగే టీ చిక్కగాను, సంతుష్టికరంగాను ఉండాలి. అందుచేత, నేను ఎప్పుడు బహాదూర్ టీ మే త్రాగుతాను."

మీరు కూడ బహాదూర్ టీ ని ఎంచుకోండి. టీల్లో వస్తాదనిపించుకొన్న టీ. సంతృప్తిపరచే టీ. ప్రతి ప్యాకెట్టునుండి అనేక కప్పుల చిక్కని, కమ్మని టీ లభిస్తుంది. 50,100,500 గ్రాముల సైజులలో వస్తుంది.

టాటా-ఫిన్‌లే టీ

సోల్ సెల్లింగ్ ఏజెంట్లు : ది టాటా ఆయిల్ మిల్స్ కం. లి.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ప్రింటర్ అండ్ పబ్లిషర్ టి. వెంకటేశ్వరరావు. ఎడిటర్: వేములపల్లి శ్రీకృష్ణ. ముద్రణ: స్వతంత్ర ఆర్టుప్రింటర్స్, విజయవాడ-2